ముహూర్తం
శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ పంచమి, రా.12.13 వరకు అనంతరం షష్ఠి; నక్షత్రం: ఉత్తర రా.10.14 వరకు, అనంతరం హస్త; అమృతకాలం: మ.3.40 నుండి 5.10 వరకు; వర్జ్యం:శే ఉ.7.55 వరుకు, రా.తె 6.12 నుండి... ; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, మ.12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ.3.00 నుండి 4.30 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి:57 • సంచిక:280 • శుక్రవారం 25 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore



చందా కొచ్చర్‌కు సీబీఐ షాక్

• భార్యా భర్తలపై ఎఫ్ఐఆర్ నమోదు • ఔరంగాబాద్, ముంబైలలో సీబీఐ బృందాలు ఏకకాలంలో సోదాలు

10 లో



10 లో

సోనియా, ప్రియాంక దేశ సైనికులు

యూపీలో అధికారమే ప్రియాంక లక్ష్యం
అమేథీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ

బడ్జెట్ పెట్టేది ఎవరు?

బడ్జెట్ సమావేశాల్లోగా విస్తరణ లేకుంటే కేసీఆర్ చేతుల మీదుగానే బడ్జెట్?

తెరాస వర్గాల్లో తాజాగా ఆసక్తికర చర్చ

అనేక లింకులతో మంత్రివర్గ కూర్పుపై మేధోమధనం

తక్షణ విస్తరణపై అనుమానాలు.. ఊహాగానాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను నూతన ఆర్థిక మంత్రి శాసనసభలో ప్రవేశపెడతారా? లేక సీఎం కేసీఆర్ ఈ బడ్జెట్‌ను సభలో ప్రతిపాదిస్తారా? శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలోపు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా? లేక లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాతే కేసీఆర్ మంత్రివర్గంలోకి కొత్త వారిని తీసుకుంటారా? ఇవి తెరాస వర్గాల్లో జరుగుతున్న చర్చ. కేసీఆర్ చేపట్టిన సహస్ర మహాచండీ యాగం నేటితో ముగియనుంది. బడ్జెట్ సమావేశాలకు ప్రభుత్వం సమాయత్తమవుతున్న నేపథ్యంలో మంత్రివర్గాన్ని విస్తరిస్తారన్న అవకాశాలు మెండుగా ఉన్నాయని ఓవైపు తెరాసలో చర్చ జరుగుతుండగా, మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో కొందరు సీనియర్ మంత్రులను బరిలోకి దించే అవకాశాలు ఉన్నందున కొత్త మంత్రులను చేర్చుకోకపోవచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఒకవేళ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలోపు కొత్త మంత్రులను తీసుకోని పక్షంలో శాసనసభలో సీఎం కేసీఆర్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారని అధికారులు చెబుతున్నారు. ఏకైక మంత్రిగా ఉన్న హోంమంత్రి మహమూద్ అలీ శాసనమండలిలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన 36 రోజుల తర్వాత కొత్త ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం జరిపించిన సంగతి తెలిసిందే. అంతకన్నా ముందు డిసెంబర్ 13న సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రిగా మహమూద్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు. డిసెంబర్ చివరిలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, ఆరు నుంచి ఎనిమిది మందికి కొత్తగా మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలున్నాయని ప్రచారం జరిగినా కేసీఆర్ మాత్రం ఈ ప్రక్రియ చేపట్టలేదు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ కూర్పు ఉంటుందని భావించినా

2వ పేజీలో...



2 లో

ఎర్రవల్లిలో నాలుగోరోజైన గురువారం చండీయాగంలో హారతి ఇస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు

హైకోర్టు చరాస్తులు ఇలా పంచుకుందాం

తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల సమావేశంలో నిర్ణయం

58:42
నిష్పత్తిలో విభజనకు ఏకగ్రీవ ఆమోదం

హైదరాబాద్/అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారంగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జనాభా నిష్పత్తి ప్రకారంగా హైకోర్టు చరాస్తులు పంచుకోవాలని ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ పౌర్ణమి ప్రాజెక్టు భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్.కే.జోషి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ, తెలుగు రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్లు, న్యాయశాఖ కార్యదర్శులతో కూడిన ఉన్నతస్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఇప్పటికే విజయవాడలో

7వ పేజీలో...



8 లో

కారు చీకట్లోకి దూసుకెళ్లిన ఇస్రో రాకెట్ పీఎస్ఎల్వీ సీ-44

ప్రయోగం సూపర్ సక్సెస్
కొత్త ఏడాదిలో రెండు ఉపగ్రహాలతో బోణి

ఆ నలుగురు కలిస్తే మోడీకి కష్టమే!

• ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే హంగే • ఎన్డీయేకి భారీ దెబ్బ • 86 సీట్లు తగ్గొచ్చు • మమత, మాయావతి, అఖిలేష్ యూపీయేతో కలిస్తే ఎన్డీయే ఓటమి ఖాయం • యూపీయేకి 106సీట్లు పెరిగే చాన్స్ • మూడ్ ఆఫ్ ద నేషన్స్ సర్వేలో వెల్లడి



జాతీయ బాలల పురస్కార విజేతలతో ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన ఆధిక్యం వచ్చే అవకాశం లేదని, ప్రజల తీర్పు హంగ్ దిశగానే ఉంటుందని జాతీయ స్థాయి సర్వే ఒకటి అంచనా వేసింది. అదే సమయంలో కాంగ్రెస్ సారథ్యంలోని యుపీఏ కూటమి బలం పుంజుకుంటుందని, మునుపటి కంటే 106 సీట్లు అధికంగా గెలుచుకుని, సంఖ్యాబలాన్ని 166కి పెంచుకుంటుందని సర్వే అభిప్రాయపడింది. అదే సమయంలో ఎన్డీయే 86 స్థానాలు కోల్పోయి 237సీట్లకు పడిపోయేలా కనిపిస్తోంది. ఇండియాటుడే-కార్వే సంయుక్తంగా

9వ పేజీలో...

నా ఉద్యోగం ఎలా ఉంది సార్?

కేటీఆర్‌కు ట్వీట్..
దావోస్‌లో తెలంగాణ డెస్క్‌కు కోఆర్డినేటర్ పాత్రలో ఉపాసన

9



కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం

సీఎం ఆదేశాలతో నిఘా పటిష్టం

రెండు వారాల్లో ఎనిమిది మందిపై సస్పెన్షన్ వేటు..
నలుగురి అరెస్ట్
తాజాగా ముగ్గురిపై చర్యలు
వివరాలు 2లో...



ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ధర్నాలో ఉత్తమ్, ఎల్.రమణ, భట్టి, కోదండరామ్ తదితరులు

10 లో

ఈసీని తప్పించండి

• ఎన్నికల్లో ఘోర వైఫల్యాలు
• బ్యాలెట్ బాక్స్‌లే కావాలి: ఉత్తమ్
• ఓట్ల నమోదులో వివక్ష చూపారు
• కోదండరామ్ ఆవేదన
• బ్యాలెట్ ఎన్నికలే కరెక్ట్: ఎల్.రమణ
• ఈసీ వైఫల్యాలపై నిరసన గళం

ఈవీఎంలతోనే ఎన్నికలు



ఆ మెషీన్లతో ఫుట్‌బాల్ ఆడొద్దు
గెలిస్తే అవి బాగున్నట్టా?
ఓడితే విమర్శలా?

10 లో

ఎన్నికల ప్రధాన కమిషనర్ సునీల్ అరోరా



10 లో

లాన్స్‌నాయక్ నజీర్ అహ్మద్ వనీకి
అశోక చక్ర



న్యాయం.. మరుజన్మకే?

తరాలు మారుతున్నా తెగని వ్యాజ్యాలు

• న్యాయస్థానాల్లో పేరుకుపోయిన లక్షలాది పెండింగ్ కేసులు
• 104 ఏళ్లుగా నలుగుతున్న 9 ఎకరాల భూ వివాదం
• అకోలా హైకోర్టులో 800 గజాల స్థల వివాదానికి షష్టిపూర్తి
• దేశంలో 30ఏళ్లకు పైబడిన అపరిష్కృత కేసులు 56వేల పైమాటే
• పెండింగ్ కేసుల్లో అలహాబాద్, ముంబై, మద్రాసు, కోల్‌కతా టాప్

అదొక సాధారణ వివాదం.. మొదటి ప్రపంచ యుద్ధం రోజుల్లో మొదలైంది.. తరాలు మారాయి.. కాలగమనంలో శతాబ్దాలు గిర్రున తిరిగాయి.. అయినా ఆ వివాదానికి పరిష్కారం దొరకలేదు.. ఇకపై దొరుకుతుందన్న ఆశ కనుచూపుమేరలో కనిపించడం లేదు... కానీ, దేశ చరిత్రలో సుదీర్ఘకాలం న్యాయస్థానంలో అపరిష్కృత కేసుగా చరిత్ర సృష్టించింది... మూడు తరాల కక్షిదారులకు తీవ్ర మనోవేదనను మిగిల్చింది.. అంతులేని నిరీక్షణకు గురిచేసింది.. 9 ఎకరాల స్థల వివాదం 104 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకుండా, భారత న్యాయ చరిత్రలో మిస్టరీ వ్యాజ్యంగా మిగిలిపోయింది.. ఈ కేసులో తొలితరం బాధితులు వారి భూహక్కులు తేల్చుకోకుండానే మరుభూమికి చేరారు... ఇక ఈ కేసులో తీర్పు కోసం కక్షిదారులు మరో జన్మ ఎత్తక తప్పదేమో?



న్యూఢిల్లీ/నాగపూర్: కైసర్ విల్‌హెల్మ్-2 నేతృత్వంలోని ఇంపీరియల్ జర్మన్ సైనిక బలగాలు అనివార్య యూరోపియన్ సమరానికి సిద్ధమయ్యాయి. ఇదే మొదటి ప్రపంచ యుద్ధంగా మారింది. సరజీవోలో ఫ్రాంజ్ ఫెర్డినాండొ హత్యకు గురయ్యాడు. ఆయన మరణం తాలూకు ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను రెండు వర్గాలుగా చేశాయి. ఆస్ట్రియా-హంగేరికి వ్యతిరేకంగా సెర్బియాకు మద్దతుగా రష్యా తన బలగాలు రణక్షేత్రానికి మళ్లించింది. ఈ అడుగు అసాధారణ, సుదీర్ఘ ఘర్షణలకు దారితీసింది. ఢిల్లీలో బ్రిటీష్ పాలనలో కొత్త శకం మొదలైంది. భారత దేశ పగ్గాలను వైస్రాయ్ లార్డ్ హేర్డింగ్ చేపట్టారు. ఇండియాను తొలి ప్రపంచ యుద్ధానికి సమాయత్తం చేయసాగాడు. ఇదే సంవత్సరంలో పాట్నాకు 40 కి.మీ దూరంలోని కొయిల్వార్ చెంతనున్న ఓ కుగ్రామంలో భూ వివాదం ఒకటి కోర్టు గడపకు చేరింది. దర్బారీసింగ్, అవతార్‌సింగ్ అనే ఇద్దరు వ్యక్తులు అరా కోర్టులో న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. సంవత్సరాలు గడిచాయి. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసింది. రెండవ ప్రపంచ యుద్ధం మొదలై అదీ ముగిసింది. సుదీర్ఘ పోరాటం అనంతరం భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించింది. బ్రిటీషువాళ్లు మన దేశం విడిచి వెళ్లిపోయారు. ప్రధానమంత్రులు

5వ పేజీలో...



సహస్రమహా చండీయాగంలో పాల్గొన్న ఆంధ్రప్రభ, ఇండియా ఎహెడ్ ఎండి ముత్తా గౌతమ్ దంపతులు, ఎంపీలు కవిత, సంతోష్

యాగంలో ముత్తా గౌతమ్ దంపతులు

సమాజ శాంతి, దేశ ప్రజల శ్రేయస్సు కోరుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న సహస్ర మహా చండీయాగంలో గురువారం ఆంధ్రప్రభ, ఇండియా ఎహెడ్ జాతీయ న్యూస్ ఛానెల్ మేనేజింగ్ డైరెక్టర్ ముత్తా గౌతమ్, ఆయన సతీమణి సునీత పాల్గొన్నారు. వారికి యాగశాలలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. యాగకర్త ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి శుభాభినందనలు తెలిపారు.

నేడు పూర్ణాహుతితో యాగం ముగింపు

ఐదు రోజుల సహస్ర మహా చండీయాగం శుక్రవారం మధ్యాహ్నంతో ముగియనుంది. విశాఖ పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర ఆధ్వర్యంలో జగద్గురు శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థస్వామి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ మహాయాగంలో భాగంగా ప్రతినిత్యం గణపతి పూజ, శుద్ధిపుణ్య హవచనం, రుత్విక్ వర్ణం, చతుర్వేద పారాయణం, యాగశాల ప్రదక్షిణలు, గురుపూజ, గోపూజ, నవగ్రహ పూజ తదితర శాస్త్రోక్త పూజలను నిర్వహిస్తున్నారు. ఐదు యజ్ఞశాలల్లో యాగాలు కొనసాగుతున్నాయి. ఆఖరు రోజు శుక్రవారం మధ్యాహ్నం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించి రుత్వికులు, వేద పండితుల మత్రోఛారణల మధ్య సహస్ర మహాచండీ యాగానికి ముగింపు పలకనున్నారు.



శాస్త్రోక్తంగా నాల్గో రోజు

- దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు • ఎరుపువర్ణం వస్త్రాధారణలో రుత్వికులు • 400 పర్యాయాలు చండీ సప్తశతీ పారాయణం • పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతీ, పలువురు ఆధ్యాత్మిక ప్రముఖులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చేపట్టిన సహస్ర మహాచండీయాగం నాలుగవ రోజు నిరాటంకంగా, వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ యాగంలో ఉదయం నుంచి యాగకర్త కేసీఆర్ దంపతులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. రుత్వికులు, వేద పండితులు ఎరుపువర్ణం వస్త్రాలు ధరించి పూజల్లో పాల్గొన్నారు. కేసీఆర్ దంపతులు రాజశ్యామల మాత మండపంలో తొలిపూజ నిర్వహించి యాగాన్ని ప్రారంభించారు. శ్రీమహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతి స్వరూపిణిగా శ్రీ రాజశ్యామలాదేవిని సువర్ణ మంత్ర పుష్పాంజలితో ప్రార్థించారు.



వందలాది మంది రుత్వికులు వేదోక్తంగా ప్రార్థనలు చేశారు. రాజశ్యామల మండపం లో సీఎం దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం మహారుద్ర మండపంలో జరిగిన పూజలో సీఎం కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

సీఎం దంపతుల ప్రత్యేక పూజలు

మహారుద్ర సహిత రుద్ర ఏకాదశిని పఠణరుద్ర నమకం, రుద్రచమకం పఠించారు. పంచాక్షరి జపంలో భాగంగా శివశివ శంకర భూతపతే, శంకర శివ, శంభో మహాదేవ, హరహర మహాదేవ ప్రార్థనలతో యాగశాల మారుమోగింది. బ్రహ్మ స్వరూపిణి బగళాముఖి మండపంలో సీఎం దంపతుల సమక్షంలో వేదపండితులు, రుత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ నారాయణ నమస్తుతే, పీతాంబరదేవి నమస్తే, జయతే, విజయతే, జయవిమలే, బగలే అంటూ స్తుతించారు.

శతమానం భవతే అంటూ పండితులు దీవించారు. నవగ్రహ మండపంలో ఆదిత్య హృదయ పఠనం జరిగింది. సూర్య నమస్కారాలు నిర్వహించారు. చండీమాత ప్రధాన యాగశాలలో శ్రీ రాజరాజేశ్వరి మాత ప్రార్థనలు చేశారు. భువనేశ్వరి, బ్రహ్మాండ కుటుంబినీ, శ్రీ గణనాథ పార్వతీనందన, పాప విమోచన ప్రార్థనలు చేశారు. రుత్వికులు 400 పర్యాయాలు చండీ సప్తశతీ పారాయణం పఠించారు. వేదపండితులు యాగం వీక్షించడానికి వచ్చిన భక్తులకు సుభాషితాలు వినిపించారు. యాగ విశిష్టతను గురించి వివరించారు. మహా హారతితో ఉదయంపూట కార్యక్రమాలు ముగిశాయి.

శాంతి పాఠంతో మహారుద్ర యాగం ప్రారంభం

మధ్యాహ్నం కేసీఆర్ దంపతులు రాజశ్యామల యాగ మండపంలో అర్చన, శరభ శాలువ జపాలు, హోమాలు, పారాయణాలు, మారతులు, మంత్రపుష్ప పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పాంచాంగిక దీక్ష చేశారు. ఆవాహిత దేవతా పూజనము, పదివేల జపము, సుహాసినీ పూజ, హారతీ మంత్ర పుష్పము, మూల మంత్ర హవనము, హరిద్రానవము, 2వేల మూల మంత్ర హవనము తదితర కాక్రమాలు జరిగాయి. మహారుద్ర యాగం శాంతి పాఠముతో ప్రారంభమై ఆహాహిత దేవతా పూజలు, రుద్ర జపాభిషేకములు, 44 మంది రుత్వికులతో 44 ఏకాదశ రుద్ర హోమములు, అధ్యాక్త తిలలతో హోమలు, ప్రదోష పూజ, నవగ్రహ జపాదులు, పంచ కాటకములు, పంచోపనిషత్తులు, సుందరాకాండ పారాయణము, సూర్య నమస్కారములు, మహా మృత్యుంజయ జపము, హవనములను అత్యంత వైభవంగా పూర్తిచేశారు.

హాజరైన నేతలు, పలువురు అధికారులు

ప్రాతఃకాల పూజతో ప్రారంభమైన సహస్ర చండీయాగము, శ్రీచక్రార్చన, 400 సప్తశతి పారాయణములు, పూర్తిచేసిన కేసీఆర్ దంపతులు మంగళహారతి, మంత్ర పుష్పము, భజన కార్యక్రమము, తీర్థప్రసాదాల వితరణ, మాధ్యాహ్నిక కార్యక్రమాలను పూర్తిచేశారు. సాయంత్రం 4 గంటలకు లక్ష నవార్న జపాన్ని నిర్వహించారు. ఆరున్నర గంటలకు ప్రదోషకాల పూజలు,హారతి మంత్ర పుష్పము తదితర కార్యక్రమాల్లో శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రసరస్వతీ స్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి, పలువురు మాజీ మంత్రులు, కేసీఆర్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం

- సీఎం ఆదేశాలతో అటవీ సంపదపై నిఘా పటిష్టం • రెండు వారాల్లో 8 మంది అధికారులు సస్పెన్షన్, నలుగురు స్మగ్లర్లు అరెస్టు • తాజాగా గురువారం ముగ్గురు అధికారులపై చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో విస్తరించి ఉన్న అటవీ సంపదను కొల్లగొడుతున్న సందర్భాలను పసిగట్టిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నారు. పక్షం రోజుల క్రితం కఠిన చర్యలకు ఆదేశించిన నేపథ్యంలో ఉన్నతాధికారులు నిఘా పటిష్టం చేశారు. స్మగ్లర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న అటవీశాఖ ఉద్యోగులపై కఠిన చర్యలకు పూనుకుంటున్నారు. గడిచిన రెండు వారాల్లో 8 మందిపై సస్పెన్షన్ వేటువేసి నలుగురిని అరెస్టు చేసిన ప్రభుత్వం తాజాగా గురువారం మరో ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకుంది. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం, అటవీ సంపదను కొల్లగొట్టడం, స్మగ్లర్లకు సహకరించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నందున తొలిసారిగా డివిజనల్ ఫారెస్ట్ అధికారిని సైతం విధుల్లోంచి తొలగించారు.

నిజామాబాద్ నుంచి సస్పెండ్‌ల పర్వం

నిజామాబాద్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి పి.వేణుబాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.రామ్మోహన్, డిప్యూటి రేంజ్ అధికారి ఏ.శ్రీనివాస్‌లను సస్పెండ్ చేశారు. పూర్వపు నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా విస్తరించి ఉన్న అడవుల్లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న అక్రమ దందాను పూర్తిగా నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలో పోలీసులు జరిపిన ఆకస్మిక దాడుల్లో పలు వాహనాలను, ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కలప స్మగ్లింగ్‌లో నిజామాబాద్ డిప్యూటీ మేయర్ ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే ఈ దోపిడీ ఎంతకాలంగా జరుగుతుందనే అంశంపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు చేరవేస్తున్నారు. నిందితులు ఎంతటి వారైనా, అధికార పార్టీకి చెందినవారు ఉన్నా ఏమాత్రం వెనకాడకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం కేసీఆర్ ఇదివరకే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



అధికారుల మెడకు బిగుస్తున్న ఉచ్చు

నిజామాబాద్ జిల్లాలో కలప అక్రమ రవాణా దందాలో సంబంధం ఉన్న వారిపై ప్రభుత్వం ఉచ్చు బిగిస్తోంది. కలప మాఫియాకు పోలీసులే అండ ఉన్నట్లు తెలియడంతో గత నాలుగు రోజులుగా అటవీశాఖ అక్రమ రవాణాపై నిఘా పెట్టి కలప మాఫియా ఆగడాలకు కళ్ళెం వేస్తోంది. కలప మాఫియాకు సహకరించిన ఏఆర్ ఎస్ఐ షకిల్ పాషాతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటి మేయర్ ఫయీమ్ సహాపలువురిపై నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్మల్‌కు చెందిన ఇద్దరు అటవీశాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కాల్‌డేటా ఆధారంగా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

కేసీఆర్ ఆదేశాలతో విస్తృత తనిఖీలు

కలప అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపాలంటూ కేసీఆర్ ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో అటవీశాఖ పోలీసులతో కలిసి విస్తృతంగా తనిఖీలు చేపడుతోంది. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల సంయుక్త తనిఖీల్లో ఇటీవల దుంగలు దొరకటం, వాటిపై విచారిస్తున్న క్రమంలో తీగ లాగితే డొంకంతా కదులుతోంది.

సామిల్లులపై అధికారుల పటిష్ట నిఘా

గత రెండు రోజుల్లో కలప అక్రమాలపై రెండు సామిల్లులను అధికారులు సీజ్ చేశారు. ఇవి స్థానిక ప్రజా ప్రతినిధులకు చెందినవేనని అనధికార వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాలపై మరిన్ని కోణాల్లో అటవీ, పోలీస్ శాఖల బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. అటవీ దొంగలకు నిర్మల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులు సహకరిస్తున్న విషయం కూడా గుర్తించారు. నిజామాబాద్ డివిజన్‌లో 28 కేసులు నమోదయ్యాయి. 2,967 టన్నుల కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బడ్జెట్ పెట్టేది ఎవరు?



(మొదటిపేజీ తరువాయి)

అదీ జరగలేదు. తాజాగా ఫిబ్రవరి తొలివారంలో విస్తరణ జరగవచ్చని భావిస్తున్నా జరుగుతుందో, లేదోనన్న ఆందోళన ఆశావహుల్లో ఉంది. అత్యంత విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం... లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరమే కొత్త వారికి అవకాశం కల్పిస్తూ మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇందుకు కారణం కొంతమంది సీనియర్ మంత్రులుగా పనిచేసిన ఎమ్మెల్యేలను లోక్‌సభకు పోటీకి పెట్టాలన్న ఆలోచనతో కేసీఆర్ ఉన్నట్టు తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల తరువాతే మంత్రివర్గం!

మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తిరిగి ఎన్నికల రణ రంగంలోకి దిగమంటే కూడా పార్టీలో తప్పుడు సంకేతాలు వెళతాయని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ చేపట్టకుండా తాను భావిస్తున్నట్టుగా లోక్‌సభ ఎన్నికల తర్వాతే పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని ఈలోగా పార్లమెంటరీ సెక్రెటరీ నియామకాలకు సంబంధించి ఉన్న న్యాయపరమైన చిక్కులను తొలగించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే న్యాయశాఖ పార్లమెంటరీ సెక్రెటరీల నియా మకానికి సంబంధించి తీసుకువస్తున్న ఆర్డినెన్స్‌పై కసరత్తు చేసి దస్త్రాన్ని సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ ఆమో దముద్ర వేయగానే ఆర్డినెన్స్‌ను జారీ చేసేందుకు న్యాయశాఖ సిద్ధంగా ఉన్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఎమ్మెల్సీ పదవుల భర్తీకి కసరత్తు

మంత్రివర్గ విస్తరణకు ముందే ఖాళీగా ఉన్న, త్వరలో ఖాళీ అవుతున్న 16 ఎమ్మెల్సీ పదవుల భర్తీకి సంబంధించి కసరత్తు చేసి అభ్యర్థిత్వాలను ఖరారు చేయాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు తెలు స్తోంది. శాసనసభ బ డ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి రెండోవారం లో ప్రారంభించాలని ప్రభు త్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. బడ్జెట్ ప్రతిపాదన లకు సంబంధించి ఆయా శాఖల ఉన్నతాధికా రులు ఇప్పటికే కసరత్తు ప్రారంభిం చారు. ఒకటి, రెండు రోజు ల్లో కేసీ ఆర్ ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలపై ఉన్నత స్థాయి సమావేశాలకు సిద్ధమవుతున్నారు.

కేసీఆర్ బడ్జెట్ ప్రవేశపెడితే చరిత్రే..!

ఒకవేళ ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ బడ్జెట్‌ను ప్రవేశపెడితే స్వాతంత్ర్యం వచ్చాక ఓ ముఖ్యమంత్రి శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి ముఖ్యమంత్రి ఆయనే అవుతారని అధికార వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా శాసనసభ ఎన్నికలు జరిగాక మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసే అవకాశాలుంటాయి. అందులో ఆర్థికశాఖ ఖచ్చితంగా ఏదో ఒక మంత్రికి కట్టబెట్టడం సంప్రదాయం. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కేసీఆర్ తనతో పాటు హోంమంత్రి మహమూద్ అలీని మాత్రమే మంత్రివర్గంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. డిసెంబర్‌లో ఎన్నికలు జరగడం, జనవరిలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారానికి నాలుగు రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించడం జరిగిపోయింది.

కేంద్రం బాటలో కేసీఆర్ సర్కార్

కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండడంతో తమ ప్రభుత్వం కూడా ఈ దిశగా అడుగు వేస్తుందని కేసీఆర్ ప్రకటించారు. ఫిబ్రవరి 11 లేదా 12వ తేదీనుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించేందుకు సూత్రపాయంగా ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఓవైపు లోక్‌సభ ఎన్నికలు తరుముకొస్తుండడం, మరోవైపు బడ్జెట్ సమావేశాలు రావడంతో మంత్రివర్గాన్ని విస్తరించే విషయంలో కేసీఆర్ కొన్ని సమస్యలను అధిగమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో 17 నియోజకవర్గాలకుగానూ 16 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటాలని కేసీఆర్ ఇప్పటికే పిలుపునిచ్చారు.

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2019



శ్రీ సునీల్ అరోరా
భారత ఎన్నికల అధికారి

సందేశం

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, దేశంలోని పౌరులందరినీ, 18 సం॥లు నిండి ఓటర్లుగా నమోదు చేసుకోబోతున్న వారందరికీ నా శుభాకాంక్షలు. యుక్త వయస్సు రాగానే ఓటు హక్కును మన పవిత్ర రాజ్యాంగ కర్తలు, అర్హులైన భారతీయ పౌరులందరికీ కల్పించారు. భారత ఎన్నికల సంఘంగా మేము దానిని మీకందించడానికి ఎంతో కృషి చేస్తున్నాం.

యావత్ దేశమంతటా 17వ లోక్‌సభ ఎన్నికలకు, ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ఎన్నికలకు సిద్ధమవుతోంది. మేము కూడా దేశంలోని 87 కోట్లపైగా ఓటర్లకు, 10 లక్షల పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జాతీయ ఎన్నికల్లో మొదటి సారిగా మిల్లేనియల్స్ మా అంబాసిడర్స్‌గా పాలుపంచుకుంటున్నారు. దీనికి వారి కుటుంబసభ్యులు సైతం సహకరిస్తారని ఆశిస్తాము. ఈ ఎన్నికల్లోనే కాక, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ పాలు పంచుకుంటారని భావిస్తున్నాము.

ఎక్కువ మంది ఓటింగ్‌లో పాలు పంచుకుంటే, అదే ధృడమైన ప్రజాస్వామ్యానికి పునాది. మేం, భారతీయ కమీషన్‌లో **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నాం.

మాకు ఈ రోజు ఎంతో కీలకమైన రోజు. 25 జనవరి, 1950న భారత ఎన్నికల సంఘం స్థాపించబడిన రోజు. ఈనాడే పటిష్ట భారత ప్రజా స్వామ్య వ్యవస్థ సుస్థాపితమైన రోజు. దేశంలో అద్భుత ప్రజాస్వామ్య వారసత్వాన్ని చాటిచెబుతూ, ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నాటి నుండి విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

మా లక్ష్యం - ప్రతి ఎన్నికలను ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేయడమే, ఓటరుతో స్నేహపూర్వకంగా, పారదర్శకంగా మెలగడమే. ఈ దిశగా మేము ఎన్నో చర్యలు చేపట్టాం. ఎన్నికల ఆఫీసును చేరువ చేసి, సకల సమాచారం, సహకారం కోసం - ఓటర్ హెల్ప్‌లైన్ నెం: 1950 అందించాం. ఇదే నెంబర్‌పై ఎస్ఎమ్ఎస్ సేవలు ఫోన్ ద్వారా పంపిస్తున్నాం. ఆన్‌లైన్ ఓటర్ సేవలను ఫోన్ ద్వారా అందిస్తున్నాం.

భారత ఎన్నికల సంఘం తరపున, నేను దేశంలోని ఓటరులందరినీ తమ పవిత్రమైన ఓటుహక్కు వినియోగించుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి భయం, ఆందోళన, లంచాలకు లొంగక భారత ప్రజాస్వామ్యాన్ని గెలిపించవలసిందిగా కోరుతున్నాను. ఇది 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం మీరు కోరుకున్న వారు మీ తరపున లోక్‌సభలో నిలుస్తారు. అందుకే నేడే ఓటర్‌గా నమోదు చేసుకోండి.

మరొక్కసారి, జాతీయ ఓటర్ల దినోత్సవం 2019 తరపున దేశంలోని ప్రజలందరికీ మన స్ఫూర్తిగా నా శుభాభినందనలు అందజేస్తున్నాను.

జై హింద్

"ఎలక్షన్ కమీషన్ 25 జనవరి తన సంస్థాపన దినోత్సవంగా **'జాతీయ ఓటర్ల దినోత్సవం'** గా జరుపుకుంటోంది. 2011 జనవరి 25 నుంచి ప్రతీ సంవత్సరం ఇలా జరుపుకోంటోంది. ఏ ఓటరు తన హక్కును కోల్పోకూడదు అనే లక్ష్యంతో ఈ రోజు 9వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించబడుతోంది. చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరికి ఈ హక్కును కల్పించుటలో పూర్తిగా వాస్తవరూపంలోకి తీసుకువచ్చుటకు మరియు భారత ప్రజాస్వామ్య నాణ్యతను పెంపొందించుటకు ఈ సందర్భాన్ని ఉపయోగిస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పెంపొందించు లక్ష్యంతో కమీషనర్ ఉన్నారు. తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల ప్రదేశాలన్నింటి వద్ద కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద నూతనంగా నమోదైన ఓటర్లు నూతన పీవీసీ కలర్ కార్డుతో పాటు లోగో మరియు **"Proud to be a voter – Ready to Vote"** నినాదం కలిగి ఉంటారు."

తెలంగాణ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

తెలంగాణ సుస్థిర మరియు క్రియాశీల ప్రభుత్వం కలిగిన వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం, ఇది 2018 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలిచింది, ఒక్క సంఘటన కూడా లేకుండా ఎంతో ప్రశాతంగా నిర్వహించబడినవి. ఈ పరపతి అంతా ఎలక్షన్ కమిషన్‌కు దక్కుతుంది, వారు ఎలక్షన్లను సవ్యంగా, సజావుగా నిర్వహించుటకు అవిశ్రాతంగా పని చేశారు. గతంలోని ఓటర్ శాతం 69.5 శాతంతో పోల్చితే ఇప్పుడు 73.4 శాతమునుకు పెరిగింది. ఎలక్షన్ కమిషన్ ప్రయత్నాలతో ఇది ఎంతో గొప్ప అభివృద్ధి, విజయంగా పేర్కొనవచ్చును.

ఇప్పుడు జాతీయ ఓటర్ల దినోత్సవం ఎంతో సంతోషంగా జరుపుకునే వేడుక **NVD**. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వివిధ రకాల కార్యకలాపాలతో మరియు ఎంతో ఆసక్తి కలిగించే అంశాలతో నిర్వహించబడుతోంది. క్విజ్, వ్యాసరచన, మాక్ పార్లమెంట్, మహిళలకు రంగోలి పోటీలు, హై స్కూల్స్ సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయి. వీటిని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహిస్తారు. మరియు విజేతలకు బహుమతులు మరియు సర్టిఫికేట్లు పంపిణీ ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున తెలంగాణలో అన్ని విద్యాసంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలలో **NVD** ప్రతిజ్ఞ చేయబడుతుంది. పోలింగ్ స్టేషన్, శాసన సభ నియోజకవర్గం, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో **NVD** కార్యక్రమాలకు హాజరయ్యే పౌరులందరూ కూడా ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది.

జాతీయ
ఓటర్ల దినోత్సవం
25 జనవరి
2019

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.



డా॥ రజత్ కుమార్ ఐ.ఎ.ఎస్
ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ

సందేశం


భారత ఎన్నికల సంఘం 25 జనవరిని తన సంస్థాగత దినోత్సవం రోజును 2011 నుండి ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం మీకందరికీ తెలుసు. ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం - ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, అర్హులైనవారందరినీ ఓటర్లుగా నమోదు చేయడం తద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం. ఈ రోజు మనం 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ముఖ్యాంశంతో జరుపుకుంటున్నాం.

తెలంగాణ మొట్టమొదటి సాధారణ ఎన్నికలు డిసెంబర్ 2018లో ఎంతో ప్రశాంతంగా చక్కగా జరిగాయని తెలియజేస్తున్నాను. తెలంగాణ ఓటరు మహాశయులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. పోలింగ్ శాతం రాష్ట్రంలో చారిత్రాత్మకంగా 73.40% మును పెన్నడూ లేని విధంగా నమోదు అయ్యింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, ఉద్రిక్తపరిస్థితులు, ఆందోళనలు, తలెత్తలేదు. రీపోలింగ్ జరగలేదు. వికలాంగులైన వారికి సైతం - కల్పించిన ప్రత్యేక వసతుల వలన పోలింగ్‌లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారి పోలింగ్ శాతం 70% వరకూ నమోదైంది.

లోక్‌సభకు ఎన్నికలు అతి తొందరలోనే రాబోతున్నాయి. దీనిలో మీ ఓటు హక్కును మీరు వినియోగించాలంటే ముందుగా మీ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఓటర్ లిస్టులో పేరు లేకపోతే ఓటును వేయలేరు. ఓటర్ల జాబితాల సవరణ 1-1-2019 నుండి ప్రారంభమై, ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయి. మీ దరఖాస్తులు సమర్పించడానికి ఇదే ఆఖరు తేది. తుది జాబితా 26.02.2019 న ప్రకటించబడుతుంది. 31 డిసెంబర్ 2018 నాటికి 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు హక్కును పొందడానికి అర్హులు.

కనుక అర్హులైన పౌరులందరూ వెంటనే తమపేరు నమోదు చేసుకొని, రానున్న జాతీయ సార్వత్రిక ఎన్నికల్లో తమ విలువైన ఓటు హక్కును ఎటువంటి భయం, భీతి లేకుండా, కులం, మతం, ప్రాంతం, భాష లేదా లంచాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవలసిందిగా కోరుతున్నాను.

నేను మరొక్కసారి చేసే విన్నపమల్లా **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అనే భావన ఎన్నికల సంఘం వారి మహదాశయాన్ని నిజం చేసేందుకు మనందరం నిరంతరం కృషి చేద్దాం... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా, వినియోంచుకునేలా చూద్దాం !!



ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి

భారత ఎన్నికల సంఘం
https://eci.gov.in

ప్రధాన ఎన్నికల అధికారి,
తెలంగాణ

Voter Helpline
1950

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 25 జనవరి 2019

చరిత్రలో ఈరోజు

బ్రిటీష్ ఇండియా వేసవి రాజధాని!




జమ్ము, కాశ్మీర్, పంజాబ్, హరియాణ, ఉత్తరాఖండ్‌తో పాటు స్వయంప్రతిపత్తి ఉన్న టిబెట్ సరిహద్దులుగా 25, జనవరి, 1971న హిమవత్ పర్వత పాదాల చెంతన 18వ భారతీయ రాష్ట్రంగా హిమాచల్ ప్రదేశ్ ఆవిర్భవించింది. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం 70 లక్షల మంది జనాభాతో, 55,670 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన హిమాచల్ ప్రదేశ్ ప్రాంత చరిత్ర క్రీస్తు పూర్వం రెండు వేల సంవత్సరాలకు పైగానే ఉంది. 15వ శతాబ్ది తరువాత ఈ ప్రాంతమంతా మొగల్ చక్రవర్తుల ఏలుబడిలోకి వచ్చేసింది. 18, 19వ శతాబ్దాల్లో నేపాల్‌కి చెందిన గూర్ఖా రాజులు సిమ్లా, సిర్మౌర్ పట్టణాలను ఆక్రమించుకున్నా.. సిక్కు ప్రభువు మహారాజా రంజిత్ సింగ్ స్వాధీనంలో ఉన్న కంగ్రా కోటను ముట్టుకోలేకపోయారు. ప్రస్తుతం మనం చూస్తున్న సిమ్లా, దాని చుట్టుపక్కల ప్రాంతాలను 1817లో పాటియాల మహరాజు ఆంగ్లేయులకు కట్టబెట్టాడు. దీంతో తొలిగా బ్రిటీష్ వారు సిమ్లాలో విడిది ఏర్పాటు చేసుకోవడం మొదలెట్టారు. వేసవి కాలంలో సిమ్లాలో గడపడానికి బ్రిటీషర్లు మొగ్గు చూపడంతో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందింది. 1863లో అప్పటి భారత వైస్ రాయ్ జాన్ లారెన్స్ సిమ్లాను బ్రిటీష్ ఇండియాకి వేసవి రాజధానిగా మార్చేశారు. కల్కా-సిమ్లా రైలు మార్గాన్ని 1906లో నిర్మించారు. టిబెట్ నుంచి బహిష్కరణకు గురైన దలైలామా 1959లో ఇక్కడి ధర్మశాలను బౌద్ధ కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇక్కడే దలైలామా 1960లో టిబెట్ వెలుపలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి హిమాచల్ ప్రదేశ్ ప్రపంచ బౌద్ధులకు ప్రముఖ పర్యాటక కేంద్రంగా, ధర్మశాల పవిత్ర స్థలంగా మారిపోయింది. కులు, మనాలి, కంగ్రా, మండి, చంబా, చైల్, కసౌలి, డల్హౌసి ప్రాంతాలు ప్రాకృతిక సౌందర్యంతో అలరారుతూ పర్యాటకులను మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. మంచు కప్పిన పర్వతాలు, ఎత్తైన వృక్ష రాజాలు, అందమైన బీస్ నదీ పరివాహక ప్రాంతంతో మనాలీ ప్రపంచ యువ జంటలకు ఇష్టమైన హనీమూన్ ప్రాంతంగా పేరొందింది.

వజ్రాలకే వజ్రం



వెండి కన్నా, బంగారం కన్నా, ప్లాటినమ్ కన్నా వజ్రానికి క్రేజీ ఎక్కువ. వజ్రాల కోసం చరిత్ర పొడవునా ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎన్నో హత్యలు, దోపిడీలు చోటుచేసుకున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద వజ్రంగా పేరొందిన కులినాన్ వజ్రాన్ని 25, జనవరి, 1905లో దక్షిణాఫ్రికాలోని కులినాన్ గనిలోని కనిపెట్టారు. కులినాన్ వజ్రం 3,106.75 కేరట్లతో వజ్ర జాతికే తలమానికంగా ఉంటుంది. ఈ వజ్రాన్ని ఏప్రిల్, 1905లో లండన్‌లో వేలానికి పెట్టారు. అయితే అప్పుడు దానికి తగినంత ధర రాకపోవడంతో రెండేళ్ల పాటు అట్టే పెట్టి ఉంచారు. 1907లో ట్రాన్స్‌బల్ కాలనీ ప్రభుత్వం కులినాన్ వజ్రాన్ని కొనుగోలు చేసి ఏడవ కింగ్ ఎడ్వర్డ్ 66వ పుట్టిన రోజు కానుకగా బహూకరించింది. కులినాన్ గనిలో 530.4 కేరట్లు ఉన్న మరో వజ్రం కూడా బయటపడింది. దీనికి కులినాన్ 1 అని పేరు పెట్టారు. ఆ తరువాత కులినాన్ 2 వజ్రం 317.4 కేరట్లతో లభించింది. ఈ కులినాన్ వజ్రాలు గ్రేట్ బ్రిటన్ రాజ కుటుంబ కిరీట నగలయ్యాయి. రెండవ క్వీన్ ఎలిజిబెత్ ప్రైవేటు కలెక్షన్లో మరో ఏడు పెద్ద కులినాన్ వజ్రాలు చేరాయి. వీటి మొత్తం కేరట్లు 208.29.

విత్తన యంత్రానికి తొలి పేటెంట్!



ఫలానా వస్తు తయారీకి పేటెంట్ ఇచ్చారని వింటుంటాం. వస్తు తయారీని, లేదా ఒక ప్రక్రియను అభివృద్ధి చేసిన వారు దానిపై పూర్తీ హక్కులు పొందడానికి, ఇతరులు దాన్ని అనుకరించకుండా ఉండడానికి ఇచ్చే హక్కే పేటెంట్. అమెరికాలో అలా తొలిసారి గా విత్తనాలు నాటే యంత్రానికి పేటెంట్ ఇచ్చారు. 25, జనవరి 1799లో విత్తనాలు నాటే యంత్రాన్ని కనిపెట్టడంతో సంప్రదాయ వ్యవసాయ విధానంలో విప్లవాత్మక మార్పులకు బీజం పడింది. డీర్ అండ్ కంపెనీకి ఈ విత్తనాలు నాటే యంత్రం పేటెంట్ దక్కింది. ఈ విత్తనాలు నాటే యంత్రంలో రెండు సీడ్ మీటర్లు ఉంటాయి. విత్త నాలు నాటడానికి ఇందులో కన్వేయర్ బెల్టు ఉంటుంది. ఇందులో విత్తనాలు నిల్వ ఉంచడానికి రెండు బాక్సులు ఉంటాయి. ఈ రెండు బాక్సుల నుంచి ఈ యంత్రం ఎంపిక చేసిన పద్ధతిలో విత్తనాలను తీసుకొని నాటుతుంది. విత్తనాలు నాటే యంత్రం రావడంతో అమెరికాలో సువిశాలమైన వ్యవసాయ క్షేత్రాల్లో కూలీల కొరత సమస్య చాలా వరకు పరిష్కారమైంది. విత్తనాలు నాటే యంత్రం నుంచి మొదలు పెట్టి అమెరికా వ్యవసాయ రంగంలో మరెన్నో ఆధునిక వ్యవసాయ సామాగ్రిని అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారతీయ రైతులు ఆశ్చర్యపోయే యంత్రాలు అమెరికా వ్యవసాయ రంగంలో సేవలందిస్తున్నాయి. వ్యవసాయం యాంత్రీకరణ జరిగేకొద్ది రైతులకు దిగుబడి కూడా అదే స్థాయిలో పెరగడం మొదలు పెట్టింది.

31న రైతు బీమాపై చర్చ!

ఈనెల 31న హైదరాబాద్‌లో బాగ్‌లింగంపల్లినందలి ఆర్టీసీ కల్యాణ మండపం నందు తెలంగాణ రైతాంగ విధానాల మీద ముద్ర అగ్రికల్చర్ అండ్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ -ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో చర్చావేదికను ఏర్పాటు చేయడమైంది. తెలంగాణ రాష్ట్రంలో రెండు సంవత్సరాల కిందట ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తీసుకొచ్చిన రైతు సమన్వయ సమితులు గురించి, సమగ్ర భూసర్వే గురించి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ రైతుబంధు పథకం గురించి, ఇతరత్రా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరు గురించి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ప్రధాన కమిషనర్ సి. పార్థసారథి సాక్షాత్ ఐక్యరాజ్యసమితినందు వివరించి చెప్పడంతో సమితి అధికారులు ఔరా..! అని ఆశ్చర్యపడ్డారు. ఈవిధమైన రైతుబంధు పథకం ప్రపంచంలో అరుదుగా అమలవుతున్నదని ఐక్యరాజ్య సమితి ఉన్నతాధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంతగానో ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం సైతం దేశ్యాప్తంగా ఇటువంటి పథకాన్ని అమలు చేయడానికి ఆలోచిస్తున్నది. వీటన్నింటికంటే ముఖ్యంగా రైతులకు గిట్టుబాటుధర కల్పించుట గురించి, రైతులకు , వ్యాపారులకు మధ్య ఉన్న దళారీ వ్యవస్థను నిర్లూలించుట గురించి, పంటమార్పిడి విధానాల గురించి , రైతు ఉత్పత్తులు గిట్టుబాటు ధర లభించేంతవరకు దాచుకోవడానికి అనువుగా ఏర్పడేలా కోల్డ్‌స్టోరేజ్‌లు, గౌడౌన్ల గురించి, తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైతుల ఉత్పత్తులకు డిమాండ్ రావడం కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గురించి ,సేంద్రియ ఎరువులను భారీ ఎత్తున రైతులు తయారు చేసుకోవడం గురించి, ప్రకృతి వ్యవసాయం గురించి, గ్రామీణ పరిశ్రమల ఏర్పాటు గురించి ఇతరత్రా అనేక అంశాల మీద ఈ చర్చావేదికలో చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపించదలచాము.

తిప్పినేని రామదాసప్పనాయుడు, 9989818212

చందా కొచ్చర్‌పై కేసు... విధివిలాసం..

ఐసిఐసిఐ బ్యాంకు మాజీ సీఈఓగా ఆ బ్యాంకు వ్యాపారాభివృద్ధికి ఎంతో కృషి చేసి ప్రశంసలు అందుకున్న చందా కొచ్చర్‌పై వీడియో కాన్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు కావడం విధివిలాసమే. ఆమె ఐసిఐసిఐ బ్యాంకు కార్యనిర్వహణాధి కారిణిగానే కాక, అంతర్జాతీయ స్థాయిలో ప్రభావశీలురైన మహిళగా కూడా పేరొందారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ ఏటా అంతర్జాతీయ స్థాయిలో వంద మంది ప్రభావ శీలుర పేర్లను ప్రకటిస్తూ ఉంటుంది. ఆ జాబితాలో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ సతీమణి హిల్లరీ క్లింటన్ వంటి అంతర్జాతీయ ప్రముఖుల సరసన చందా కొచ్చర్‌కు స్థానం లభించడం ఆమె ప్రతిభకు ప్రత్యక్ష నిదర్శనం. ఆమె ఆ బ్యాంకు సీఈఓగా ఉన్నప్పుడు వీడియో కాన్ సంస్థకు రుణాలు మంజూరు చేయడం లో ఆశ్రిత పక్షపాతం వహించారన్న ఆరోపణకు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉండటంతో ఆమె పైనా, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌పైనా సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీడియోకాన్ అధి పతి వేణుగోపాల్ దూత్ దీపక్ కొచ్చర్ మిత్రుడు. తన మిత్రుని కంపెనీకి రుణం కోసం దీపక్ కొచ్చర్ భార్యపై ఒత్తిడి తెచ్చి నట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ లావాదేవీల్లో బ్యాంకు కు రూ. 1730 కోట్లు నష్టం వచ్చినట్టు కూడా ఆరోపణలు వచ్చాయి. వీడియో కాన్ సంస్థకు ఆరు దఫాలుగా రూ.1,875 కోట్ల రూపాయల రుణాలను ఆ బ్యాంకు అందజేసింది. ఈ కేసులో కొచ్చర్ పాత్రపై మొదట్లోనే అనుమానాలు వ్యక్తం కాగా, బ్యాంకు యాజమాన్యం ఖండిస్తూ వచ్చింది.

అయితే, బ్యాంకు ఉన్నతాధికారులు ఎంత నిజాయితీ పరులైనా వారిపై రాజకీయ ప్రముఖుల నుంచి తీవ్రమైన ఒత్తి డులు వస్తుంటాయి. సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కారణంగానే బ్యాంకుల్లో కుంభకోణాలు పెరిగిపోయాయి. కింగ్ ఫిషర్ సంస్థ వ్యవస్థాపకుడు విజయ్ మాల్యా, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, మొహుల్ చోక్సి వంటి వాణిజ్య,కార్పొరేట్ దిగ్గజాలంతా ఎగవేత దారులు కావడానికి ఈ విధానాలు తోడ్పడ్డాయి. ప్రభుత్వంలో ఉన్న పెద్దల సిఫార్సుల మేరకు రుణాలు మం జూరు చేసిన బ్యాంకుల సీఈఓలు, ఉన్నతాధికారులు చందా కొచ్చర్ మాదిరిగా వివిధ కుంభకోణాల కేసుల్లో నిందితుల య్యారు. పంజాబ్ నేషనల్ బ్యాంకునుంచి వేల కోట్ల రూపా యిల రుణాలు తీసుకుని ఎగనామం పెట్టి విదేశాలకు చెక్కేసిన నీరవ్ మోడీ రాజకీయ వర్గాల అండదండలతోనే ఇప్పటికీ విదేశాల్లో తలదాచుకోగలుగుతున్నారు. విజయ్ మాల్యాపై కేసు నడుస్తున్న కేసు ఏళ్ళూ పూళ్ళూ అయినా పరిష్కారం కావడం లేదు. చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకు ని వీరంతా వేల కోట్ల రూపాయల రుణాలను ఎగవేసి విదేశాలకు జారుకుంటున్నారు. చందాకొచ్చ ర్‌పై ఆరోపణలు రావ డంతో ఆమె గత అక్టోబర్‌లో పదవి నుంచి తప్పుకున్నారు. వీడియో కాన్ కంపెనీకి ఐసిఐసిఐ బ్యాంకు మాత్రమే కాకుండా, కన్ సార్టియం లోని ఇతర బ్యాంకులు కూడా రుణాలు మంజూరు చేశాయి. అయితే, వీడియో కాన్ అధిపతి వేణు గోపాల్ దూత్ కీ, దీపక్ కొచ్చర్ కీ వ్యాపార సంబంధాలు ఉండటం వల్ల దూత్ ద్వారా దీపక్ ప్రయోజనం పొంది, తన భార్య ద్వారా ఐసిఐసిఐ బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో రుణాన్ని పొందారన్నది ఆరోపణ. అంతేకాక, వీడియో కాన్‌లో దీపక్ కొచ్చర్, ఆయన సోదరుడు రాజీవ్ కొచ్చర్‌లకు 2013-14 వరకూ వాటాలుండేవి. ఆమెకు కూడా వాటాలుండేవనీ, బ్యాంకు సీఈఓ అయిన తర్వాత వేరొకరికి బదిలీ చేసారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. చందా కొచ్చర్ ఐసిఐసిఐ బ్యాంకు వ్యాపారాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఉన్నత స్థాయికి ఎదిగిన ఆమె తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటారని ఎవరూ అనుకో రు. చందా కొచ్చర్‌పై తాజాగా మరికొన్ని ఆరోపణలు వచ్చాయి. ఎస్సార్ గ్రూపునకు చెందిన సంస్థలకు కూ డా చందా కొచ్చర్ పెద్ద మొత్తాల్లో రుణాలు మంజూరు చేశారనీ, అందుకు ప్రతిఫలంగా ఆ సంస్థలు కొచ్చర్ భర్తకు చెందిన కంపెనీలో పెట్టుబడులు పెట్టాయన్నది ఆ ఆరోపణలు. చందా కొచ్చర్‌పై తొలిసారిగా ఆరోపణ లు వచ్చినప్పుడు బ్యాంకు బోర్డు కొట్టి వేసింది. ఆ తర్వాత ఒక్కొక్క ఆరోపణ వెలుగు చూడటంతో ఆమెను సమర్థించడం కష్టమని తేలిన తర్వాతే ఆమెను దీర్ఘకాలిక సెలవుపై పంపింది. రుణాల ఎగవేతల కారణంగా బ్యాంకుల నిరర్థక ఆస్తులు పెరిగాయి. ఈ ధోరణి యూపీఏ హయాంలో ప్రారంభమైంది.మోడీ అధికా రంలోకి వచ్చిన తర్వాత మరింత పెరిగింది.అప్పటికన్నా ఆర్థిక నేరస్థుల సంఖ్య ఇప్పుడు బాగా పెరిగిపోయింది.పైగా, ఆర్థిక నేరస్థులు విదేశాలకు క్యూకట్టడం ఇప్పుడే ఎక్కువగా ఉంది. మోడీ ప్రభుత్వం రిజర్వు బ్యాంకు వ్యవహారాల్లో కూడా జోక్యం చేసుకుంటున్నట్టు ఆరోపణలు వచ్చాయి. బ్యాంకు గవర్నర్ పదవికి రఘు రామ్ రాజన్, ఉర్జిత్ పటేల్ అర్ధాంతర రాజీనామాలతో ఈ ఆరోపణలు నిరాధారం కాదని తేలింది.

ఎందుకీ రాద్ధాంతం?



ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. మన దేశంలో ఎన్నికలు జరుగుతూంటే అభివృద్ధి చెందిన దేశాల నుంచి, వెనుకబడిన దేశాల నుంచి ప్రతినిధులు వచ్చి, 130 కోట్ల జనాభా గల దేశంలో దశలవారీగా పకడ్బందీగా శాంతియుతంగా ఎన్నికలు జరగడం చూసి దిగ్భ్రాంతి చెందుతున్నా రు. ఎక్కడ్నుంచో ఎవరో అనామకుడు ముసుగు వేసుకొని 2014 ఎన్నికల్లో ఈవీఎం ట్యాంపరింగ్ జరిగింది అని స్కైప్‌లో చెప్పడమేమిటి..? లండన్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టడమేమిటి..? రాజకీయపక్షాలు హంగామా చేయడమేమిటి...? ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని బజారుకీడ్చడం ఈ ముఠాకి న్యాయమా? రాజకీయ పార్టీలు దేశంలో ఎన్నికల కమిషన్‌కి అధికారులకి, ప్రజలకి, ఓటర్లకు ఇచ్చే విలువ ఇదేనా...? ఎన్నికల సంఘం ఎన్నో పర్యాయాలు ఈవీఎంల విశ్వసనీయతను చాటుతూ సవాళ్లు విసిరింది. దేశంలో ఉన్న 14 లక్షల ఈవీఎంలలో ఏ ఒక్కటైనా ఎవరైనా ట్యాంపరిం గ్ చేయగలిగితే మొత్తం ఈవీఎంలను తొలగిస్తామంది. ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. ఎక్కడో లండన్‌లో ప్రెస్‌కాన్ఫ రెన్స్ పెట్టి చీకట్లో బాణాలు వేస్తూ దేశానికీ, ప్రజాస్వామ్యానికి, ఎన్నికల ప్రక్రియకి కళంకం తెచ్చే రీతిలో ప్రకటనలు చేయడం గర్హనీయం. ఎవరో అనామకుడు పేలిన ప్రేలాపనలు విని ఖండించాల్సింది పోయి ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ తగుదునమ్మా అంటూ ఆ సమావేశంలో హాజరై ఆజ్యం పోయడం విడ్డూరంగా ఉంది. మరో పక్క నేషనల్ హెరాల్డ్ ఉద్యోగి, రాహుల్ గాంధీ సన్నిహితుడు అని చెప్పబడుతున్న వ్యక్తి ఆ పత్రికా గోష్ఠి ఏర్పాటు చేయడం గమనార్హం.


దేశంలో 1990ల వరకు జరిగిన ఎన్నికలు ఒక ఎత్తయితే, 1990 తర్వాత జరిగినవి మరొక ఎత్తు. 1990ల వరకు ఎన్నికల నగానే సామాన్యుల నుంచి అధికారుల వరకు గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఈ రోజుల్లో పోలింగ్ ఎంత శాతం జరిగిందో వార్తా పత్రికలు రాస్తే, 1990లకు ముందు ఎన్ని పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది మాత్రమే కొలమా నం, వార్తాపత్రిక ల అప్పటి హెడ్‌లైన్లు అదే. రిగ్గింగ్, పోలిం గ్ కేంద్రాల ఆక్రమణ, బ్యాలెట్ బాక్స్ ఎత్తుకెళ్ళడం, ఓట్ల గల్లంతు, ఒకే వ్యక్తి డజన్ మంది ఓట్లు వేయడం, బూత్ ఏజెంట్ల మధ్య ఘర్షణలు, కొట్లాట లు చివరికి ప్రాణనష్టం కూడా జరగకుండా ఒక్క ఎలక్షన్ ముగిసే ది కాదు. రెండు సంస్కరణలు భారతదేశ ఎన్నికల ధోరణిని, నిర్వహించే తీరుని మార్చివేశా యి. ఎలక్షన్ కమిషనర్ ఎస్ ఎల్ షక్‌ధర్ హయాంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ఆవిష్కరణ, శేషన్ పదవీ కాలంలో ఓటర్ ఐడీ కార్డుల పరిచయం. 1951లో తొలి లోక్‌స భ ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం సుమారు 90 కోట్లమంది ఓటర్లు ఉంటారు. ఓటర్లతో పాటు పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, ఎన్నికల వ్యయంతో పాటు ప్రయాసలు కూడా పెరిగాయి. రిగ్గింగ్, మారణ హెూమం తగ్గి శాంతియుతంగా పోలింగ్ జరుగుతోంది (నక్సల్ ప్రాబల్యమున్న ప్రదేశాలలో అక్కడక్కడా చెదురు మదురు ఘటనలు తప్ప). పెరిగిన ఓటర్లు, అభ్య ర్థులు, పార్టీలు, పోలింగ్ బూత్‌లతో పాటు ఈవీఎంలు వచ్చాక ఎన్నో లాభాలు, ఫలితా లు కూడా వెనువెంటనే వచ్చే సౌలభ్యం వచ్చింది.

బాలట్ పేపర్ ద్వారా ఉండే ఫలితాలు రావడంలో జాప్యం, మాన్యువల్ కౌంటింగ్, రీ కౌంటింగ్, రీ పోల్ లాంటి తలనొప్పి వ్యవహారాలు ఈవీఎంలు వచ్చాక మటుమా యమయ్యాయి. ఓట్ల గల్లంతు, దొంగ ఓట్లు కి మారుపేరైన భారతదేశ ఎన్నికలు, ఓటర్ గుర్తింపు కార్డు, ఈవీఎంలు వచ్చేక పండితులైనా పామరులైనా తమ ఓటు హక్కు నిక్షేపంగా వినియోగించుకొనేందుకు మార్గం సుగమం అయింది. రెండు దశాబ్దాలుగా 100కి పైగా ఎన్నికల నిర్వహణకు తోడ్పడిన ఘనత ఈవీఎంలకి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలయిన భారత్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ ఎల్) పకడ్బందీగా, అత్యుత్తమ సాంకేతిక నైపుణ్యంతో ఉత్పత్తి చేసిన యంత్రాలు ఇవి. 1999 నుండి దేశంలో జరిగిన అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలలో నూ ఈవీఎంలు ఉపయోగించారు. ఈవీఎంలు వచ్చాక గెలిచిన పార్టీలకు, రెండో స్థానంలో ఉన్న పార్టీకు పోలైన ఓట్ల షేర్‌లో మార్జిన్ తగ్గింది. మెజార్టీలో కూడా మార్జిన్ తగ్గింది. ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకొనే వారి శాతం పెరిగింది. దీనిని బట్టి అర్థం అవుతున్న దేమిటి..? అవకతవకలు జరగకుండా నిష్పక్ష పాతంగా ఎన్నికలు జరగడంలో ఈవీఎంల పాత్ర గణనీయమైందని. పరీక్షల్లో తప్పి న వారికి ఒక సాకు కావాలి. సిలబస్ లో లేనిది వచ్చింది, లేదా మాస్టారు ఈ పాఠాలు చెప్పలేదు. మ్యాచ్ ఓడిపోతే, మా వాళ్లు బాగా ఆడారు.. కానీ పిచ్ బాలేదు. లేదా బాల్ ట్యాంపరింగ్ చేసిందా టీమ్..ఇలాంటివి వింటూంటాం. సార్వత్రిక ఎన్నికలంటే క్రికెట్ మ్యాచ్ కాదు. ప్రజాస్వామ్య దేశంలో నాయకులకు ప్రజల తీర్పు చెప్పే అతిముఖ్య ఘటన. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల వివాదం ఈనాటిది కాదు. అవి పుడుతూనే వివాదాస్పదమయ్యాయి. కేరళలోని ఎర్నాకులం జిల్లాలో పరవూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలకి దేశంలో తొలిసారి ఈవీఎంలు ఉపయోగించింది ఎన్నికల సంఘం. ఎప్పటి నుంచో ఈవీఎంలు తేవాలి అని కాంగ్రెస్ ముచ్చటపడింది. ఆ ఎన్నికల్లో ఎప్పుడైతే సీపీఐ అభ్యర్థి చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయాడో వెంటనే కాంగ్రెస్ యూటర్న్ తీసుకొని ఈవీఎంలు వల్లే అనర్థం, ఘోరం, మోసం అంటూ హైరానా చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలో బ్యాలెట్ ఓటింగ్ మాత్రమే ఉందని చెప్పి సుప్రీం కోర్టు తలుపు తట్టింది. కోర్టు తీర్పు మేరకు మళ్ళీ ఎన్నికలు జరపగా ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి గెలిచాడు. తీర్పు మనకు అనుకూలంగా లేకుంటే ఎన్ని అబద్ధాలాడైనా, ఎన్ని కొర్రీలు పెట్టయినా, సాకులు చెప్పైనా ఈవీఎంలను వివాదంలోకి లాగడం అలా మొదలయిందన్న మాట. పెద్దన్న కాంగ్రెస్‌ని చూసి నేర్చుకొని ఓటమి పాలైన అన్ని పార్టీలు ఈవీఎం ఆట ఆడుకొంటు న్నాయి. 2010లో బీజేపీ, వామపక్షాలు కూడా ఈవీఎం ట్యాంపరింగ్ జరిగాయని లబోదిబోమన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలు రాగానే ప్రజల తీర్పుని గౌరవించాల్సింది పోయి మాయావతి ఈవీఎం ట్యాంపరింగ్ పాట అందు కుంటే, ములాయం ఆమె వంత పాడారు. 2015లో మెజార్టీతో గెలిచిన కేజ్రీవాల్ కూ డా. ఐఐటీ నుంచి చదువుకొని, ప్రభుత్వాధికారిగా పనిచేసిన కేజ్రీవాల్ కూడా ఈవీఎం ట్యాంపరింగ్ జరిగిందంటే సాధారణ ప్రజలు ఏం అనుకోవాలి..? 2014లో అధికారం కాంగ్రెస్ పార్టీ చేతిలో ఉంది, తమ ప్రభుత్వ హయాంలోనే ఎన్నికలు జరిగాయి. 2014 ఎన్నిక ల్లో బీజేపీ ఎలా ఈవీఎం అక్రమాలకు పాల్పడగలదు? ఒక వేళ ఈవీఎం అవకతవకల కు సాధ్యమైతే మరి 2004 మాటేమిటి? వాజ్‌పాయి ప్రభుత్వం ఓడిపోవడమేమిటి? ఓటమిని హుందాగా తీసుకున్నారు. ఈ నాటి రాజకీయ నాయకులు వాజ్‌పాయి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఇలాంటి తీవ్ర ఆరోపణ చేసే బదులు రాజకీయ పక్షాలన్నీ సంప్రదించుకుని ఓ మంచి మూహుర్తాన ఎన్నికల సంఘం అనుమతితో ప్రపంచ ప్రసిద్ధ హ్యాకర్లను పిలిపించి ఈవీఎం ట్యాంపరింగ్ ప్రదర్శన నిర్వహించి అటో ఇటో తేల్చేసుకోవాలి, కానీ రోజూ చెవిలో జోరీగ లాగా ఈవీఎంలపై నిందలు, కితాబులు, వాదోపవాదాలు చేయడం వల్ల ప్రజలు విసిగిపోతున్నారు. ఇంటర్నెట్, ఈమెయిల్, ఫేస్‌బుక్, వాట్సాప్ వచ్చాక ఫేక్‌న్యూస్ ఎక్కువయిందని వీటిని బహిష్కరించి మళ్ళీ ఇన్‌లాండ్ కవర్, కార్డు ముక్కల రోజుల్లోకి వెళ్దామా? దేశంలో అవినీతి పెరిగిపోతోందని బ్రిటీష్‌వారి పాలనను కోరుకుందామా.? ఈ 60 ఏళ్లలో మరి ఆ బ్యాలెట్ పేపర్ ఎన్నికలు ప్రజల మీదకి రుద్దడమెందుకో?. ఇతర దేశాల్లో ఈవీఎం లేవు కాబట్టి మన దేశంలో కూడా తీసేయండి అంటున్నారు. విదేశాలతో పోలిస్తే ఒక్క ఈవీఎంలే కాదు మొత్తం ఓటింగ్ ప్రక్రియ, పాలనా యంత్రాంగం, చట్టాలు కూడా పోల్చుకోవాలి.

-సునీల్ ధవళ

ఓటరే విజేత!

నేడు జాతీయ ఓటరు దినోత్సవం



ఓటు ఆవశ్యకత ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకున్న పాత్ర గురించి యువ ఓటర్లను చైతన్యం చేయడంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటైన జనవరిను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించిం ది. భారత ప్రజాస్వామ్య పరిరక్షణకోసం నా వంతు కర్త వ్యాన్ని గుర్తించి ఉన్నతమైన నాయకున్ని ఎన్నుకుంటా నని ఓటర్లతో ప్రమాణం కూడా చేయిస్తున్నది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష, ఆర్థిక భేదభావం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు ఓటు హక్కు పొందే అవకా శం భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 కల్పిస్తున్నది. 100 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో సుమారు 50 కోట్ల ఓటర్లు ఉన్నారు. ఇందులో కేవలం 50 కోట్ల లోపు ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అంటే మనమంతా సిగ్గుపడాల్సిన విషయం.

ప్రజాస్వామ్య దేశంలో న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలకంటే శక్తివంతమైన పాత్ర శాసనాలు తయారు చేసే పార్లమెంట్, అసెంబ్లీలది. ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన రాజకీయ నేతలే నేరస్తులైతే నేరమయ భారతం నిర్మితమౌతుంది. మన దేశంలో 1971 నుండి ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమలవుతోంది. లోక్‌సభ ఎన్నికల ఖర్చు 25 లక్షలు, అసెంబ్లీ ఎన్నికల ఖర్చు 10 లక్షలు దాటకూడదని 2004లో నిబంధనలు విధించినప్పటికీ అభ్యర్థులు మాత్రం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అభ్యర్థి నేరస్తుడైనా కోట్ల రూపాయల డబ్బు ఉంటే చాలు ఎన్నికల్లో టికెట్ ఇచ్చి ప్రతి పార్టీ ప్రోత్సహిస్తోంది. స్థానిక సంస్థలు, చట్టసభలకు ఎన్నికలు జరిగినప్పుడు ప్రజలంతా ఓటు వేయడానికి వెళ్లేలా ఆ రోజున సెలవు దినంగానూ ప్రకటిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కువ మంది ఓటు వేసేందుకు ముందుకు రావడం లేదు. గ్రామాల్లో కన్నా విద్యావంతులు అధికంగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం అందరినీ ఆశ్చర్యపోయేటట్లు చేస్తుంది.

రాజకీయ ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలంటే సాంఘిక, ఆర్థిక, సమానత్వాన్ని సాధించాలనిరాజ్యాంగం లక్ష్యం కూడా అదేనని, రాజకీయ ప్రజాస్వామ్యం సామాన్యులకు అందకపోతే బాధితులు ఈ రాజ్యాంగ వ్యవస్థను కూల్చేస్తారని నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్‌కు సమర్పిస్తూ అంబేడ్కర్ హెచ్చరించారు. జాతీయ ఓటరు దినోత్సవం రోజైనా దేశ భవిష్యత్‌ను కాపాడాల్సిన యువత ఓటు విలువ తెలుసుకుటుందని ఆశిద్దాం. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా పాలకుల మితిమీరిన జోక్యంతో సత్ఫలితాలు రావడం లేదు.

ఐదేళ్లకు ఒక్కసారి వచ్చినా.. మన జీవితాలను, తలరాతను మార్చేది ఎన్నికలు. సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఓటు. ఓటు హక్కును యువత బాధ్యతగా వినియోగించుకొని సమాజానికి మేలు చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. ఎపుడూ నిరుత్సాహ పడవద్దు. ఒక ఓటు దేశ గమనాన్నే మారుస్తుంది. యువతలో చైతన్యం వచ్చి.. ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకున్న నాడే దేశాభివృద్ధి సాధ్యం. పరిపాలన సజావుగా సాగాలన్నా, సరైన నేతలకు పగ్గాలు ఇవ్వాలన్నా అది ఓటు ద్వారానే సాధ్యమన్న సత్యాన్ని ఓటరు దినోత్సవం నాడైనా అందరూ మననం చేసుకోవాలి. ముఖ్యంగా యువత మేలుకొని ఓటు హక్కు నమోదు చేసుకొనడమే కాకుండా ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకున్నప్పుడే దానికి సార్థకత ఉంటుంది. అందుకే ఎవరూ ఓటు అనే విలువైన ఆయుధాన్ని నోటుకు అమ్ముకోవద్దు. మనం వేసే ఓటుతోనే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది అని తెలుసుకోవాలి.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విద్యార్హతలు, నేర చరిత్ర, వారి ఆస్తులను పరిశీలించి సుగుణాలు కలిగి, అభివృద్ధి చేస్తాడన్న నమ్మకం ఏర్పరచుకున్న అభ్యర్థికే ఓటు వేయాలి. పార్టీల మేనిఫెస్టోలు చదివి, అభ్యర్థులు ఇచ్చే హామీలను పరిశీలించాకే ఓటు వేయాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ప్రధాన ఆయుధమన్న సంగతి మరువరాదు. ఓటు కోసం డబ్బు ఇచ్చిన వారిని, తీసుకున్న వారిని క్రిమినల్ కేసు కింద కోర్టుకు హాజరు పర్చవచ్చు. కాబట్టి యువత ప్రలోభాలకు దూరంగా ఉండి, దేశంలో నిజాయితీగా పనిచేసే ఎంతో మంది నాయకులున్నారు వారిని ఆదర్శంగా తీసుకొని ఓటు హక్కును ఉపయోగించుకొని వారిని సమర్థించాలి. ఓటు ఎంతో పవిత్రమైందని, కావున నిజాయితీగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేయాలి. ఓటరు క్యూ ఇన్‌ఫర్మేషన్ విధానంపై ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేశారు. ఆ యాప్ ద్వారా క్యూలైన్‌లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో తెలుసుకోవడం వీలవుతుందని తద్వారా మనకు ఏ సమయంలో వీలయితే ఆ సమయంలో వెళ్లి మన ఓటు హక్కును ఉపయోగించుకుని రావచ్చు.మనం వేసే ఓటు మన భవిష్యత్తు, రాబోయే తరాల మనుగడ నిర్ణయిస్తాయి. కానీ మన దేశంలో ఎన్నికల పరిస్థితి ఎంతో దారుణంగా ఉంది. ఎన్నికల సమయంలో దేశం మొత్తంలో 60 శాతం పోలింగ్ కూడా నమోదు కావడం లేదు. మన దేశంలో పరిస్థితి ఇలా ఉంటే ఇతర దేశాల్లో మాత్రం ఓటు వేయడం తప్పనిసరి.

-కాళంరాజు వేణుగోపాల్, 8106204412

ఓటు గొప్ప ఆయుధం

ఓటు గొప్ప ఆయుధం. అలాంటి ఆయుధాన్ని డబ్బుకు, సారా, మద్యానికి, అవినీతికి తాకట్టు పెట్టకుండా ఈ సమాజానికి ఉపయోగపడేలా ఉపయోగించాలి. ఐదేళ్ళ కోసారి వచ్చే ఎన్నికల జాతరలో అభివృద్ధికి పట్టం కట్టాలి. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో జనారణ్యంలో జంగ్‌సైరన్ ఊదే సమాజం వచ్చింది. మనలోనూ పాలించే పాలకులను ఎన్నుకునే విధానం వచ్చింది. అదే నీ ఓటు ద్వారాఎన్నుకునే విధానం నీకే వచ్చింది. ఓటరు మహాశయా! ప్రజాస్వామ్యానికి మూలం ఓటు. ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు. ప్రజాస్వామ్యం కాపాడటానికి ఓటు ఒక వజ్రాయుధం. నాయకుల రాతను మర్చే అస్త్రం.. నోటు మాటున ఓటేయకు... ప్రజాస్వామ్యాన్ని కాటేయకు... నీకు సంస్కారం ఉంది ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును సద్వినియోగం చేసుకున్నప్పుడే మీనేతను నిలదీయగలరు. మీ రాతను మార్చుకోగలరు. ఓటర్లు దేశ భవితను మార్చే షూటర్లు. అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే నోటా ద్వారా తిరస్కరించాలి. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండే వారికే ఓటు వేయాలి. అవినీతి రహిత సమాజం కోసం పాటు పడేవారికే ఓటు వేయాలి. సామాజిక న్యాయం, సమసమాజ నిర్మాణం కోసం పాటు పడేవారికి ఓటు వేయండి.

-పూకే రామకృష్ణదొర

ఓటు మన జన్మ హక్కు..

దేశంలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజ్యాంగంలోని 324వ అధికరణం కింద 1950 జనవరి 25వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు.ఈ సంస్థ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. దేశంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు మినహాయిస్తే మిగిలిన అన్ని రకాల ఎన్నికలను లోకసభ, రాజ్యసభ, రాష్ట్రాలలోని శాసనసభ, శాసన మండలితో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తూ, పర్యవేక్షిస్తూ, మార్గదర్శకత్వం వహిస్తూ నియంత్రణ చేయు భాద్యతను కలిగియున్నది. ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయం ఢిల్లీలో వుంటూ దాదాపై 300 మందికిపైగా అధికారులు, సిబ్బందితో కార్యకలాపాలు కొనసాగిస్తూ ఎన్నికలల సమయంలో 50 లక్షల లోపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించుకొని ఎన్నికలను నిర్వహిస్తుంది. అలాగే ఎన్నికల ప్రణాళికలను రూపొందించడం, గుర్తులను కేటాయించడం, రద్దు చేయడం చేస్తూ ఎన్నికలను స్వేచ్ఛగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం దాని బాధ్యత. బ్రిటిష్ పాలనలో కేవలం విద్యావంతులు, అగ్రకులాలు మరియు ధనవంతు లకు మాత్రమే ఓటుహక్కును కల్పించేవారు. మన దేశంలో నిమ్నకులాల వారికీ, నిరక్షరాస్యులకు ఓటు హక్కు ఉండేదికాదు. ఓటు మన జన్మ హక్కు. మనకు ఇష్టమైన ప్రభు త్వాన్ని ఎన్నుకోవడానికే ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. ధన ప్రమేయం లేకుండా ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. కానీ, ప్రస్తుత ఎన్నికల్లో ధనప్రభావం బాగా పెరిగిపోయింది. ఓటరు యొక్క విధులను, ఓటు యొక్క విలువలను ఎలక్షన్ కమిషన్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, సామాజికవేత్తలు, పలువురు వివరిస్తూ ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. 18 సంవత్సరాలు నిండి యువతను ఓటు హక్కు పొందడానికి తగిన సూచన లు, సలహాలనిస్తూ ఎలాంటి వ్యక్తులను ఎన్నుకోవాలో తెలియబరుస్తూ వుంటారు. కానీ చదువుకున్న యువత సైతం తన ఓటును సక్రమంగా ఉపయోగించుకుంటూ, పలువురికి సూచన లిస్తూ, ఓటు విలువ చెబుతున్నాడా? లంటే లేదని చెప్పక తప్ప దు. పాలకపక్షాలు సైతం ఒక సామాన్య మానవునికి విలువ నిస్తున్నారంటే కారణం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు. ఎన్నికల సంఘం సైతం ఎప్పటికప్పుడు, నూతన ఒరవడితో కొత్త అవకాశాలు కల్పించడం అనగా ఆఫ్‌లైన్లో గాకుండా ఉచి తంగా ఆన్ లైన్లో సైతం ఓటుకోసం దరఖాస్తు చేసుకోవడం, ఆకర్షణీయమైన ఓటరు కార్డు జారీ చేస్తోంది. ఓటు ప్రాముఖ్యతను తెలియబరుస్తోంది. ప్రతి గ్రామంలో నేడు ప్రతి ఇంటికి చదువుకున్న వాళ్లున్న ఈ తరుణంలో తన కుటుంబంలో లేదా బంధువులలో లేదా పక్కంటి, పొరుగింటి, వాడలలో ఎవరైనా 18 సంవత్సరాలు పైన వయసు కలిగిన వారుంటే వారికి తెలియబరుస్తూ, ఓటు హక్కుకై దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలి. లేదా ఇప్పుడు ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్నారు కావున కాస్త సమయాన్ని వెచ్చించి దరఖాస్తు చేయాలి. గ్రామాలలోని ఓటరు యొక్క లక్ష్యాలను తెలియబరుస్తూ, సమాజాభివృద్ధిని కాం క్షిస్తూ, కష్టించి పనిచేసే వ్యక్తులను ఎన్నుకోవడంలో ఓటరు ఎలా ముందడుగు వేయాలో తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. నేడున్న అత్యధిక ఓటర్లలో ఎక్కు వ శాతం యువత, అందులో అక్షరాస్యులై ఉన్నారు. కానీ కొన్ని ప్రాంతాలలో ప్రత్యే కంగా గ్రామీణ సమాజంలో యువత వివిధ ప్రలోభాలకు లొంగి, నిష్పక్షపాతంగా తన ఓటును ఉపయోగించుకోలేకపోతున్నాడు. ఇప్పటికైనా దేశంలోని ప్రతి ఒక్కరు మారి, దేశాబివృద్ధికి పాటు పడే నాయకుడిని ఎన్నుకోవడానికి ప్రతి ఓటరు నిష్పక్షపాతంగా, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, ఎలాంటి బహుమ తులను ఆశించకుండా, తన ఓటు హక్కును వినియోగించుకుంటూ పలువురికి ఆద ర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రతి సంవత్సరం జనవరి 25ను సైతం అన్ని పాఠశాలలో జరుపుకునేలా చర్చలు తీసుకుంటూ, దానియొక్క ప్రాముఖ్యతను నలుదిశలుగా వ్యాపించేలా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

-డా. పోలం సైదులు

వక్ఫ్ భూముల ఆక్రమణపై కఠిన చర్యలు: హోంమంత్రి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వక్ఫ్ భూముల కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పోలీస్ శాఖను ఆదేశించారు. రాష్ట్రంలో వక్ఫ్ భూములకు చెందిన మోసాలు తరచుగా చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ భూముల ఆక్రమణలు, కేసుల ప్రగతిపై గురువారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేసులను విచారించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చట్టంలోని లొసుగుల ఆధారంగా కొందరు వక్ఫ్ భూములను ఆక్రమిస్తున్నారని, బోగస్ డాక్యుమెంట్లను రూపొందించి అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇటువంటి చర్యలను అణచివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ సలీమ్, సీఈవో షానవాజ్ ఖాసీమ్, సెంట్రల్ జోన్ డీసిపి విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఆర్డ్మ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలోని నలుగురు ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సూర్యాపేటలో పని చేస్తున్న ఎస్. శ్రీనివాసరావును వరంగల్ కమిషనరేట్‌కు, రామగుండం కమిషనరేట్‌లో పని చేస్తున్న డి. వెంకటిని నిర్మల్ జిల్లాకు, అంతర్గత భద్రతా విభాగం (ఐఎస్‌డబ్ల్యు)లో పని చేస్తున్న బి. జంగయ్యను హైదరాబాద్‌లోని సిఏఆర్ హెడ్ క్వార్టర్‌కు, రాచకొండ కమిషనరేట్‌లో పని చేస్తున్న కె. కిషన్‌రావును ఐఎస్‌డబ్ల్యుకు బదిలీ చేశారు.

చెవిదుద్దుల కోసమే ఆ ఇద్దరి హత్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అత్తాపూర్ మూసీనదిలో జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు. మృతురాళ్లు యాదమ్మ, సుమిత్రలను ఒకే వ్యక్తి హత్య చేశాడు. మృతుల తలలపై బలమైన గాయాలు ఉండటంతో క్షుద్రపూజల కోసమే నరబలి ఇచ్చారన్న అనుమానాలు సైతం వ్యక్తం కావడంతో ఈ కేసును పోలీసులు ఛాలెంజింగ్ భావించి 24 గంటల వ్యవధిలోనే ఛేధించారు. కమ్మల కోసమే నిందితుడు మహిళలను హత్య చేశాడని పోలీసులు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం దెబ్బగూడ గ్రామానికి చెందిన దంపతులు రాజు-యాదమ్మ, లక్ష్మణ్-సుమిత్ర పదిహేనేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చారు. ప్రస్తుతం మీర్‌పేట పరిధిలోని బాలానగర్ చౌరస్తా సమీపంలోని లెనిన్ నగర్‌లో నివసిస్తున్నారు. అక్కాచెల్లెళ్లయిన యాదమ్మ, సుమిత్రలు సమీపంలోని ఇళ్లల్లో పనిచేస్తుండగా.. రాజు, లక్ష్మణ్‌లు అడ్డా కూలీలుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు చొప్పున సంతానం. సుమిత్ర భర్త లక్ష్మణ్ మద్యానికి బానిసై ఐదేళ్ల క్రితం చనిపోయాడని పోలీసులు పేర్కొన్నారు.

సినీ నటి భానుప్రియపై కేసు



కాకినాడ, ఆంధ్రప్రభ : ప్రముఖ సినీ నటి భానుప్రియపై తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సామర్లకోట మండలం తండ్రవాడ గ్రామానికి చెందిన ప్రభావతి అనే మహిళ ఈ కేసుపెట్టారు. ఆమె కథనం మేరకు ఆమె కుమార్తె సంధ్య (14)ను ఏడాది క్రితం చెన్నైలోని భానుప్రియ ఇంట్లో పనికి కుదిర్చారు. అప్పట్లో నెలకు జీతంగా 10వేలు ఇచ్చేందుకు మాట్లాడుకున్నారు. ఏడాదిన్నర అయినా ఇప్పటికీ సంధ్యకు జీతమివ్వలేదు. పైగా భానుప్రియ సోదరుడు సంధ్యను తరచూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. గతకొంతకాలంగా తల్లిదండ్రుల్తో కూడా సంధ్యను మాట్లాడనివ్వడంలేదు. పైగా ఇంటికి పంపాలంటే తిరిగి పదిలక్షలు చెల్లించాలంటూ షరతు విధిస్తున్నారు. సంధ్య తామింట్లో దొంగతనానికి పాల్పడిందని భానుప్రియ ఆరోపిస్తున్నట్లు ప్రభావతి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలుత చైల్డ్ లైన్‌లో సంప్రదించిన ప్రభావతి వారి సూచనల మేరకు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. భానుప్రియ కుటుంబ సభ్యులకు సమన్లు పంపాలని నిర్ణయించారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాయమాటలు చెప్పి ఓ బాలికను కిడ్నాప్ చేసి ఆమెను పెళ్లాడి.. ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడో ప్రబుద్ధుడు. మోతీనగర్‌లో ఈ దారుణ సంఘటన చోటు చేసుకుంది. ఓ స్వీట్ షాప్‌లో బాలిక పని చేస్తోంది. ఆ బాలికపై కిడ్నాపర్ కన్నేశాడు. ఆ బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించాడు కిడ్నాపర్. బాలికను తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కిడ్నాపర్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పిల్లల సంక్షేమ కమిటీలపై అసంతృప్తి

- యాదాద్రిలో పసిమొగ్గల వ్యభిచారంపై హైకోర్టు విచారణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పుణ్యక్షేత్రమైన యాదాద్రిలో అమాయకులైన ఆడపిల్లల వ్యభిచారంపై దాఖలైన వ్యాజ్యాలపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని బాలల సంక్షేమ కమిటీ అలసత్వం, పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పూర్తయి కోర్టుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు రక్షణ గృహాల్లో ఉన్న బాధిత మైనర్ బాలికలను కలిసేందుకు అనుమతిస్తూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని పిల్లల సంక్షేమ కమిటీలను హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యాజ్యాల్లో రంగారెడ్డి, నల్గొండ జిల్లా పిల్లల సంక్షేమ కమిటీలను అదనపు ప్రతివాదులుగా చేర్చారని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో మార్చి 12 లోగా పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ ఆ కమిటీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మార్చి 12 కు వాయిదా వేసింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కుమార్ వాదనలు వినిపిస్తూ..ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న దర్యాప్తు బృందం రెండు నెలల్లో విచారణ ముగిస్తుందని తెలిపారు. అయితే ఆ బాధిత బాలికలను కలిసేందుకు తల్లులు, పెంపుడు తల్లులు, రాజకీయ నాయకులను అనుమతించకుండా సంక్షేమ కమిటీలకు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ..ఆ బాలికలను కలిసేందుకు ఎవరినీ అనుమతించరాదని సంక్షేమ కమిటీలకు స్పష్టం చేసింది.

ఫిబ్రవరిలో పీఆర్సీ..?

- పార్లమెంట్ ఎన్నికలకు ముందే ప్రకటన
- బడ్జెట్‌లో ప్రకటన ఉండకపోవచ్చు
- పూర్తిస్థాయి నివేదిక సిద్ధం
- వచ్చే నెలాఖరుకు సీఎం ఆమోదానికి... ఆ తర్వాతే ప్రకటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురుచూస్తున్న రాష్ట్ర 11వ వేతన సవరణ సంఘం నివేదికను ఫిబ్రవరి నెలాఖరులో ఇవ్వనున్నారు. తెలంగాణ తొలి పీఆర్సీ ప్రకటనకు అవసరమైన కసరత్తును కమిషన్ తీవ్రం చేసింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే పీఆర్సీని ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. అయితే బడ్జెట్‌లో నిధుల కేటాయింపులకు అవకాశం లేదని సమాచారం. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు పూర్తయిన నేపథ్యంలో మొత్తం కార్యాచరణ చివరి దశకు చేరుకుంది. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లుగా ఉన్న ఫిట్‌మెంట్, కనీస మూలవేతనం, ఇంటి అద్దె అలవెన్స్‌ల ప్రతిపాదనలు పీఆర్సీ నివేదికలో చేర్చే అవకాశం లేదని తెలిసింది. వాస్తవానికి వేతన పే స్కేళ్లు, విభాగాల వారీగా ఉద్యోగులు, వారి వేతనాలు, చేస్తున్న పని, ఇవ్వాల్సిన విభాగాల వారీ వేతనాలే పీఆర్సీ నివేదికలో చేరుస్తారు. సీఎం ఆమోదం తర్వాతే ఫిట్‌మెంట్ నిర్ణయించి, ఉత్తర్వులు జారీ చేస్తారు. తాజా బిస్వాల్ కమిటీ కూడా అదే పని చేస్తోంది. శాఖల వారీగా, కేడర్ వారీగా కనీస మూలవేతనం, గరిష్ట వేతనాలు, అలవెన్సులను నివేదికలో పొందుపర్చేందుకు చర్యలు తీసుకుంటోంది.


ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలనుంచి వచ్చిన డిమాండ్లు, ఫిర్యాదులు, సలహాలు, సూచనలను క్రోడీకరించి, సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది. పూర్తిస్థాయి నివేదిక వచ్చేనెల చివరినాటికి ప్రభుత్వానికి అందించనుందని తెలిసింది. ఉద్యోగ సంఘాలు 43 శాతం మధ్యంతర భృతి, తెలంగాణ తొలి పీఆర్సీలో 63శాతం ఫిట్‌మెంట్‌ను డిమాండ్ చేస్తున్నాయి. రూ. 24వేల కనీస మూల వేతనం అమలుకు పట్టుపడుతున్నాయి. అయితే తాజాగా ఆర్థిక భారం, ఇతర సామాజిక ప్రభావాలను అధ్యయనం చేసిన కమిటీ సమగ్ర నివేదికకు తుది రూపం తెచ్చినట్లుగా తెలుస్తోంది.

తొలుత గతేడాది ఆగస్టుకు ముందే తమ పనిని ముగించేలా పీఆర్సీకి కార్యాచరణ రూపొందించారు. గతంలో అనుసరించిన మూసపద్ధతులతో జాప్యమవుతోందని, అలా కాకుండా సత్వరమే పీఆర్సీ నివేదిక అందేలా కృషి చేయాలని ఈ కమిటీ ఆవిర్భావం సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ తర్వాత బిస్వాల్ నేతృత్వంలోని కమిటీకి కార్యాలయం, సిబ్బందిని కేటాయించారు. అనంతరం కసరత్తులో భాగంగా తమ వేతనాల పెంపుదలపై ఉద్యోగ సంఘాలు పలు దశల్లో ఈ కమిటీకి విజ్ఞాపనలను అందించాయి. టీజీవోలు, టీఎన్‌జీవోలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉద్యోగులు, గ్రంథాలయ, విశ్వవిద్యాయాల సంఘాలు తమ కోరికలను కమిటీకి నివేదించాయి. ఆయా సంస్థలు, రంగాల పరిధిలోని సిబ్బందిని, వర్క్ ఛార్జ్డ్ ఉద్యోగులను కూడా దీనికిందకు తీసుకొచ్చారు. ఎయిడెడ్ కళాశాలల సిబ్బంది, యూజీసి, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యాయ శాఖ, సేవా సంస్థల ఉద్యోగులందరూ కొత్త వేతన సవరణ పరిధిలో లబ్ది పొందేందుకు అర్హులు కారని ప్రభుత్వం స్పష్టంగా తేల్చిచెప్పింది. మార్గదర్శకాల్లో భాగంగా ప్రభుత్వపరిధిలోని గెజిటెడ్, నాన్‌గెజిటెడ్, ఇతర ఉద్యోగులు, నాల్గో తరగతి సిబ్బందికి చెందిన వేతనాలు, కరవు భత్యం పెంపు, ఇంటిఅద్దె (హెచ్‌ఆర్‌ఏ) ప్రయాణ రాయితీ, ఇతర ప్రత్యేక అలవెన్సులపై వినతులు అందించాలని పేర్కొంది.

ఆ తర్వాత వీటన్నింటినీ క్రోడీకరించిన ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల్లో 30శాతం న్యాయపరమైన వివాదాలని, 10 శాతం మాత్రం పరిష్కరించలేనివి ఉన్నాయని గుర్తించిన సంగతి తెలిసిందే. మంత్రివర్గ ఉపసంఘానికి ఉద్యోగ సంఘాలనుంచి మొత్తం 18 డిమాండ్లు రాగా, ఉపాధ్యాయ సంఘాలనుంచి 34డిమాండ్లు అందాయి. ఈ క్రమంలో మధ్యంతర భృతి, పీఆర్సీపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పింది. అయితే రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్థితిగతుల ఆధారంగా పీఆర్సీ చేస్తున్న కసరత్తులో ఖజానాపై పడే అదనపు ఆర్థిక భారం కూడా పరిగణలోకి తీసుకున్నారు. రాష్ట్రంలోని 3.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెలా రూ. 3వేల కోట్లు వేతనాలు చెల్లిస్తుండగా, ఇది ఏడాదికి రూ. 36వేల కోట్లకు చేరుతోంది. కాగా ప్రస్తుతం ఉన్న జీతభత్యాలను 15 శాతం మేర పెంచితే నెలకు రూ. 5400 కోట్లతో ఏడాదికి రూ. 41,410 కోట్లు కానుంది.

దారిదోపిడీ గ్యాంగ్ అరెస్టు

- అదుపులో ఏడుగురు నిందితులు
- 20 గంటల్లో కేసు ఛేదన
- హైదరాబాద్ సీపీ అంజనీకుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దారి దోపిడీ గ్యాంగ్ గుట్టును హైదరాబాద్ కాలాపత్థర్ పోలీసులు 20 గంటల వ్యవధిలో రట్టు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్ సాయంతో ఈ కేసును త్వరితగతిన ఛేదించగలిగామని, గ్యాంగ్‌లోని ఏడుగురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. అరెస్టయిన గ్యాంగ్ సభ్యుల నుంచి రూ.18000 నగదు, శ్యామ్‌సంగ్ సెల్‌ఫోన్, రూ.10000 విలువ చేసే రెండు స్మాల్ గోల్డ్ రింగ్స్, ఎస్‌బీఐ ఏటీఎం కార్డు (బాధితుడికి సంబంధించినది), ఒక డియో వాహనం, ఒక హోండా షైన్, సిల్వర్ కలర్ (ఏపీ 12 ఎం 8308)లను స్వాధీనం చేసుకున్నారు.

మధ్యప్రదేశ్ ఉజ్జయినికి చెందిన మెకానికల్ ఇంజనీర్ దిలీప్ సింగ్ బుండేలా ఈ నెల 17న హైదరాబాద్ వచ్చాడు. సైబర్ క్రైమ్‌లో 4న సైబరాబాద్ పోలీసులు సంపిల్ ప్రజాపతిని అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. దిలీప్ సింగ్ బుండేలాకు స్వయానా బావమరిదే ఈ ప్రజాపతి. దీంతో 18న చర్లపల్లి జైలులో దిలీప్ సింగ్ బుడేలా.. ప్రజాపతిని ములాకత్ ద్వారా కలుసుకుని బెయిల్‌పై చర్చలు జరిపాడు. కూకట్‌పల్లి హోటల్ ఆదిత్యాలో బుండేలా బస చేశాడు. తిరుగు ప్రయాణాన్ని ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో 22న సాయంత్రం 6-00 గంటలకు బుక్ చేసుకున్నాడు.

అదే క్రమంలో ప్రజాపతిని మళ్లీ కలుసుకునేందుకు 12.52 నిమిషాలకు జైలు అధికారుల నుంచి ములాఖత్ సమయం తీసుకున్నాడు. బుండేలా వెయిట్ చేస్తున్న సమయంలో మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో మర్డర్ కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలులో వున్న అఫ్రోజ్‌ఖాన్, మొహమ్మద్ నవాజ్‌లను కలుసుకునేందుకు గ్యాంగ్ సభ్యులు వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుండేలాకు వారికి మధ్య స్నేహబంధం కుదిరింది. తమ తీయటి మాటలతో బుండేలాను తమ ట్రాప్‌లో పడేసుకున్నారు. దీంతో ఇక్కడ్నించీ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ దగ్గరేనని నమ్మబలికి అతడిని తమ డియో వెహికల్‌లో కూర్చొబెట్టుకున్నారు. మరో వెహికల్‌లో మిగతా సభ్యులు డియో వెహికల్‌ను అనుసరించారు. వాహనాన్ని ఎంజె ప్యాలెస్ ఫంక్షన్ హాల్ బ్యాక్‌సైడ్‌లో నిలిపి బాధితుడు బుండేలాపై మరో వాహనంపై వచ్చిన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాడి చేసి అతడి వద్దనుంచి నగదు, ఆభరణాలతో పాటు ఏటీఎం కార్డును దోచేశారు. అంతటితో ఆగలేదు ఆ కార్డు నుంచి నగదును డ్రా చేసేందుకు గ్యాంగ్ సభ్యులు యత్నించి విఫలమయ్యారు. 22వ తేదీ సాయంత్రం 7-00 గటలకు బుండేలా ఘటనపై ఫిర్యాదు చేశారు.


దీంతో వెంటనే స్పందించిన పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లారు. ఘటన ఏ విధంగా జరిగిందన్నదానిపై రీ కనస్ట్రక్షన్ చేశారు. ఆ క్రమంలో సీసీఫుటేజీలను నిశితంగా పరిశీలించారు. సిసీ ఫుటేజ్‌లలో గ్యాంగ్ సభ్యులను పోలీసులు గుర్తించారు. గ్యాంగ్ సభ్యులలోని ముగ్గురు సైబరాబాద్‌లోని శంషాబాద్ పీఎస్ పరిధిలో క్రిమినల్ రికార్డు కలిగి పీడీ యాక్ట్ కింద జైలుకెళ్లి వచ్చినవారేనని తేలింది. ఈ విధంగా ఆ ముగ్గురు గ్యాంగ్ సభ్యులు సయ్యద్ యూనస్, మొహమ్మద్ ఖలీలుద్దీన్, మొహమ్మద్ ఇబ్రహీంలతో పాటు మరో నలుగురు సభ్యులు సయ్యద్ జైనుల్ అబెదిన్, మొహమ్మద్ నదీమ్ ఖురేషి, మీర్ మౌజమ్ అలి, మొహమ్మద్ అలీ ఖురేషీలను కాలాపత్థర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులవద్దనుంచి దోపిడీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీసీకెమెరాల ఫుటేజ్ వల్లనే ఈ కేసును త్వరితగతిన ఛేదించగలిగామని కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు.

హైదరాబాద్ పోలీసులు ది బెస్ట్..

బాధితుడి దీపాంజలి బుండేలా మీడియాతో మాట్లాడుతూ తాను ఫిర్యాదు చేసిన వెంటనే హైదరాబాద్ పోలీసులు సత్వరమే స్పందించారని, పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ పోలీసులు బెస్ట్‌పోలీసులన్న కితాబును అందజేశారు. చాలా స్వల్ప వ్యవధిలో గ్యాంగ్‌ను పట్టుకోవడంతో పాటు మొత్తంగా చోరీ సొత్తును పోలీసులు తనకు అందజేశారని ఆయన అన్నారు.

కొడంగల్ ఎమ్మెల్యే ఎన్నిక రద్దు చేయండి

- హైకోర్టులో రేవంత్‌రెడ్డి పిటిషన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వికారాబాద్ జిల్లా కొడంగల్ (72) ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఎన్నికను రద్దు చేయాలని, చట్టం ప్రకారం తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి హైకోర్టులో ఎన్నికల వ్యాజ్యం(ఈపీ) దాఖలు చేశారు. నరేందర్ రెడ్డి ఎన్నికల్లో గెలుపొందేందుకు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నియమ నిబంధనలను ఉల్లంఘించారని తెలిపారు. కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 15 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అయితే వారి నామినేషన్లను ఉపసంహరించుకోవాలని, లేదా ఎన్నికల్లో తనకు (రేవంత్ రెడ్డికి) వ్యతిరేకంగా పనిచేయాలంటూ భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చారని పిటిషనర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ నేతృత్వంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం అండదండలతో నరేందర్ రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆపద్ధర్మ తెరాస ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించి తన ఇంటితో పాటు తన బంధువుల ఇళ్లపై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖతో దాడులు చేయించినట్లు పిటిషనర్ తెలిపారు. పోలీసులకు వారి స్థాయితో నిమిత్తం లేకుండా హోం గార్డు నుంచి జిల్లా ఎస్పీ వరకు పోలీసు అధికారులందరికీ లక్షల్లో డబ్బులు ఇచ్చారని పిటిషనర్ ఆరోపించారు. దీంతో వారంతా నరేందర్ రెడ్డికి అనుకూలంగా పనిచేశారని తెలిపారు. పైగా తనపై తెరాస పార్టీకి చెందిన నమస్తే తెలంగాణ ఛానల్ తనపై దుష్ప్రచారం చేసినందువల్లనే తాను ఓటమి చెందినట్లు తెలిపారు. లేకుంటే తాను పెద్ద మెజారిటీ గెలుపొందే వాడినని పేర్కొన్నారు. అందువల్ల పట్నం.నరేందర్ రెడ్డి ఎన్నికను రద్దు చేసి, చట్టం ప్రకారం తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ ఎన్నికల వ్యాజ్యంపై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు

- హైకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనేక అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ నేతలు హైకోర్టు తలుపు తట్టారు. ఎన్నికల్లో తప్పిదాలు జరిగాయని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేతలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. మాజీ మంత్రి డీకే అరుణ, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజ్ శ్రావణ్ కుమార్ గురువారం వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల అసెంబ్లీ నియోజక వర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే.. లెక్కింపులో ఎక్కువగా ఓట్లు వచ్చాయని, అలా తేడా రావడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని మాజీ మంత్రి డీకే అరుణ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఓట్ల తేడాపై ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లఘించి అక్రమాలతో కొడంగల్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గెలిచారని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో గెలిచిన టీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని రేవంత్‌రెడ్డి తన పిటిషన్‌లో కోరారు. అంతే కాకుండా తన ఆస్తుల విషయంలోనూ అఫిడవిట్‌లో స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలోనూ చాల అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసిన ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజ్ శ్రావణ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని పట్టించుకోకుండా కౌంటింగ్‌లో అవకతవకలకు పాల్పడిన వారిపైన అనర్హత వేటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయం.. మరుజన్మకే?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారు.. వెళ్లారు.. కానీ దర్బారీసింగ్, రామ్ అవతార్‌సింగ్ మధ్య న్యాయపోరాటం ముగియలేదు. వందేళ్లు గడిచాయి.. సింగ్‌ల నాలుగోతరం న్యాయపోరాటంలో సమిధలవుతున్నారు. 1914లో వ్యాజ్యం క్రమసంఖ్య 73గా ఉండేది. తర్వాత ఈ నంబర్ రెండుసార్లు మారింది. 1927లో కేసు సంఖ్యను 84గా పేర్కొన్నారు. చివరగా 1992లో మళ్లీ కొత్త పుటల్లోకి బదలీ అయింది. వ్యాజ్యం నంబర్ 36గా నేటికీ కొనసాగుతోంది.

ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ వివాదానికి అసలు కారణం తొమ్మిదెకరాల వ్యవసాయ భూమి. కొయిల్వార్‌కు చెందిన అజర్ ఖాన్ అసలు యజమాని. ఆయన మరణానంతరం 1914లో ఖాన్ భార్య జైతూన్ అరా కోర్టుకెళ్లింది. ఈ భూమిని పోషణార్థం తన భర్త ఇచ్చాడంటూ మొరపెట్టుకుంది. ఇంతలో అజర్ ఇద్దరు కుమార్తెలు (సల్మా, బద్లాన్) మాకూ వాటా కావాలంటూ పోటీకొచ్చారు. బ్రిటీష్ కాలం నాటి సివిల్ కోర్టు భూమిని మూడు భాగాలుగా పంచింది. ఇద్దరు కుమార్తెలకు చెరొక 37.5 శాతం, జైతూన్‌కి 25శాతం కేటాయిస్తూ తీర్పు వెల్లడించింది. కథ సుఖాంతం అయ్యే సమయంలో రామ్ అవతార్‌సింగ్ రంగప్రవేశం చేశాడు. కథ మలుపు తిరిగింది.

అజర్‌ఖాన్ తొమ్మిదెకరాల్లో మూడెకరాలు తాను కొన్నానంటూ రామ్‌అవతార్ సింగ్ కేసు వేశాడు. జైతూన్ దీనిపై న్యాయపోరాటం మొదలుపెట్టింది. ఇదిలావుండగానే దర్బారీసింగ్ అనే వ్యక్తిపై రామ్ అవతార్ మరొక కేసు వేశాడు. సల్మా, బద్లాన్ వాటా కొచ్చిన భూమిలో మూడెకరాలు తాను కొనుగోలు చేశానని రాజ్‌పుత్ సామాజిక వర్గానికి చెందిన దర్బారీ చెబుతుండటమే ఇందుకు కారణం. రోజులు గడిచాయి. జైతూన్ మరణించింది. అజర్‌ఖాన్ తాలూకు వారసులు దేశ విభజనతో పాక్‌కు వెళ్లిపోయారు. కానీ వివాదం అలాగే ఉండిపోయింది. కుగ్రామంగా ఉన్న కొయిల్వార్ తర్వాత మునిసిపాలిటీగా రూపాంతరం చెందింది. ఎకరా భూమి ధర రూ 3-5 కోట్లకు ఎగబాకింది. మా తాత వారసుడిగా ఈ కేసును నేను కొనసాగిస్తున్నాను. గత ఐదేళ్లుగా మా లాయర్ ఇదే పని మీద ఉన్నాడు. ఎదుటి పక్షాన్ని రాజీకి ఆహ్వానించే ప్రయత్నం చేస్తూ వచ్చాడు. జడ్జి కూడా ఇదే సూచించాడు. కానీ ప్రత్యర్థి ఒప్పుకోవడం లేదు అంటూ వాపోయాడు దర్బారీసింగ్ మనుమడు అతుల్‌సింగ్. వందేళ్లుగా అన్ని సార్లు మేమే గెలుస్తూవచ్చాం. ఈ భూమిని మాకే అప్పగించండి అని న్యాయమూర్తికి మొరపెట్టుకున్నాం. జడ్జి కరుణించలేదు. దుమ్ముపట్టి, చెదలు తినగా మిగిలిన సగం సగం ఫైళ్లను అనాసక్తిగా పక్కనపెట్టేస్తూ, కేసును తదుపరి విచారణకు వాయిదా వేసాడు అని అతుల్ వాపో యాడు. దర్బారీ సింగ్, రామ్‌అవతార్ సింగ్ తరహా బాధితులు ఎందరో కేసుల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండగానే వారి జీవితం తెల్లారిపోతోంది.

మూడు దశాబ్దాలపై బడిన కేసులు 56,046

హైకోర్టు	30 ఏళ్ల కేసులు	మొత్తం కేసులు
అలహాబాద్	38,842	7.2లక్షలు
కోల్‌కతా	9,979	2.4 లక్షలు
పాట్నా	1971	1.5 లక్షలు
పంజాబ్	1157	3.9 లక్షలు
బాంబే	968	4.6 లక్షలు
మద్రాస్	392	4.0 లక్షలు
ఢిల్లీ	40	0.7 లక్షలు

అకోలా కేసు.. 1952

ఇదొక చారిత్రక వ్యాజ్యం. తుంకికర్ , ఇంగ్లె కుటుంబాలు 3 తరాలు ఈ కేసులో కొట్లాడుతూ వచ్చాయి. 1952 నుంచి నేటికీ అకోలా కోర్టు చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. 800 అడుగుల స్థలానికి సంబంధించి సరిహద్దు వివాదంపై ఈ రెండు కుటుంబాలు రాజీకి రాలేకపోయాయి. అప్పట్లో అంటే 22 ఆగస్టు 1949లో దీని విలువ రూ. 400. దీనికోసం లాయర్ల ఫీజులు, కోర్టు ఖర్చుల కింద లక్షల రూపాయలు చెల్లించుకున్నారు. 1952లో డెంటిస్ట్ అయిన డాక్టర్ కేశవ్ తుంక్లికర్, జబుజి ఇంగ్లె మధ్య తలెత్తిన వివాదాన్ని ఎవరూ పరిష్కరించలేక పోయారు. ప్రస్తుతం మూడో తరం పోరాటం చేస్తోంది. గ్రామ రెవెన్యూ అధికారులు ఈ రెండు ఇళ్ల మధ్య సరిహద్దులు తేల్చలేక పోతున్నారు. అప్పట్లోనే కొలతలు సరిగా వేసుకునివుంటే తరతరాల పోరాటం అవసరమే ఉండేదికాదు.

కోర్టు కంటే కేసు వయసే ఎక్కువ..

కలకత్తా హైకోర్టులోని ఈ కేసు నం.ఎఎస్‌టి-1/1800. 218 ఏళ్ల కిందట నమోదైంది. చివరిసారి గతేడాది నవంబర్ 20 దీనిపై విచారణ జరిగింది. దేశంలోనే కోల్‌కతా హైకోర్టును అతి పురాతనమైంది. ఇది 1862లో ఏర్పడింది. అయితే, కోర్టు కంటే ముందే పుట్టిన వ్యాజ్యం ఇప్పటికీ కొనసాగుతుండటం శోచనీయం.



అల్ట్రాటెక్ సిమెంట్ లాభం రూ.390 కోట్లు

న్యూఢిల్లీ : ఆదిత్యబిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.390.43 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.456.66 కోట్లు నికరలాభం ప్రకటించినట్లు బీఎస్ ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం రూ.9,492.94 కోట్లు కాగా క్రి తం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.8,056.54 కోట్లని ఒక ప్రకటనలో పేర్కొంది. బీఎస్ఈలో దీనిషేరు 1.57 శాతం క్షీణించి రూ.3789.20 వద్ద ఇంట్రాడేలో ట్రేడ్ అయ్యింది.

పీఎన్‌బీ హౌసింగ్ లాభంలో 32 శాతం అప్

క్యూ3లో రూ.303 కోట్లు

న్యూఢిల్లీ : పీఎన్‌బీ హౌజిం గ్ ఫైనాన్స్ క్యూ2లో ఏకీకృత నిక రలాభంలో 32 శాతం వృద్ధితో రూ.303 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.229.5 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది. మొత్తం ఆదాయం రూ.2,078.46 కోట్లకు ఎగబా కగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,416.21 కోట్లని పేర్కొంది. నికర వడ్డీ మార్జిన్ 3.06 శాతానికి చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.3.02 శాతమని పేర్కొంది. గరిష్ఠ ఎన్‌పీఏ 0.47 శాతం కాగా.. ఏడాది క్రితం 0.42 శాతం, నికర ఎన్‌పీఏ 0.37 శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 0.31 శాతంగా నమోదైంది.

చేజేతులా... చందాకొచ్చర్!



భర్త కంపెనీ లబ్ధి కోసం క్విడ్‌ప్రోకోకు పాల్పడిన చందా

ప్రైవేట్ బ్యాంకు... ఐసీఐసీఐ బ్యాంకులో జరిగిన రూ.3,250 కోట్ల భారీ కుంభకోణం ప్రస్తుతానికి వాస్తవం అని తేలిపోయింది. ఇప్పటి వరకు బ్యాంకు మాజీ సీఈవో, ఎండీ చందా కొచ్చర్‌ను బ్యాంకు బోర్డు వెనుకేసుకొచ్చింది. చందా ఎలాంటి క్విడ్ కో ప్రోకు పాల్పడలేదని బుకాయించింది. కొన్ని నెలల పాటు స్తబ్దుగా ఉన్న ఈ ఏపిసోడ్ తిరిగి గురువారం నాడు తెరపైకి వచ్చింది. ఐసీఐసీఐ బ్యాంకులో సీఈవోగా ఉన్నప్పుడు చందాకొచ్చర్ వీడియోకాన్ గ్రూపు ఛైర్మన్ వేణుగోపాల్ దూత్‌కు ఆయాచితంగా, కుట్రపూరితంగా రూ.3,250 కోట్ల రుణం మంజూరు చేసిందని, కేంద్ర నేరపరిశోధన విభాగం (సీబీఐ) నిర్ధారణకు వచ్చింది. చందాకొచ్చర్‌తో పాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. దీన్ని బట్టి చందాకొచ్చర్ క్విడ్ కోప్రోకు పాల్పడినట్లు నిర్ధారణ అవుతోంది.


దూత్

విజిల్ బ్లోయర్ లేఖతో వెలుగులోకి

కొచ్చార్ కుటుంబం.. వీడియోకాన్ గ్రూపునకు లబ్ధి చేకూర్చేందుకు చందాకొచ్చర్ తన పదవిని దుర్వినియోగం చేసి, నిబంధనలకు నీళ్లొదిలి భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసిందని, విజిల్‌బ్లోయెర్ అరవింద్ గుప్తా ప్రధానమంత్రి కార్యాలయానికి, నియంత్రణా సంస్థలకు 2016లో మొట్టమొదటిసారి లేఖ రాశారు. అయితే ఈ ఆరోపణలను ఐసీఐసీఐ బ్యాంకు బోర్డు తిప్పు కొట్టింది. అటు తర్వాత ఈ వార్త మెల్లమెల్లగా మీడియాలో పతాక శీర్షికకు చేరింది. అటు తర్వాత కూడా ఐసీఐసీఐ బోర్డు చందాకొచ్చర్‌ను రక్షించేందుకు విఫలయత్నం చేసింది. ఆమె వచ్చిన ఆరోపణలు దురేద్దశంతో కూడుకున్నవని, అభూతకల్పనలని కొట్టిపారేసింది. ఈ విషయం కాస్తా మీడియాకు ఎక్కడం, నియంత్రణా సంస్థల ఒత్తిడి పెరగిపోవడంతో బ్యాంకు బోర్డు ఈ అంశంపై శ్రీకృష్ణ కమిషన్‌ను నియమించి విచారణ చేయిస్తామని ప్రకటించింది. అటు తర్వాత ఆమెను సీఈవో పదవి నుంచి దిగిపోమ్మని కోరడం.. ఆమె ససేమిరా అనడం.. ఎట్టకేలకు ఆమెను పదవి నుంచి తప్పించడానికి బ్యాంకు బోర్డు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అప్పటికే జరగాల్సిన


దీపక్ కొచ్చార్

డ్యామేజీ జరిగిపోయంది. బ్యాంకు షేరు దాదాపు పాతాళానికి పడిపోయింది. ప్రస్తుతం సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది కాబట్టి.. లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని పెద్ద తలకాయలు తెగిపడే అవకాశాలున్నాయని బ్యాంకు వ్యవహారాలను దగ్గరి నుంచి గమనిస్తున్నవారు చెబుతున్నారు. ఐసీఐసీఐ బ్యాంకు బోర్డు ఆగమేఘాల మీద కొచ్చర్‌కు క్లీన్‌చిట్ ఇవ్వడానికి కారణం ఏమిటనే విషయంపై ప్రస్తుతం అనుమానాలు మరింత బలప డ్డాయి. కాగా ఐసీఐసీఐ మాత్రం కార్పొరేట్ గవర్నెన్స్‌లో తాము అత్యంత ఉన్నత ప్రమాణాలను పాటిస్తున్నామని నీతులు చెబుతోంది. వేలాది కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చేటప్పుడు నిబంధనలు పాటించడంలో బ్యాంకు పూర్తి వైఫల్యం చెందిందని వీడియోకాన్ ఎపిసోడ్‌ను చూస్తే తెలిసిపోతుంది.

న్యూపవర్‌లో దూత్ పెట్టుబడులు

ఐసీఐసీఐ నుంచి రుణాలు మంజూరు అయిన వెంటనే దూత్ న్యూపవర్‌కు రూ.64 కోట్లు నగదు బదిలీ చేశారు. దీపక్ కొచ్చర్ కొత్త విద్యుత్ ప్లాంట్‌నే టేకోవర్ చేసి కొత్తగా వ్యాపారం ప్రారంభించిన తర్వాత అతి పెద్ద పెట్టుబడి ఇదే. అటు తర్వాత కూడా కొచ్చర్‌లు దూత్ నుంచి పెద్దమొత్తంలో అక్రమంగా నగదు బదలీ చేయించుకున్న విషయం కూడా సీబీఐ విచారణలో వెలుగు చూసింది. ఎఫ్ఆర్ ప్రకారం చూస్తే దూత్ ఇక్కడతో ఆగకుండా.. తన విద్యుత్ కంపెనీ ఎస్ఈపీఎల్‌ను కొచ్చర్‌కు వివిధ లావాదేవీల తర్వాత బదిలీ చేశారు. అటు తర్వాతనుంచి ఐసీఐసీఐ క్రెడిట్ కమిటి వీడియోకాన్‌కు చెందిన పలు అనుబంధ సంస్థలకు రుణాలు మంజూరు చేస్తూపోయాయి.

సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చందా కొచ్చర్ క్రెడిట్ నిబంధనలు గాలికి వదిలి ఈ రుణాలు మంజూరు చేశారని, ఈ రుణాలు మంజూరు అయిన తర్వాత వీడియోకాన్ గ్రూపు కంపెనీలకు మంజూరు చేసిన ఖాతాలు ఒక్కొటి జూన్30, 2017న నిరర్థక ఆస్తులుగా మారిపోయాయి. దీంతో పలు అనుమానాలకు తావివ్వడం మొదలయ్యాయని పేర్కొంది.

నిబంధనలకు నీళ్లొదిలి...

చందా కొచ్చర్ బ్యాంకు నిబంధనలను తొంగలోతొక్కి వీడియోకాన్ గ్రూపునకు రూ.3,250 కోట్లు రుణాలు మంజూరు చయడంలో కీలకపాత్ర వహించారు. దీనికి ప్రత్యామ్నాయంగా వేణుగోపాల్‌దూత్ చందా కొచ్చార్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన న్యూపవర్ రెవన్యూవబుల్ లిమిటెడ్ కంపెనీలో రూ.64 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఈ పెట్టుబడులు దూత్‌కు చెందిన సుప్రీం ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఈపీఎల్) ద్వారా సమకూర్చారు. అటు తర్వాత దూత్ తన ఎస్ఈపీఎల్ కంపెనీని వివిధ రకాల లావాదేవీలు జరిపి పిన్నాకల్ ఎనర్జీ ఈ కంపెనీ దీపక్ కొచ్చర్‌కు చెందింది... దానికి బదిలీ చేశారు. ఈ అంశాలు మీడియా ద్వారా బహిర్గతం కాగా.. బ్యాంకు బోర్డు ముంబైలో 28 మార్చి 2018న సుదీర్ఘంగా సమావేశం జరిపి.. ఎట్టకేలకు ఒక నిర్ణయానికి వచ్చింది. అదేమింటే.. రుణం మంజూరు చేయడంతో ఎలాంటి క్విడ్‌ప్రోకో ప్రశ్నే తలెత్తదని, బంధుప్రీతి కానీ, రుణాలు మంజూరు చేసి ఆయాచితంగా లబ్ధి పొందే ప్రసక్తేలేదని ప్రకటనలో పేర్కొంది. చందాపై వస్తున్న ఆరోపణలన్నీ వట్టి పుకార్లను కొట్టి పారేసింది. బ్యాంకు బోర్డుకు చందాపై పూర్తి విశ్వాసం ఉందని తేల్చి పారేసింది.

బోర్డు వాదనతో ఏకీభవించని సీబీఐ

బ్యాంకు బోర్డు చందాను ఎంత వెనుకేసుకొచ్చినా.. సీబీఐ మాత్రం వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా జనవరి 22, 2019న ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో పూస గుచ్చినట్లు దూత్‌కు అనుకూలంగా చందాకొచ్చర్ నిబంధనలను ఎలా గాలికి వదిలేసిందో కూడా ప్రస్తావించింది. సీబీఐ ప్రాథమిక విచారణలో సీఈవోగా చందాకొచ్చర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, వీడియోకాన్ గ్రూపు కంపెనీలకు పలుమార్లు ఉదారంగా రుణాలు మంజూరు చేసిందని తేల్చి చెప్పింది. వాటిలో రూ.300 కోట్లు వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (వీఐఈఎల్)కు 26 ఆగస్టు 2009లో మంజూరు చేసిందని, అటు తర్వాత 7 సెప్టెంబర్ 2007లో కూడా వీఐఈఎల్‌కు ఒకసారి రుణం మంజూరు చేసిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

అన్నీ తప్పటడుగులే..

వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేసే కమిటిలో చందాలేకపోతే ఎలాంటి అనుమానాలకు తావిచ్చే అవకాశం ఉండేది కాదు. తన భర్తకు వీడియోకాన్ ఛైర్మన్ దూత్‌కు దగ్గరి సంబంధాలున్నాయని తెలిసి కూడా వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేసే కమిటిలో చందా ఉన్నారంటే .. ఏదో మర్మం ఉందన్న విషయం ఇట్టే తెలిసిపోతోంది. అయితే బోర్డు ఈ విషయాన్ని ఎందుకు కనిపెట్టలేపోయిందో అనుమానాలకు తావిస్తోంది. ఇవన్నీ ఒక్క ఎత్తు అయితే.. వీడియోకాన్ గ్రూపు కంపెనీల్లో చాలా కంపెనీల ఆర్థిక పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. డిసెంబర్ 31, 2011నాటికి ఎలక్ట్రానిక్స్ కంపెనీ కేవలం రూ.3.6 కోట్లు లాభాలను ఆర్జిస్తే.. అంతకు ముందు సంవత్సరం రూ.20 కోట్లు నికరలాభం ప్రకటించింది. వీడియోకాన్‌కు చెందిన మొత్తం ఐదు కంపెనీల్లో కనీసం రెండు కంపెనీలు ఆర్థికంగా చితికిపోయాయి. అయినా ఈ కంపెనీలకు కూడా ఐసీఐసీఐ బోర్డు ఉదారంగా రుణాలు మంజూరు చేసింది. వీటన్నిటికి బోర్డు వివరణ ఇవ్వాల్సి ఉంది. ఇక్కడ మరో అంశం ఏమిటంటే మార్చి 2016లోనే రిజర్వుబ్యాంకుకు, కేంద్రప్రభుత్వానికి ఐసీఐసీఐ బ్యాంకుల్లో జరుగుతున్న క్విడ్‌ప్రోకో గురించి దృష్టికి వచ్చినా పెద్దగా పట్టించుకోలేదు.

జ్యోతిల్యాబ్ లాభం రూ.48 కోట్లు

క్యూ3లో 30 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఎఫ్ఎంసీజీ దిగ్గజం జ్యోతి లేబరెటరీస్ క్యూ3 నికరలాభంలో 29.85 శాతం వృద్ధితో రూ.48.41 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.37.28 లక్షల కోట్లని బీఎస్ఈకి సమాచారం అందిం చింది. స్టాండ్ఎలోన్ రెవెన్యూ రూ.434.33 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.408.78 కోట్లని తెలిపిం ది. బీఎస్ఈలో దీని షేరు 5.89 శాతం క్షీణించి రూ.181.40 వద్ద ట్రేడ్ అయ్యింది.

ఎస్‌బ్యాంకు లాభంలో 7% క్షీణత

క్యూ3లో రూ.1,002 కోట్లు

ముంబై: డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఎస్ బ్యాంకు నికరలాభంలో 6.95 శాతం క్షీణించి రూ.1,001.85 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,076.87 కోట్లు ఆర్జించింది. మౌలికరంగానికి చెందిన అతి పెద్ద కంపెనీకి ఇచ్చిన రుణం సుమారు రూ.570.8 కోట్లు మొండిబకాయిగా మారిందని, ఈ ఖాతాకు రూ.550.2 కోట్లు కేటాయించినట్లు బ్యాంకు బీఎస్ఈకి సమాచారం అందించింది. అయితే ఆ కంపెనీ పేరు మాత్రం వెల్లడించలేదు. వడ్డీ ద్వారా ఆదాయం ఏడాది ప్రాతిపదికన 41.2 శాతం పెరిగి రూ.2,666.4 కోట్లకు ఎగబాకింది. కాగా అడ్వాన్స్‌లు 42.2 శాతం పెరిగి ఏడాది ప్రాతిపదికన రూ.2,43,885 కోట్లకు చేరింది. బ్యాంకు మొండి బకాయిలు కూడా 2.1 శాతం పెరగ్గా... ఏడాది క్రితం 1.72 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏ 1.18 శాతానికి ఎగబకాగా.. ఏడాదిక్రితం 0.93 శాతంగా నమోదైంది. ఇదిలా ఉండగా ఎస్ బ్యాంకు సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ రాణాకపూర్ వారసుడిగా రవనీత్‌సింగ్ గిల్‌ను నియమించయినట్లు గురువారం బ్యాంకు ప్రకటించింది. ప్రస్తుతం ఆయన డాయిష్ బ్యాంకు చీఫ్‌గా పనిచేస్తున్నారు. కాగా రాణాకపూర్ పదవీ కాలం జనవరి 31తో ముగుస్తుంది.

కాల్గేట్ పామ్మోలివ్ లాభం రూ.192 కోట్లు

క్యూ3లో 12.6 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఎఫ్ఎంసీజీ దిగ్గజం కాల్గొటే పామ్మోలివ్ ఇండియా లిమిటెడ్ (సీపీఐఎల్) క్యూ 3 నికరలాభంలో 12.56 శాతం వృద్ధితో రూ. 192. 10 కోట్లు ఆర్జించింది. వ్యాల్యూమ్స్ పెరగ డమే దీనికి కారణం. క్రితం ఏడాది ఇ దే త్రైమాసికంలో రూ.170.65 కోట్లని కంపె నీ బీఎస్ఈకి సమాచా రం అందించింది. మొత్తం ఆదాయం రూ. 1,107.26 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది రూ.1,041.88 కోట్లతో పోల్చుకుంటే 6.27 శా తం వృద్ధి కనిపించింది. బీఎస్ ఈలో దీనిషేరు 1.01 శాతం పెరిగి రూ.1320.15 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.



నానోకు టాటా!



ఏప్రిల్ 2020 నుంచి నిలిపివేత

హైదరాబాద్ : రతన్‌టాటా కలల కారు టాటానానోపై టాటామోటార్స్ ఇక నుంచి అదనంగా పెట్టుబడులు పెట్ట రాదని నిర్ణయించినట్లు కంపెనీ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కాగా నానోను బీఎస్-6 ప్రమాణాల స్థాయికి తీసుకురావాలంటే అదనంగా పెట్టుబడులు పెట్టా ల్సి వ స్తుంది. కాబట్టి వచ్చేఏడాది ఏప్రిల్ నుంచి ఉత్పత్తితో పా టు అమ్మకాలు కూడా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. నానోకారును గుజరాత్‌లోని సనంద్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి కొత్త భద్రత ప్రమాణాలను అందుబాటులోకి వచ్చాయి. అలా గే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మరిన్ని కొత్త నిబంధనలు రానున్నాయి. ఇక వచ్చే అక్టోబర్ నుంచి మరిన్ని కొత్త భద్రతా నిబంధనలు అమల్లోకి వస్తాయి. అటు తర్వాత ఏప్రిల్ 1, 2020 నుంచి బీఎస్-6 ప్రమాణాలు అమల్లోకి రానున్నాయి. కాబట్టి వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అన్నీ ప్రొడక్టులు అంటే కార్లు బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేయాలసి వస్తుంది. కొన్ని ప్రొడక్టులను అంటే కార్లను అప్‌గ్రేడ్ చేయదలచుకోలేదని, వాటిలో నానో ఒకటని.. దీని కోసం అదనంగా పెట్టుబడులు పెట్టదలచు కోలేదని టాటామోటార్స్ ప్రెసిడెంట్ ప్యాసింజర్ వెహికల్ మయాంక్ పారిక్ వివ రించారు. ఇక నానో విషయానికి వస్తే.. ఇది ఎంట్రీ లెవ ల్ కారు.. ప్రపంచంలోనే అత్యంత చౌక కారు... ద్విచ క్రవాహనాలపై తిరిగే వారికి ప్రత్యామ్నాంగా చౌకధరకు అందరికి అందుబా టులో ఉండే విధంగా ఈ కారును తీసుకొచ్చారు. అయితే భారతీయ మార్కెట్లో దీనికి పెద్దగా స్పందన రాలేదు. 2009లో ప్రారంభించిన ఈ కారు ధర రూ. 1లక్షగా నిర్ణయించారు. నానోతో పాటు మరి కొ న్ని మోడ ల్స్‌ను వచ్చే ఏడాది నుంచి నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఏప


హైదరాబాద్, ఆంధ్రప్రభ : టాటా మోటార్స్ నుంచి మరో ఎస్‌యూవీ - ది హారియర్ కారును గురువారం మార్కెట్ లోకి విడుదల చేశారు. అంతర్జాతీయ ఎస్ యూవీ అయిన హారియర్ డిజైన్, ఉత్పత్తుల పరిపూర్ణ సమ్మేళనంతో ఈ కారును రూపొందించినట్లు ప్యాసింజర్ వెహికిల్ బిజినెస్ ప్రెసిడెంట్ మయాంక్ ఫరీఖ్ చెప్పా రు. వివిధ రహదారులపై తిరుగులేని డ్రైవిం గ్ డైనమిక్స్ ఇది అందిస్తుందని, ఇంపాక్ట్ డిజైన్ 2.0 డిజైన్ లాంగ్వేజ్‌ను కలిగిన మొద టి వాహనంగా దీన్ని

టాటా హారియర్ విడుదల

రూపొందించినట్లు ఆయన చెప్పారు. అందమైన ఎక్స్‌టీరి యర్స్, విలాసవంతమైన ఇంటీరియర్స్‌తో విడుదల చేసిన ఈ కారు ధర రూ.12.69 లక్షల నుంచి ఆరంభమవుతుందని మ యాంక్ తెలిపారు. ఈ కారు సురక్షిత ఫీచర్లు కలిగి ఉందని, క్లిష్టమైన డ్రైవింగ్ పరిస్థితుల్లో నిలకడను అందిస్తుందని చెప్పారు. ఆరు ఎయిర్ బ్యా గ్స్, చైల్డ్ సీటు, యాంకర్ పాయింట్స్ లాం టివన్నీ రక్షణ కల్పించేలా డిజైన్ చేసినట్టు ఆయన తెలిపారు.

ప్యాసింజర్ కార్లను నిలిపి వేస్తున్న విషయం ఆయన వెల్లడించలేదు. ఇదిలా ఉండ గా పారిఖ్ గురువారం నాడు కొత్త ఎస్‌యూవీ హరియ ర్‌ను తెలంగాణ మార్కెట్లో విడుదల చేశారు. కొత్త ఎస్‌యూవీ కావాలనుకొనే వారు సుమారు మూడు నెలల పాటు వేచి చూడాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

మెర్సిడెజ్‌బెంజ్ లగ్జరీ ఎంపీవీ- వీ క్లాస్



న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లగ్జరీ మల్టీపర్పస్ కార్ల రంగంలో ఎంట్రీ ఇచ్చింది. భారత్ మార్కెట్ కోసం ప్రత్యేకంగా వీ- క్లాస్‌ను గురువారం పరిచయం చేసింది. ప్రారంభధర రూ.68.40 లక్షలుగా నిర్ణయించింది. వీ-క్లాస్ ఎంపీవీ మొత్తం ఆరు సీటర్లతో పాటు లాంగ్ వీల్‌బేస్ (ప్రత్యేకంగా) ఉంటుంది. అలాగే ఏడు సీటర్ల ఎక్స్‌ట్రా లాంగ్ బేస్ వీల్(ఎక్స్‌ప్రెషన్) వెరియంట్ కూడా అందుబాటులో ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా వీ-క్లాస్ ఎక్స్‌ప్రెషన్ ప్రారంభధర రూ.68.40 లక్షలు కాగా.. వీ క్లాస్ ఎక్స్‌క్లూజివ్ ప్రారంభధర రూ.81.90 లక్షలు (అన్నీ ఎక్స్ షోరూం) ధరలని ప్రకటనలో వివరించింది. భారతీయ కస్టమర్ల కోసం ప్రత్యేకంగా లగ్జరీ మల్టీపర్పస్ వాహనాన్ని అందిస్తున్నామని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మార్టిన్ స్వెవెన్క్ తెలిపారు. వీ-క్లాస్ ఎంపీవీ ప్రధానంగా పెద్ద పెద్ద కుటుంబాల వారికి, క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారికి వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని విక్రయిస్తామని ఆయన వివరించారు.

సదరన్ ట్రావెల్స్ హాలిడే బజార్

రేపు ,ఎల్లుండి



హైదరాబాద్ : ట్రావెల్ అండ్ టూరిజం రంగంలో అగ్రగామిగా పేరొందిన సథరన్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో హాలిడే బజార్‌ను నిర్వహిస్తోంది. దేశ, విదేశాలకు విహారయాత్రలకు వెళ్లే పర్యాటకులు ఈ హాలీడే బజార్‌ను సందర్శించి సదరన్ ట్రావెల్స్‌కు చెందిన నిపుణులతో చర్చించి వివిధ టూర్ ప్యాకేజీల గురించి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ హాలీడే బజార్‌లోనే టూర్ ప్యాకేజీలపై పత్ర్యేక డిస్కౌంట్ ఆఫర్‌లను అందిస్తోంది. హాలీడేబజార్ లో జరిగేపట్టణాలు, వాటి చిరునామాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్.. గోల్కొండ హోటల్‌లో ఈ నెల 26,27 తేదీల్లో.. అలాగే మియాపూర్ క్రాస్ రోడ్.. హోటల్ శ్రీకృష్ణగ్రాండ్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో.. హైటెక్‌సిటి వద్ద ది పీర్‌లెస్ ఇన్.లో కూడా శనివారం, ఆదివారా ల్లో ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్ వద్ద హోటల్ గ్రాండ్ స్వాగత్ లో ఈ నెల 26,27 తేదీల్లో ఈ బజార్‌లను నిర్వహిస్తారు. **వరంగల్:** హన్మ కొండ వద్ద సుప్రభాత్ హోటల్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో. **కరీంనగర్ :** పో లీస్ పరేడ్ గ్రౌండ్ ఎదురుగా ప్రతీమా రీజె న్సీలో ఈ నెల 26, 27 తేదీ ల్లో. **ఖమ్మం :** గాంధీ చౌక్, గాంధీస్తూపం వద్ద బడ్జెట్ హో టల్‌లో ఈ నెల 26,27 తేదీల్లో. **సూర్యాపేట :** ఎంజీ రోడ్, మానసా నగర్, హోటల్ బాలాజీ గ్రాం డ్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో ఈ హాలీడే బజార్‌లు జరుగు తా యి. ఈ బజా ర్‌లో బిగ్ క్యాష్ డిస్కౌంట్స్‌తో పాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్, కొ త్త టూ ర్ ప్యా కే జీల వివరా లు తెలుసుకోవచ్చునని సదరన్ ట్రావెల్స్ ఒక ప్రకటనలో పే ర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ అనెస్తిషియా ఔషధం

అమెరికా మార్కెట్లో

హైదరాబాద్ : డాక్టర్ రెడ్డీస్ లేబరెటరీస్ అమెరికా మార్కెట్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో వినియోగించేందుకు ప్రోపోఓల్ ఇంజెక్టబుల్ ఎమల్షన్ అనే జనరల్ అనెస్తియాను విడుదల చేసింది. ప్రోపోఫోల్ ఇంజెక్టబుల్ ఎముల్షన్ అనేది థెరాప్యూటిక్ జెనెరిక్ వెర్షన్ డిప్రివాన్ (ప్రోపోఫోల్) ఇంజెక్టబుల్ ఎముల్షన్ అని కంపెనీ బీఎస్ఈకి అందించిన సమాచారం వివరించింది. ఎనెస్తిషియా అంటే మత్తుమందు కాబట్టి దుర్వినియోగం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా జైళ్ల నుంచి వచ్చే ఆర్డర్లు తీసుకోమని స్పష్టం చేసింది. డిప్రివాన్ బ్రాండ్ మార్కెట్ అమెరికాలో సుమారు 310 మిలియన్ డాలర్లు ఉంటుందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

సీఫుడ్ మార్కెటింగ్‌కు ప్రోత్సాహకాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మానవ ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడే సీ ఫుడ్ మార్కెటింగ్‌కు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాణి కుముదిని తెలిపారు. అందుకోసం మత్స్య సహకార సంఘాల్లోని యువకులకు, రెస్టారెంట్ నిర్వాహకులకు మొబైల్ సీ ఫుడ్ మార్కెటింగ్ వాహనాలు అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజా వద్ద ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మూడు రోజులపాటు జరిగే ఫిష్ ఫెస్టివల్‌లో 20 స్టాళ్ళు ఉంటాయని, కేవ లం ఫిష్‌తో చేసే రకరకాల వంటలు ఇక్కడ ప్రదర్శనతో పాటు అమ్మకాలు జరు గుతాయని రాణి కుముదిని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ సి.సువర్ణ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా యూనిగేజ్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇంజనీరింగ్ విద్యలో ఇప్పటి వరకు దేశంలోనే ఎక్కడా లేనివిధంగా యూనిగేజ్ ఎరా ఫౌండేషన్ అతిపెద్ద మల్టీ ప్రైవేట్ యూనివర్సిటీని నెలకొల్పుతోందని ఆ సంస్థ సీఈవో పి.మురళీధర్ తెలిపారు. మొత్తం 140 నగరాల్లో 400 కేంద్రాల ద్వారా ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపికచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ బీఈ, బీటెక్ కోర్సులకు కోమెడ్ కె యుగెడ్, యూనిగేజ్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ఏడాది మే 12న ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలు జాతీయ స్థాయిలో 180కి పైగా విద్యాసంస్థలు, 21 యూనివర్సిటీల ఆమోదంతో జరుగుతాయన్నారు.

కాకతీయ ఖనిలో పనుల నిలిపివేతకు నో


న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా , కాకతీయ ఖని-2లో జరుపుతున్న పేలుళ్లను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులిచ్చేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నిరాకరించింది. గని నుంచి బొగ్గు వెలికితీత కోసం పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తూ పేలుళ్లు జరుపు తున్నారంటూ రాజలింగమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది. పనులు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, త్వరలోనే కేసు విచారణ పూర్తి చేసి తుది తీర్పునిస్తామని స్పష్టం చేసింది. రాజలింగమూర్తి పిటిషన్‌పై ఎన్జీటీ గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నివేదికకోరగా, గురువారం జరిగిన విచారణ సమయంలో కేంద్రం ఆ నివేదికను సమర్పించింది. తదుపరి కేసు విచారణను ఫిబ్రవరి 8కు వాయిదా వేసింది.

పొరుగు రాష్ట్రాల వార్తలు రాయడం నేరమా?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో విపక్షాల వార్తలు రాకుండా తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పత్రికలు, మీడియాను నియంత్రిస్తున్నారని తెలుగుదేశంపార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి ఆరోపించారు. పొరుగు రాష్ట్రాల వార్తలు తెలంగాణలో రాయడంపట్ల మీడి యాపై ఆయన అసహనం వ్యక్తంచేయడం సరి కాదన్నారు. పొరుగు రాష్ట్రాలపత్రికలు, టీవీ ఛానళ్ళు తమకు అనుకూలంగా ప్రచారం చేయడం లేదన్న అక్కసుతోనే ఆయన మాట్లాడుతున్నారని దుయ్య బట్టారు. తెలంగాణలో మీ కుటుంబాన్ని కీర్తించే పత్రికలు, టీవీ ఛానళ్ళను ప్రోత్సహిస్తున్నామంటున్నారని, తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడినట్లా అని నర్సిరెడ్డి ప్రశ్నించారు.

రాహుల్ లేదా ప్రియాంక మెదక్ నుంచి పోటీచేయాలి



హై దరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ లేదా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీల్లో ఒకరిని మెదక్ పార్లమెంట్ నుంచి పోటి చేస్తే గెలిపించుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. గురువారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన గాంధీ కుటుంబం నుంచి ఎవరు పోటి చేసినా ఏకగ్రీవమయ్యేలా చూడాలని సీఎం కేసీఆర్‌ను ఆయన కోరారు. బీజేపీని ఒప్పించే బాధ్యతను సీఎం కేసీఆర్ తీసుకోవాలన్నారు. రాహుల్, ప్రియాంకలో ఒకరిని మెదక్ నుంచి పోటి చేయాలని ఏఐసీసీకి లేఖ రాయనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. తెలం గాణపైన ప్రియాంక ప్రభావం ఉటుందని, ఆమెలో ఇందిరాగాంధీని ప్రజలు చూసుకుంటున్నారని జగ్గారెడ్డి తెలిపారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు తాను పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.

డిఫెన్స్ ఉద్యోగుల సమ్మెకు సీపీఎం మద్దతు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ యత్నాలకు నిరసనగా ఆ రంగంలోని ఉద్యోగులు చేస్తున్న 23, 24, 25 తేదీలలో మూడు రోజుల సమ్మెకు పూర్తి మద్దతిస్తున్నట్లు సీపీఎం ప్రకటించింది. గడచిన నాలుగేళ్ళ ఎన్‌డిఏ ప్రభుత్వం డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ పేరుతో అమలు చేస్తున్న విధానాల ఫలితంగా 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డీఆర్‌డీవో ల్యాబ్‌లు, 9 ఆర్మీఆధారిత వర్క్‌షాప్‌లు, ఇంజనీరింగ్ సర్వీసు వర్క్‌షాప్‌లు, డిఫెన్స్ ప్రొడక్షన్స్, మిలిటరీ ఫామ్స్ తదితర సంస్థలన్నీ బలహీనపడుతున్నాయన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. రక్షణ రంగ ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

ఫారెస్టు అధికారులకు నియామక పత్రాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫారెస్టు రేంజ్ అధికారులుగా కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అటవీశాఖ ఉన్నతాధికారులు అందజేశారు. టిఎస్‌పిఎస్సీ ద్వారా నేరుగా ఉద్యోగాలకు ఎంపికైన 66 మంది ఫారెస్టు రేంజ్ అధికారులకు నియామక పత్రాలను అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పిసిసిఎఫ్) పి. కె. ఝా అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న 66 మందిలో 21 మంది మహిళలు ఉన్నారు. వీరికి 18 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. నలభై ఒక్క మందికి అస్సాంలోనూ, 25 మందికి కర్నాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌లో శిక్షణ ఫిబ్రవరి రెండో వారం నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా పి.కె.ఝా మాట్లాడుతూ.. అడవుల సంరక్షణలో దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని ప్రాధాన్యతను ముఖ్యమంత్రి కెసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి: అన్సారి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ రహీముద్దీన్ అన్సారి చెప్పారు. భాషాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన పథకాలన్నీ పూరిస్థాయిలో అమలుచేస్తామన్నారు. చిన్నస్థాయి ఉర్దూ ప త్రిక లను ఆదుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని ఆయన తెలి పారు. ఒక్కొక్క పత్రికకు 5వేలరూపాయల చొప్పున సహాయం చేశామని, ఇప్పటి వరకు 421 పత్రికలకు మొత్తం రూ.21.05 లక్షల సహాయం అందించామన్నారు. గురువారం హజ్ హౌస్‌లో 2019 ఉర్దూ అకాడమీ క్యాలెండర్‌ను అన్సారి ఆవిష్కరించారు. ఉర్దూకి విశేషసేవలందించిన వారికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేస్తామన్నారు.

హైకోర్టు చరాస్తులు ఇలా పంచుకుందాం

(మొదటిపేజీ తరువాయి)



ఏపీ హైకోర్టు తాత్కాలిక కార్యకలాపాలు ప్రారంభించడం, అలాగే ఫిబ్రవరి 3న ఏపీ రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న నూతన భవనంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర హైకోర్టు కార్యకలాపాలు కొనసాగనున్న నేపథ్యంలో ఈ ఉన్నతస్థాయి అధికారుల సమావేశం కీలక నిర్ణయాలపై క్షుణ్ణంగా చర్చించింది. ఈ సందర్భంగా సీఎస్ అనిల్‌చంద్ర పునేఠ మాట్లాడుతూ ఇప్పటికే ఏపీ హైకోర్టు విజయవాడకు తరలించిన నేపథ్యంలో చరాస్తులను రెండు రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన 58:42 నిష్పత్తిలో పంపిణీ చేసుకోవడం వల్లపూర్తిస్థాయిలో ప్రయోజనం ఉంటుందని సూచించారు. దీనిపై తెలంగాణ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే.జోషీ, ఉభయ రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్లు, న్యాయశాఖ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో పాటు ఏపీ సీఎస్ పునేఠ సూచనల ప్రకారం హైకోర్టు ఆస్తుల విభజనకు అంగీకరించారు. అనంతరం ఉన్నతాధికారుల సమక్షంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సీఎస్‌లు ఒప్పంద పత్రాలపైసంతకాలు చేశారు. హైకోర్టుకు సంబంధించిన ఆస్తుల విషయంలో ఏర్పాటు చేసిన తొలి సమావేశంలోనే ఒక స్పష్టమైన అంగీకారానికి రావడం, ఆపైన తగిన చర్యలు తీసుకోవ డానికి వీలుగా ఇరు రాష్ట్రాల సీఎస్‌లు అంగీకరిం చడం తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల హైకోర్టు రిజి స్ట్రార్లు, న్యాయశాఖ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

తెలుగురాష్ట్రాల సమస్యలకు త్వరలో పరిష్కారం: ఏపీ సీఎస్ పునేఠ

రాష్ట్ర విభజన జరిగి నాలుగున్నరేళ్లు అయిన తరువాత ఇప్పటికీ విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లో కీలక సమస్యలు అపరిష్కృతంగా ఉండటంతో పలు సందర్భాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అయితే వాటిని సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించే దిశగా తాను ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ 'ఆంధ్రప్రభ' ప్రతినిధికి తెలి పారు. గురువారం హైదరా బాద్‌లో ఉభయ రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో పాల్గొని తిరిగి అమరావతికి చేరుకున్న అనంతరం ఆయన ఈ విషయం వెల్లడించారు. అయితే మాజీ సీఎస్ దినేష్ కుమార్ కూడా కీలక అంశాలపై తెలంగాణ సీఎస్‌తో ఫలవంతమైన చర్చలు జరిపారని పునేఠ వ్యాఖ్యానించారు. షెడ్యూల్ 9, 10లోని అంశాలపై ఒక స్పష్టత రావడానికి కేంద్ర ప్రభు త్వం కూడా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్య దర్శితో గురు వారం జరిగిన సమావేశం అనంత రం భవిష్యత్‌లో ఇరు రాష్ట్రాల మధ్య జరిగే చర్చలు పూర్తి స్థాయిలో ఫలప్రదం అయ్యే అవకాశా లున్నా యన్న విశ్వాసం తనకు ఉందని అనిల్‌చంద్ర పునేఠ వ్యాఖ్యానించారు.

119 బీసీ గురుకులాల ఏర్పాటుపై స్పష్టత

• పంచాయతీ ఎన్నికల అనంతరం ప్రకటన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్న 119 బీసీ గురుకులాలపై స్పష్టత వచ్చింది. నియోజకవర్గంలో ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అత్యధికంగా 88 స్థానాల్లో గెలుపొందిన సంగతి తెలిసిందే. టీఆర్‌స్ గెలుపొందిన స్థానా ల్లోని స్థానిక ఎమ్మెల్యేలతో సీఎంవో అధికారులు బీసీ గురు కులాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలని కోరగా సంబంధిత ఎమ్మెల్యేలు స్కూల్ ఎక్కడ కావాలో చెప్పడంతో సీఎంవో 119 స్కూల్స్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ప్రకటించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నెల 30 తరువాత బీసీ గురుకులాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం వెలువడనుంది.

బీసీ గురుకులాన్ని ఏర్పాటు చేయాలంటే అధికారులు స్కూల్ ఏర్పాటుకు సంబంధించి భవనాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభమైన బీసీ గురుకులాల నిర్వహణ కోసం భవనాలను వెతకడానికి అధికారులకు నెలల సమయం పట్టింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కూడా భవనాలను వెతుక్కోవడానికి అధికారులకు కనీసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అలాగే స్కూల్‌కు అనుమతి వస్తే అక్కడ ఏర్పాటు చేయాల్సిన కనీస సౌకర్యాలు ఇతర సౌకర్యాల గురించి కూడా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులు ఆ పనులు చేసుకోవడానికి సమయం కావాలి కాబట్టి ప్రభుత్వం నిర్ణయం కోసం అధికారులు కూడా ఎదురు చూస్తున్నారు. కొత్త గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది భర్తీ కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఉద్యోగుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి కోసం ఫైల్ పెండింగ్‌లో ఉంది. దీనిపై ఆర్థిక శాఖ త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మొత్తం 4165 పోస్టుల భర్తీకి బీసీ గురుకుల సొసైటీ అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించారు.

పీజీ ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే ఏడాది పీజీలో ప్రవేశాలకు కామన్ పరీక్షను నిర్వహించనున్నారు. పీజీలోని కొన్ని సబ్జెక్టులకు ఉస్మానియా యూని వర్సిటీ పరీక్షలను నిర్వహించనుండగా మరికొన్నింటికి కాకతీయ వర్సిటీ పరీ క్షలను నిర్వహించనుంది. ఈ మేరకు రెండు యూనివర్సిటీల వీసీలతో తెలంగాణ ఉన్నత విద్యా మండల త్వరలో సమావేశం నిర్వహించి నిర్ణయాన్ని ప్రక టించనుంది. ఇప్పటి వరకు ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూని వర్సిటీలు పీజీలో ప్రవేశాలకు వేర్వేరుగా నిర్వహిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఇకపై రెండు వర్సిటీలు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలను నిర్వహించకుండా రాష్ట్రంలో కామన్ పరీక్షలను నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి భావించింది. అయితే ఈ ఏడాదే అందుకు సంబంధించిన ప్రయత్నం ప్రారంభించినప్పటికీ రెండు యూనివర్సిటీల యాజమాన్యాలు అందుకు అంగీకరించలేదు. దీంతో 2018-19 విద్యా సంవత్సరంలో వేర్వేరుగానే రెండు వర్సిటీలు పీజీలో ప్రవేశాలకు ఎంట్రన్స్‌లను నిర్వహించాయి. అయితే వచ్చే ఏడాది నుంచి అలా కాకుండా రాష్ట్రంలో సబ్జెక్టుల వారీగా కామన్ పరీక్షను నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఈ మేరకు రెండు వర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ వేర్వేరుగా మాట్లాడారు. ఇద్దరు వీసీలతో సమావేశం ఏర్పాటు చేసి వారికి వచ్చే ఇబ్బందులను తెలుసుకొని నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ అధ్యాపకుల భర్తీకి హైకోర్టు అనుమతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని ఆశ్రమ డిగ్రీ(మహిళా) కాలేజీల్లో ఖాళీగా ఉన్న 545 అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను కొనసాగించేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. అయితే ఒకపోస్టు (పొలిటికల్ సైన్స్) ను పిటిషనర్ కోసం రిజర్వు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కోసం నిర్వహించిన ఇంటర్వ్యూ ఫలితాలను ప్రకటించదంటూ గతంలో స్టే ఉత్తర్వులను హైకోర్టు ఎత్తివేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ఈ మేరకు తీర్పును వెలువరించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ నంబర్ 22/2017 లో పేర్కొన్న మేరకు బీసీలకు కేటాయించిన 29 శాతం పోస్టులను అన్ రిజర్వుడ్ వర్గాలకు, ఇతరులకు పంపిణీ చేస్తున్నారని పేర్కొంటూ హైదరాబాద్ కు చెందిన నిరుద్యోగి సీహెచ్.సుజాత హైకోర్టు లో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. రెసిడెన్షియల్ డిగ్రీ(మహిళా) కాలేజీల్లో ఖాళీగా ఉన్న 546 పోస్టులను భర్తీ చేసేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీపీఎస్సీ) నోటిపికేషన్ నంబర్ 22/2017 ను జారీ చేసిన విషయం తెలిసిందే.

మూడు సెట్స్ తేదీల్లో మార్పులు

• కన్వీనర్ల సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ఇంజ నీరింగ్‌తోపాటు వివిధ వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే సెట్స్ కన్వీనర్ల సమావేశం గురు వారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. మూడు సెట్స్‌ల వివిధ కారణాల రీత్యా మూడు సెట్స్ తేదిల్లో మార్పులు చేశారు. మే 26న జరగాల్సిన లాసెట్, పీజీ లాసెట్ పరీక్షను మే 20న నిర్వహించాలని, పీజీ ఈ సెట్ పరీక్షను మే 27 నుంచి 29 వరకు కాకుండా 28 నుంచి 31 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఎడ్‌సెట్ పరీక్షను గతంలో మే 30, 31న రెండు రోజుల పాటు నిర్వహించాలనుకున్నప్పటికీ ఒకేరోజు 60వేల మందికి ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించే అవకాశం ఉన్నందని టీసీఎస్ అధికారులు చెప్పడంతో ఎడ్ సెట్ పరీక్షను కేవలం ఒకరోజు మే 31న నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకు న్నారు. గతంలో పరీక్షల సందర్భంగా నాచారంలోని నోమా ఫంక్షన్ హాల్ దగ్గర ట్రాఫిక్ సమస్యలు వచ్చాయని ఈ సారి అవి లేకుండా చూడాలని ట్రాఫిక్ అధికారులను కోరాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే పరీక్షల సందర్భంగా ఎటువంటి విద్యుత్ అంతరాయం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో సీఎండీకి లేఖ ద్వారా తెలియజేయాలని కోరాలని సమావేశం నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావుతోపాటు ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం, జెఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య, ఈ-సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్, పిజికల్ ఎడ్యుకేషన్ కన్వీనర్ ప్రొఫెసర్ వి సత్యనారాయణ, ఐ-సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ రాజేశం, లా సెట్, పీజీలాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ జిబి రెడ్డి, పీజీ ఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం కుమార్, ఎడ్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి మృణాళిని పాల్గొన్నారు.

'మోడీ విధానాలతో దేశం అప్పుల్లోకి..'

హై దరాబాద్, ఆంధ్రప్రభ : ప్రధాని నరేంద్రమోడి అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో దేశం అప్పుల్లోకి కూరుకుపోతున్నదని టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అప్పుల కంటే కేవలం మోడి ప్రభుత్వంలో 49 శాతం అప్పులు పెరిగాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరేంద్రమోడి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే వరకు అంటే 2014 జూన్ వరకు మన దేశం రూ. 54,90,736 కోట్ల అప్పులు ఉంటే.. ఈ నాలుగేళ్లలో ఆ అప్పులు రూ. 82,03,253 కోట్లకు చేరాయని , ఈ నాలుగున్నరేళ్లలో మోడి ప్రభుత్వం రూ, 28,92,171 కోట్ల అప్పు లు చేసిందన్నారు.

'విద్యుత్ ఉత్పత్తి రాయితీలు పెంచాలి'

హై దరాబాద్,ఆంధ్రప్రభ: దేశంలో విద్యుత్ ఉత్పత్తి రాంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ రంగంపై రాయితీలను పెంచాల్సిన అవసరం ఉందని ఇండియన్ పవర్ కార్పోరేషన్ ఎండి రాఘవ్ కనోరియా తెలిపారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొరత ప్రధాన సమస్యగా ఉందన్నారు. బొగ్గు తక్కువ ధరకు అందించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు.థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దీర్ఘకాలం ఆధార పడకుండా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాలన్నారు. బొగ్గు దిగుమతిపై ఇప్పుడు న్న5శాతం పన్నులు ఇంకా తగ్గించాలన్నారు. సోలార్ , విండ్ పవర్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు.

గల్లీలో ఓ మాట.. ఢిల్లీలో ఓ మాట

• తెదేపాతో పొత్తుపై కాంగ్రెస్ భిన్న స్వరాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తుపై కాంగ్రెస్ పార్టీ ఒక్కో చోట ఒక్కోలా స్పందిస్తోంది. టీడీపీతో పొత్తు లేకుండా ఒంటరిగానే ఎన్నికల్లో పోటీకి వెళ్తున్నామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఊమెన్ చాండీ వ్యాఖ్యానించిన మర్నాడే, ఏఐసీసీ మరో విధంగా స్పందిం చింది. గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి మనీష్ తివారీని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఊమెన్ చాండీ వ్యాఖ్యలు, వాటిపై మీడియాలో వచ్చిన కథనాలు తాము చూశామన్నారు. ఆయన ఏ సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేశారో తమకు తెలియదని మనీష్ తివారీ తెలిపారు. పొత్తులపై రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జితో చర్చించిన తర్వాత తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఓ మాట, ఢిల్లీలో ఓ మాట మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతల తీరుతో ఆ పార్టీ కార్యకర్తల్లోనే గందరగోళం నెలకొంది.

రాష్ట్ర నాయ కత్వంలో కొందరు టీడీపీతో పొత్తు కోరుకుంటుండగా, మరికొందరు ఈ పొత్తును తీవ్రంగా వ్యతిరేకి స్తున్నారు. పొత్తు లేకపోతే ఓట్లు పొందినా సీట్లు పొంద డం కష్టమని, సభలో ప్రాతినిధ్యం లేకుండా పోతుందని పొత్తు కోరుకుంటున్న వర్గం వాదిస్తోంది. అయితే ఆ పార్టీతో పొత్తు కారణంగా నష్టమే తప్ప లాభం లేదని మరొకవర్గం చెబుతోంది. ఇందుకు తాజాగా జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా ఆ వర్గం నేతలు చూపుతు న్నారు.

ఏపీ రోడ్లకు నిధులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం రెండవ విడత నిధుల కింద రూ. 97.75 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఈ నిధులను 3 పని దినాల్లోగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధి విభాగానికి బదిలీ చేయాలని పేర్కొంది. 3 రోజుల్లోగా ఈ నిధులను ఏపీ స్టేట్ రూరల్ రోడ్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఖాతాకు జమ చేయకపోతే, పెనాల్టీ కింద రాష్ట్ర ప్రభుత్వం 12 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తదుపరి నిధుల విడు దలను నిలిపివేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉం టుందని స్పష్టం చేసింది. మరోవైపు ఏపీ స్టేట్ రూరల్ రోడ్స్ డెవలప్మెంట్ ఏజెన్సీ నుంచి ఎటు వంటి యూ సీలు పెండింగ్‌లో లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.



తప్పుడు సమాచారంపై జాగ్రత్త

• గీతంలో మీడియా పరిణామాలపై జాతీయ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యువత తప్పుడు ప్రచారం జాగ్రత్తగా ఉండాలని మీడియా నిపుణులు సూచించారు. సోషల్ మీడియాతోపాటు వివిధ ఛానళ్లలోనూ ఇటువంటి వస్తే వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. గీతం డీమ్డ్ యూనివర్సిటీలో మారుతున్న మీడియా పరిణామాలు అనే అంశంపై గురువారం హైదరాబాద్ క్యాంపస్‌లో జాతీయ సదస్సును నిర్వహించారు. సదస్సును పీఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్, ప్రెస్‌క్లబ్- హైదరాబాద్ సంయుక్తంగా సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్సీ, మీడియా నిపుణులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్, పాత్రికేయుడు, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత పరంజయ్ గుహ ఠాకుర్త ప్రసంగించారు. వీరితోపాటు యూనివర్సిటీ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్, పీఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్మన్ డాక్టర్ పి వేణుగోపాల్‌రెడ్డి సదస్సు నిర్వాహకులు డాక్టర్ డి సురేష్‌కుమార్, జీఎస్‌హెచ్ఎస్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై ప్రభావతి పాల్గొన్నారు. మీడియాలో వస్తున్న వార్తలను గుడ్డిగా నమ్మే స్థితిలో ప్రజలు లేరని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, మీడియా సంస్థల మధ్య ఏర్పడుతున్న సాన్నిహిత్యమే దీనికి కారణమన్నారు. మీడియా విశ్వసనీయతను కోల్పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న వారిని విమర్శించే పాత్రను మీడియా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించాలని కానీ మీడియా ప్రజలను విభజించి ఒకవైపు మొగ్గేలా ప్రేరేపిస్తోందన్నారు. ఏమైనా మీడియాపై విరక్తిని ఏర్పరచుకోవల్సిన అవసరం లేదని, ఇప్పటికీ కొంత ఆశ మిగిలి ఉందని ఆయన అన్నారు. పాత్రికేయుడు, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత పరంజయ్ గుహ ఠాకుర్త మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఇంటర్నెట్ మానవ సమాజాన్ని ఊహించని విధంగా మార్చేసిందని అన్నారు.

ఎయిర్‌పోర్టు భూ సేకరణకు రూ.1.72 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సేకరించిన 15 ఎకరాల 8 గుంటలకు రూ.కోటి 72 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. 2002లో ఈ భూమికి ఎకరాకు రూ.60వేల చొప్పున మార్కెట్ ధర నిర్ణయించారు. అయితే భూ యజమానులు ఈ ధరపై సవాల్ చేయడంతో మార్కెట్ ధర రూ.లక్షా 40వేలకు పెంచారు. అలాగే ఆ భూముల్లో ఉన్న చెట్లకు కూడా ధర నిర్ణయించారు. హైకోర్టు ఉత్తర్వులు మేరకు ఈ డబ్బును డిపాజిట్ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

• టీఎస్-ఐఐసీ స్పోర్ట్స్‌మీట్‌లో చైర్మన్ బాలమల్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టిఎస్-ఐఐసీ) చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. ఐఐసీ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో రెండు రోజులపాటు జరగనున్న ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్ 2019ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలమల్లు మాట్లాడుతూ, పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులు మానసిక ప్రశాంతత, సంతోషంగా గడిపేందుకు కల్చరల్ మీట్ నిర్వహిస్తున్నామని అన్నారు. క్రీడల ద్వారా వ్యాయామం, మానసిక ఉల్లాసంతో పాటు ఉద్యోగుల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. విధి నిర్వహణలో ఎంతటి నిబద్ధతతో ఉంటారో అదేవిధంగా గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆయన సూచించారు. స్పోర్ట్స్ కల్చరల్ మీట్‌లో గెలుపొందే ఉద్యోగులకు బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని నగర శివారులోని రిసార్ట్స్‌లో పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. తమ సంస్థ ఉద్యోగులందరూ వారి కుటుంబ సభ్యులతో ఆటపాటలతో సంతోసంగా గడిపేలా త్వరలో గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఐఐసీ ఎండీని కోరారు.

మరోసారి మోసానికి తెరలేపిన కాంగ్రెస్

• 52 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రకటనపై బీజేపీ




హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తోందని బీజేపీ మండిపడింది. పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, మాజీ ఎంఎల్ఎ, బీజేపీ జాతీయ ఓబీసీ కమిటీ సభ్యులు వన్నాల శ్రీరాములు మాట్లాడాతూ కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ చిలక పలుకులు తప్ప సాధ్యమయ్యేవి కావన్నారు. 70 ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ కూడా ఓబీసీల గురించి కాంగ్రెస్ మాట్లాడలేదని అన్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్‌లను ప్రధాని నరేంద్ర మోడీ కల్పించడంపై దేశంలోని అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ప్రజామోదాన్ని చూసి భయపడ్డ కాంగ్రెస్ పార్టీ బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పడం మరోసారి ప్రజలను మోసం చేయడమేనని అన్నారు.

రాజంపేటపై జగన్ స్పష్టత

• మేడాకు లైన్ క్లియర్ • ఆకేపాటికి సముచిత స్థానం

హై దరాబాద్,ఆంధ్రప్రభ: అంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొలది ప్రధాన రాజకీయ పార్టీల్లో కూడా వేడి పెరుగుతోంది. గురువారం వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీకి చెందిన కడప జిల్లా నేతలు ఆ పార్టీ అధినేత జనగ్‌తో సమావేశమయ్యారు. లోటస్ పాండ్‌లోని జగన్ నివాసంలో జరిగిన ఈ భేటిలో ప్రధానంగా కడప జిల్లాలోని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంపైనే చర్చ జరిగింది. రెండు రోజుల కిందట తెలుగుదేశం పార్టీకి చెందిన రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి తన సోదరులు రఘునాథరెడ్డితో కలిసి వైసీపీలో చేరికపై జగన్‌తో చర్చలు జరిపి వెళ్లారు. జగన్‌కూడా పార్టీలోకి మేడా సోదరుల చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు . ఈ నేపథ్యంలో రాజంపేటలో వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నా మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథరెడ్డి ఆ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో పాటు లోటస్‌పాండ్‌లో జగన్‌ను కలిశారు. మేడా పార్టీలో చేరితే తన పరిస్థితి ఏమిటన్న అంశంపై జగన్‌తో చర్చించారు . ఆ పార్టీ ముఖ్యనేతల సమాచారం మేరకు వచ్చే ఎన్నికల్లో మేడా మల్లికార్జున రెడ్డికి లైన్ క్లియర్ చేసిన జగన్ ఆదే అంశంపై పార్టీ జిల్లా నేతలకు కూడా స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. అమర్నాధరెడ్డికి కూడా పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఈ విషయంలో ఎటువంటి అపోహలు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని చెప్పినట్టు సమాచారం. రెండు సార్లు రాజంపేట ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అమ ర్నాథ్‌రెడ్డి 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మేడా మల్లికార్జునరెడ్డి చేతిలో ఓడి పోయారు. దీంతో అక్కడి రాజకీయ సమీకరణల దృష్ట్యా వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చే ఆలోచనలో ఉన్న పార్టీఅధిష్టానం అదే అంశాలను ఆ జిల్లా నేతలతో చర్చించింది. అమర్నాథ రెడ్డికి ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేతో సమాన ప్రాతినిధ్యం ఉండే పదవిని ఇచ్చేందుకు జగన్ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.



మా ఊరు - మా రాజ్యం

మూడో విడతలో 573 పంచాయతీలు ఏకగ్రీవం

• 2,130కి చేరిన ఏకగ్రీవ సర్పంచ్‌లు • 29,927 వార్డులకు ఏకగ్రీవాలే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవాల్లో సరికొత్త రికార్డును సృష్టించాయి. ఈ నెల 30న చివరివిడతగా ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీల్లో కూడా సింగిల్ నామినేషన్‌తో 573 పంచాయతీలకు సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 12732 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం మూడు విడతలగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. అందులో ఇప్పటికే తొలి విడత పంచాయతీలకు ఈ నెల 21న ఎన్నికలు ముగిశాయి. రెండో విడత పంచాయతీలకు శుక్రవారంనాడు పోలింగ్ జరగనుంది. మూడో విడత పంచాయతీలకు ఈనెల 30 పోలింగ్ జరగనుంది. అయితే మూడో విడత కింద మొత్తం 4116 గ్రామ పంచాయతీల్లో నామినేష్ల ఉపసంహరణ ఘట్టం ముగియటంతో ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య ఎంత అన్నది స్పష్టమైంది. చివరి విడత పంచాయతీల్లో పది పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. మరో 573 పంచాయతీలకు మాత్రమే నామినేషన్ల విత్ డ్రా అనంతరం సింగిల్ నామినేషన్ మిగలడంతో ఈ పంచాయతీల్లో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో తొలి విడతలో 769 పంచాయతీలకు సర్పంచ్ పదవులు ఏకగ్రీవం కాగా, రెండవ విడతలో 788పంచాయతీలకు సింగిల్ నామి నేషన్లు దాఖలయ్యాయి. దీంతో మొత్తం మూడు విడు తల్లో సర్పంచ్ పదవులకు ఏకగ్రీవాల సంఖ్య 2130కి చేరింది. ఇంత పెద్ద మొత్తంలో పంచాయతీ సర్పంచ్ పదవులు ఏకగ్రీవం కావటం పెద్ద రికార్డ్ అని పంచాయతీరాజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

29927 వార్డులు ఏకగ్రీవం

రాష్ట్రంలో మొత్తం మూడు విడతలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో వార్డు స్థానాలకు కూడా ఏకగ్రీవాల సంఖ్య రికార్డు సృష్టించింది. చివరి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో 8956 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 36729 వార్డులకు ఎన్నికలు ప్రకటించగా అందులో 185 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 8,958 వార్డు స్థానాలకు సింగిల్ నామినేషన్ దాఖలైంది. ఇక మిగిలిన 27,583 వార్డు స్థానాలకు మాత్రమే పోటీ జరగనుంది. మొత్తం 67,316 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. తొలివిడత వార్డు స్థానాలకు 10,654 వార్డు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండవ విడత పంచాయతీల్లో కూడా 10,317 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మూడు విడతల ఎన్నికల్లో ఏకగ్రీవమైన వార్డుల సంఖ్య 29,927కు పెరిగింది.

నేడు రెండో విడత పంచాయతీ పోలింగ్

673 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెండవ విడుతలోని గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 172 మండలాల పరిధిలో ఉన్న 3342 గ్రామ పంచాయతీలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. ఈ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకోసం మొత్తం 10668మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పోలింగ్‌కు 44గంటల ముందునుంచే ఎన్నికల ప్రచారాలు ముగించిన అభ్యర్థులు గురువారం పోలింగ్ వ్యూహాల అమలులో నిమగ్నమయ్యారు. గెలుపే లక్ష్యంగా పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. రెండో విడుతలో మొత్తం 4135 గ్రామపంచాయతీలకు ఎన్నికలు ప్రకటించగా అందులో ఐదు గ్రామ పంచాయతీలకు నామినేష్లు దాఖలు కాలేదు. మిగిలిన వాటిలో 788 గ్రామ పంచాయతీలకు సింగిల్ నామినేషన్లు దాఖలు కావటంతో ఈ గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. శుక్రవారం 3342 గ్రామపంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. 10668 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని ఓటర్ల ముందు పరీక్షకు పెట్టారు. రెండవ విడుతలో మొత్తం 36602 వార్డులకు ఎన్నికలు ప్రకటించగా అందులో 94వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన వాటిలో 10317 వార్డులకు సింగిల్ నామినేషన్ దాఖలు కావటంతో ఇవి ఏకగ్రీవ జాబితాలోకి చేరిపోయాయి. ఇక 26191 వార్డు స్థానాలకు మాత్రమే పోలింగ్ జరగనుంది. వార్డు స్థానాల బరిలో మొత్తం 63480 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

ఉదయం ఏడు నుంచే పోలింగ్

రెండవ విడుత ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం ఉదయం ఏడు గంటలనుంచి పోలింగ్ ప్రారం భమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనుంది. రెండుగంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఎన్నికల ఫలితాలను ప్రకటిం చనున్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా అదేరోజు జరగనుంది.

29964 పోలింగ్ కేంద్రాలు సిద్ధం

రెండవ విడుత పంచాయతీల్లో పోలింగ్ నిర్వహణకోసం మొత్తం 29964 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం పోలింగ్ సామాగ్రితో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు చేరుకున్నారు. రెండవ విడుతలో పోలింగ్ జరగనున్న వాటిలో 673 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపింది.

రూ.1.78కోట్లు స్వాధీనం:డీజీపీ నివేదిక

రాష్ట్రంలో మూడు విడుతలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకూ రూ.1.78కోట్ల రూపాయల నగదు పట్టుబడింది. రూ.36లక్షల రూపాయల విలువ మేరకు మద్యం , ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర డీజీపి మహేందర్ రెడ్డి ఎన్నికల సంఘానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు..

బుధవారం ఒక్కరోజే వనపర్తి జిల్లాలో 3.85లక్షల విలువచేసే మద్యం పట్టుబడింది. ఇప్పటివరకూ 289 ఫిర్యాదులు రాగా వాటిలో 288 కేసులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు .

స్టూడెంట్ సర్పంచ్‌లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో విద్యార్థులు సర్పంచ్‌లుగా ఎన్ని కయ్యారు. తాము ఉన్నత చదువును కొనసాగించాలని భావించినప్పటికీ అనుకోకుండా వచ్చిన అవకాశంతో స్టూడెంట్లు కొందరు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేశారు. పోటీ చేసిన పంచాయతీ ఎన్నికల్లో కొందరు గెలుపొంది సర్పంచ్‌గా ఎన్ని కయ్యారు. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మద నాపురం పంచాయతీ సర్పంచ్‌గా ఉడుతల అఖిల యాదవ్ ఎన్ని కయ్యారు. అఖిల యాదవ్ తండ్రి టీఆర్ఎస్ మండల పార్టీలో క్రియా శీలకంగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా దామరచర్ల మండలం తాళ్ల వీరప్పగూడెం గ్రామానికి చెందిన రాయికింది శిరీష మిర్యా లగూడలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి సైదులకు ముగ్గురు సంతానం కావడంతో ఎన్నికల్లో తాను పంచాయతీ ఎన్ని కల్లో పోటీ చేసే అవకాశం లేకపో వడంతో శిరీషను పంచాయతీ ఎన్ని కల్లో పోటికి నిలిపారు. ఎన్నికల్లో శిరీష గెలుపొందింది. దామరచర్ల మండ లంలోని బొత్తలపాలెం గ్రామా నికి చెందిన ఆకారపు మనీష ఇటీ వలనే డిగ్రీ పూర్తి చేసింది. ఉన్నత చదువులకు సిద్ధం అవుతోంది. ఆమె తండ్రి గోపాల్‌కు కూడా ముగ్గురు సంతానం కావడంతో కూతురిని పంచాయతీ బరిలో నిలిపారు. ఎన్నికల్లో విజయం సాధించింది.

ఇక కంది మండలం కవలం పేట గ్రామ సర్పంచ్‌గా 21 సంవత్సరాల మహ్మద్ షఫీ గెలుపొందాడు. షఫీ ఎంఏ పొలిటికల్ సైన్స్ చదు వుతున్నాడు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు.

అమెరికాలో కాల్పుల కలకలం

దుండగుడి కాల్పుల్లో ఐదుగురు దుర్మరణం

మియామి (అమెరికా): అమె రికాలో మళ్లీ కాల్పుల మోతతో ఉలిక్కిపడింది. ఫ్లోరిడాలోని సెబ్రిం గ్ నగరంలో ఓ దుండగుడి జరిపిన కాల్పుల్లో ఐదుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. సెబ్రింగ్ నగరానికి చెందిన 21 ఏళ్ల యువ క ుడు కాల్పులకు తెగబడినట్టు పోలీ సులు గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జీపెన్ జాపర్‌గా గుర్తించామని అన్నారు.

అన్ని వర్గాలు.. ఆందోళన బాట

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు తొమ్మిది రోజులపాటు ఆందోళనలు జరగనున్నాయి. రైతులు, మహిళలు, యువత, మాజీ సైనికులు, దళిత, ఆదివాసి తెగలతోపాటు ప్రజానికం ఎదుర్కొంటున్న సమస్యలకు నిరసనగా ఈ ఆందోళనలను చేపట్టనున్నారు. సామాజిక సేవా సంస్థలతోపాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు ఈ ఆందోళనలలో పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేయనున్నారు. యూనైట్ ఇండియా పేరుతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈ ఆందోళనలను నిర్వహించనున్నారు. గ్రామీణులు ఎదుర్కొంటున్న సమస్యలు, క్షీణిస్తున్న వాతావరణ పరిస్థితులు, జర్నలిజం విలువలు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా దేశంలోని పరిస్థితులు దారుణంగా దిగజారాయని ఆల్ ఇండియా కిసాన్ సభ జనరల్ సెక్రటరీ హన్నన్ మొల్లహ్ అన్నారు. తొమ్మిది రోజుపాలు ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజున బీజేపీ మినహా అన్నీ పార్టీల నాయకులను ఆహ్వానిస్తామని ఆయన వెల్లడించారు.

సీబీఐ తాత్కాలిక చీఫ్ కేసు.. విచారణ నుంచి తప్పుకున్న సిక్రీ

న్యూఢిల్లీ: సీబీఐ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ నుంచి జస్టిస్ సిక్రీ తప్పుకున్నారు. గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్‌పై విచారణ ప్రారంభం కాగానే ధర్మాసనం నుంచి తను తప్పుకుంటున్నట్టు జస్టిస్ ఏకే సిక్రీ వెల్లడించారు. సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మను తొలగించిన కమిటీలో తను సభ్యుడిగా ఉన్నందున ధర్మాసనంనుంచి తప్పుకుంటున్నట్టు జస్టిస్ సిక్రీ తెలిపారు. ఈ అంశంపై జస్టిస్ సిక్రీ మాట్లాడుతూ ధర్మాసనం నుంచి స్వయంగా తప్పుకుంటున్నాను అన్నారు. కేసు విచారణను శుక్రవారం మరో ధర్మాసనం చేపడుతుందని పిటిషన్ దాఖలు చేసిన ఎన్జీవో కామన్‌క్లాజ్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవేతో జస్టిస్ సిక్రీకి తెలిపారు. కాగా ఇప్పటికే ఈ కేసు నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విచారణ నుంచి తప్పుకోగా జస్టిస్ సిక్రీ కూడా ఆయన బాటలోనే తప్పుకున్నారు. సీబీఐ నూతన డైరెక్టర్‌ను ఎంపిక చేసే ఉన్నతస్థాయి కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ గొగొయ్ సభ్యునిగా ఉన్నందున ఆయన విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు.

రిపబ్లిక్ డే ఉత్సవాల్లో దాడులకు కుట్ర

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భారీగా దాడులు చేసేందుకు జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ పన్నిన కుట్రను గురువారం ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. ఈ విషయంపై ఢిల్లీ పోలీసులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ జైషే మహ్మద్ ఉగ్రసంస్థకు చెందిన ఉగ్రవాది ఒకరు ఢిల్లీలో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం అందిందని తెలిపారు. సమాచారం ఆధారంగా స్పెషల్ పోలీస్ టీమ్ దర్యాప్తు చేపట్టారని తెలిపారు. ఈ దర్యాప్తులో ఇటీవల జమ్ము కాశ్మీర్లోని శ్రీనగర్ పరిసర ప్రాంతాల్లో జరిగిన గ్రనేడ్ దాడుల సూత్రధారి అబ్దుల్ లతీఫ్ గణాయ్ ఢిల్లీలో దాడికి కుట్రపన్నాడని నిర్ధారణ అయిందన్నారు. శ్రీనగర్‌లో చేసిన దాడుల తరహాలోనే ఢిల్లీలో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో దాడి చేసేందుకు లతీఫ్ వ్యూహరచన చేశాడని తెలిపారు. ఆదివారం రాత్రి లతీఫ్ గణాయ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నేరపూరిత సాహిత్యంతోపాటు నిషేధిత సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. లతీఫ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా కశ్మీర్లోని బందిపొరలో మరో ఉగ్రవాది హిలాల్‌ను అరెస్టు చేసి రెండు గ్రనేడ్లను స్వాధీనం చేసుకున్నామని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ఐదూళ్లు... ఓటుకు దూరం



• మునిసిపాలిటీల్లో విలీనమే కారణం • విలీనంపై కోర్టు స్టే • మొదటి విడతలో ఒకటి.. మూడో విడతలో నాలుగు గ్రామాలు

మెదక్, ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల జోరు కొనసాగుతుండగా మెదక్ జిల్లాలోని ఐదు ఊర్లు మాత్రం ఎన్నికల హడావుడి లేకుండా పల్లె పోరుకు దూరంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయడమే కాకుండా మేజర్ గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీగా మార్చింది. జిల్లాల పునర్విభజన తర్వాత డివిజన్ కేంద్రాలు ఏర్పాటు చేయగా మెదక్ జిల్లాలో కొత్తగా నర్సాపూర్, తూప్రాన్ డివిజన్‌లు ఏర్పడ్డాయి. మునిసిపాలిటీ ఏర్పాటు చేయడంతో జిల్లాలో ఒకేఒక్క మునిసిపాలిటీగా ఉన్న మెదక్‌తో పాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేటను మునిసిపాలిటీలుగా మార్చింది. దీంతో ఆయా మునిసిపాలిటీల పరిధి పెంచేందుకు చుట్టుపక్కల గ్రామాలను విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే తూప్రాన్ మునిసిపాలిటీలోకి బ్రాహ్మణపల్లి, రావెల్లి, అల్లాపూర్ గ్రామాలు, మెదక్ మునిసిపాలిటీలోకి ఔరంగాబాద్, అవుసులపల్లి గ్రామాలు కూడా విలీనం అయ్యాయి నర్సాపూర్, రామాయంపేట మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాకున్నప్పటికీ తూప్రాన్‌లో విలీనమైన మూడు గ్రామాలు, మెదక్‌లో విలీనమైన రెండు గ్రామాల ప్రజలు విలీనాన్ని రద్దు చేయాలంటూ కోర్టులో కేసు వేయడంతో కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. రామాయంపేట, నర్సాపూర్ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలను కలుపుకొని వార్డులుగా విభజించారు. కోర్టు స్టే కారణంగా మెదక్, తూప్రాన్ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలకు అధికారులు వార్డులుగా విభజించలేక పోయారు. ఈ సందర్భంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రావడంతో రెండు మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం లేదు.

ఆశావహులకు తీరని నిరాశ..

మెదక్ జిల్లాలోని 20 మండలాలకు గాను 469 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా కోర్టు స్టే కారణంగా ఐదూళ్ళలో మాత్రం ఎన్నికలు జరగడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 464 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. కోర్టు స్టే కారణంగా ఈ ఐదు గ్రామాల్లో ఎన్నికలు నిర్వ హించాలని ఎన్నికల అధికారులు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో సర్పం చ్, వార్డు సభ్యుల పదవుల కోసం ఆశపడిన ఆశావహులకు తీరని నిరాశే మిగిలింది.

గణతంత్ర వేడుకలకు సర్పంచ్‌లను ఆహ్వానించొద్దు:ఈసీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జరిగే గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండా ఎగు రవేసే యోగం ఈ సారికి గ్రామ సర్పంచ్‌లకు లేకుండా పోయింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇంకా ముగి యకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచ్ ,ఉపసర్పంచ్‌లను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తొలివిడుత , రెండవ విడుత ఎన్నికలు పూర్తయినప్పటికీ సర్పంచ్ , ఉప సర్పంచ్‌గా గెలుపొందిన వారు జాతీయ జెండా ఎగరేసేఅవకాశాన్ని కోల్పోవాల్సి వస్తోంది. ఈ నెల 21న తొలివిడుత పంచాయతీల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. సర్పంగా , ఉప సర్పంచ్‌గా గెలుపొందిన వారు ఎన్నికల సంఘం నుంచి ధృవీకరణ పత్రాలు కూడా పొందారు. రెండవ విడుత పంచాయతీల్లో శుక్రవారం నాడు పోలింగ్ జరగనుంది. ఈ పంచాయతీల్లో కూడా శుక్రవారం సాయంత్రం నాటికే ఎన్నికల ఫలితాలు కూడా వెల్లడి కానున్నాయి. విజేతలకు ధృవపత్రాలు కూడా అందనున్నాయి. శనివారం గణతంత్రదినోత్సవ వేడుకలు జరగనున్నప్పటికీ వీరికి ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం లేకుండా పొయింది. ఈ నెల 30న మూడవ విడుత గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ పంచాయతీల్లో ఎన్నికలు పూర్తయ్యాకే రాష్ట్రంలో కొత్త సర్పంచ్‌లు ఉప సర్పంచ్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఆ తర్వాతనే ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరు పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొంది. 26న జరగే గణతంత్ర దినోత్సవంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు మాత్రమే జాతీయ జెండా ఎగురవేయాని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికలసఘం అన్ని జిల్లాల అధికారులకు సూచించింది.

ఇస్రో ప్రయోగం సూపర్ సక్సెస్

• పీఎస్ఎల్వీ సి-44 విజయవంతం • కొత్త ఏడాదిలో తొలి బోణీ • దిగ్విజయంగా కక్ష్యల్లోకి రెండు ఉపగ్రహాలు

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో : అర్ధరాత్రి కారుచీకట్లో.. నల్లని మేఘాల మధ్య నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ సీ-44) రాకెట్ అంతరిక్షంలో భారతదేశ వెలుగును మరోసారి ప్రపంచ దేశాలకు చాటిచెబుతూ ఇస్రోకు కొత్త సంవత్సరంలో తొలి విజయాన్ని అందించింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) కేంద్ర నుంచి గురువారం అర్ధరాత్రి 11.37 గంటలకు చేపట్టిన పీఎస్ఎల్వీ సీ-44 ప్రయోగం సూపర్ సక్సెస్ అయింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయిన భారత నౌక 13.57 నిమిషాల పాటు అంతరిక్షంలో తనయాత్రను సాగించి తనలో అనుసంధానమైన 700 కేజీల బరువు కలిగిన మైక్రోశాట్, 1.2 కేజీల బరువు కలిగిన మరో సూక్ష్మ ఉపగ్రహాన్ని క్షేమంగా గమ్యం చేర్చింది. దీంతో ఇస్రో ఖాతాలో మరో ఘనవిజయం నమోదైనట్లయింది. పీఎస్ఎల్వీ ప్రయోగ రంగంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఇస్రో కొత్త సంవత్సరం ఆరంభంలో చేపట్టిన తొలి ప్రయోగం విజయవంతం కావడంతో భారత శాస్త్రవేత్తల్లో ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. రక్షణా రంగానికి సంబంధించి చేపట్టిన కీలకమైన ప్రయోగం సక్సెస్ కావడంతో ఆ రంగానికి సంబంధించి సమాచార వ్యవస్థమరింత బలోపేతం కానుంది. గతంలో ఇదే తరహా ప్రయోగాలను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది. ఆ రంగానికి మరింత ఊతాన్నిచ్చేందుకు తాజాగా గురువారం చేపట్టిన మైక్రోశాట్ ఉపగ్రహం కూడా క్షేమంగా గమ్యం చేరడంతో భారతదేశ రక్షణా రంగానికి సంబంధించి సమాచార వ్యవస్థమరింత పటిష్టం కానుంది. పై ప్రయోగానికి సంబంధించి బుధవారం రాత్రి 7.37 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. నిరాటంకంగా 28 గంటల పాటు సాగిన కౌంట్‌డౌన్‌లో మూడు దశలకు సంబంధించి ఘన, ద్రవ ఇంధనాలను పూర్తి స్థాయిలో నింపడంతో పాటు అందుకు సంబంధించిన మోటార్లను ఇస్రో శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మూడు దశల్లో నిర్ణీత కక్ష్యలోకి చేరుకున్న రాకెట్ తనలో అనుసంధానమైన 1.2 కేజీల బరువు కలిగిన సూక్ష్మ ఉపగ్రహాన్ని మొదటి నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. రక్షణా రంగానికి సంబంధించిన మైక్రోశాట్ ఉపగ్రహాన్ని మరికొన్ని సెకన్లవ్యవధిలోనే క్షేమంగా గమ్యం చేర్చింది. అయితే కీలకమైన నాల్గవదశలో సుమారు 14 గంటల అనంతరం మైక్రోశాట్ కక్ష్యను పెంచి ఆ ఉపగ్రహ సేవలను ఇస్రో పొందనుంది.

ప్రయోగం సాగిందిలా..

షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి గురువారం అర్ధరాత్రి 11.37 గంటలకు నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయిన పీఎస్ఎల్వీ సీ-44 రాకెట్ 13.57 నిమిషాల్లో మూడు దశలను అధిగమించి భూమికి 274 కిలోమీటర్ల ఎత్తులో దశలవారీగా రెండు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. మరో 14 గంటల తరువాత నాల్గవ దశలోని కీలకమైన రెండు ఇంజన్లను ఆన్/ఆఫ్ చేసి భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో భారత శాస్త్రవేత్తలు బెంగుళూరులోని ప్రధాన కేంద్రం నుంచి రిమోట్ చేస్తూ ఉపగ్రహాన్ని పూర్తి స్థాయి కక్ష్యలోకి ప్రవేశపెడతారు. షార్ నుంచి తన యాత్రను ప్రారంభించిన రాకెట్ సరిగ్గా 3.4 నిమిషాల్లో ద్రవ ఇంధన సహాయంతో మొదటి దశను, 4.6 నిమిషాల వ్యవధిలో ఘన ఇంధన సహాయంతో రెండవ దశను, 5.57 నిమిషాల్లో కీలకమైన మూడవ దశను రాకెట్ అధిగమించింది. మూడు దశలను నిర్ణీత సమయంలోనే పూర్తి చేయడంతో పీఎస్ఎల్వీ ప్రయోగ యాత్ర సంపూర్ణంగా విజయవంతమైనట్లయింది.

ఉపగ్రహాల వల్ల ప్రయోగాలు

అంతరిక్ష ప్రయోగ రంగంలో ఎప్పటికప్పుడు ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ రికార్డులు సృష్టిస్తున్న ఇస్రో సరికొత్త ప్రయోగాల వైపు దృష్టిసారిస్తోంది. అందులో భాగంగానే వాతావరణం, సముద్ర వాతావరణ పరిస్థితి, వ్యవసాయం, అడవుల విస్తీర్ణం, అక్కడి వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు గతంలోనే అనేక ప్రయోగాలను విజయవంతంగా చేపట్టిన ఇస్రో రక్షణా రంగానికి సంబంధించి పటిష్టమైన సమాచార వ్యవస్థను అందించేందుకు గత ఏడాది ఆ తరహా ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే గురువారం పీఎస్ఎల్వీ సీ-44 ద్వారా రక్షణా రంగానికి సంబంధించి 700 కేజీల బరువు కలిగిన మైక్రోశాట్ ఉపగ్రహాన్ని విజయవంతంగా గమ్యం చేర్చింది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశ రక్షణకు సంబంధించి సరిహద్దులో ఉగ్రవాదుల దాడులకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని కూడా అందించనుంది. అదేవిధంగా తమిళనాడులోని పాఠశాల విద్యార్థులు రూపొందించిన 1.2 కేజీల బరువు కలిగిన కలామ్ శాట్ ఉపగ్రహం వాతావరణానికి సంబంధించి పరిశోధన, పాఠశాల విద్యార్థులకు సంబంధించి సరికొత్త సమాచారాన్ని అందించనుంది. కీలకమైన పై రెండు ఉపగ్రహాలు క్షేమంగా గమ్యం చేరడంతో భారత శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ప్రయోగం విజయవంతం అనంతరం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె శివన్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ప్రయోగం విజయవంతానికి కృషిచేసిన వివిధ విభాగాధిపతులను ఆయన పేరుపేరున అభినందించారు.

మార్గదర్శులం మనమే

ఆదర్శంగా తీసుకుంటున్న కేంద్రం, ఇతర రాష్ట్రాలు

- వినూత్న పథకాలతో తెలంగాణ అడుగులు
- అటు అభివృద్ధి...ఇటు జనాదరణ
- అనేక పథకాలు అమలు చేసే యోచన
- ప్రజాప్రయోజనాలకే పెద్దపీట.. ప్రభుత్వాల వైఖరిలో స్పష్టమైన మార్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వినూత్న పథకాలను ప్రకటించి, సమర్ధంగా అమలు చేసి చక్కటి ఫలితాలు రాబట్టిన తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం అటు కేంద్రానికి, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శిగా నిలుస్తోంది. రైతు సంక్షేమం, ప్రజలకు మేలు జరిగేలా చేపట్టిన వినూత్న పథకాలు ప్రజలను మెప్పించాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని అందించడంలో ఈ పథకాలే కీలకమయ్యాయి. గులాబీ దళపతి కేసీఆర్‌కు కీర్తిప్రతిష్టలతోపాటు మరోసారి అధికారాన్ని కట్టబెట్టడంతో ఆయన చిత్తశుద్ధితో అమలు చేస్తున్న అనేక పథకాలు ఇప్పుడు చాలా ప్రభుత్వాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వమే కేసీఆర్ పథకాలను అమలు చేసేందుకు అడుగులు వేస్తోంది. అందరికీ ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. తెలంగాణ చూపిన బాటలో అనేక రాష్ట్రాలే కాదు కేంద్రమూ వెళుతోంది. అన్ని రాష్ట్రాలూ, కేంద్రానికీ తెలంగాణ పథకాలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పార్టీలు, ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. అందుకు అనుగుణంగా వాటి ఆలోచనా విధానంలో మార్పు సంతరించుకుంటోంది. రైతుసంక్షేమం, సాగు, తాగునీటి సౌకర్యం కల్పించకుండా ఏపార్టీలు, ప్రభుత్వాలు మనుగడ సాగించలేని పరిస్థితి దేశవ్యాప్తంగా నెలకొంది. వ్యవసాయం, రైతు సంక్షేమం, నీటిపారుదల రంగాలలో తెలంగాణ చేపట్టిన సాహసోపేత పథకాలు అద్భుత ఫలితాలను ఇవ్వడంతో ఇప్పుడు ఆయా రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వంపై ప్రభావం చూపుతోంది. ఏ రాష్ట్రంలో చూసినా, కేంద్రంలోని అధికార పార్టీ తీరును గమనించినా వారివారి ఎన్నికల ప్రణాళికలలో తెలంగాణ తరహా పథకాలే ప్రధానంగా కనిపిస్తున్నాయి.

మిషన్ భగీరథ స్ఫూర్తితో కేంద్రం అడుగులు

ఇంటింటికీ నల్లాల ద్వారా సురక్షిత తాగునీటిని అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం ఇప్పుడు అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా కనిపిస్తోంది. ఇప్పటికే చాలా రాష్ట్రాలు ఈ పథకాన్ని అధ్యయనం చేశాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే తరహాలో అంతరికీ సురక్షిత త్రాగునీరు ఇస్తామంటూ అంటూ కీలక ప్రకటన చేసింది. ఈ పథకానికి స్ఫూర్తి మన మిషన్ భగీరథేనని కేంద్రమే అంటోంది. ఈ పథకానికి తాజాగా కేంద్రం రూ. 77,500కోట్లను కేటాయించింది. గత చరిత్రను పరిశీలిస్తే ఏనాడు కేంద్ర పాలకులు తాగునీటి పథకాలకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన దాఖలాలు లేవు.



డబుల్ బెడ్‌రూమ్ పథకం ఆదర్శంగా...

అదే తీరులో పేదలకు సామాజిక హోదా పెంచే మహత్తర లక్ష్యంతో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం దేశానికి దిక్సూచిగా మారింది. 2022 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 51 లక్షల ఇండ్లను నిర్మించాలని తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం లక్ష్యసాధనగా నిర్దేశించుకున్నది. పట్టణ పేదలకు 37లక్షల ఇండ్లు కట్టివ్వాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టింది. ఇక విద్య, వైద్య రంగాలు కూడా తెలంగాణ ప్రభుత్వ చొరవతో జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతున్నాయి. అనేక సంస్కరణలు, పథకాలు ఈ విప్లవాత్మక చర్చకు కేంద్రంగా నిల్చాయి.




విద్య, వైద్యరంగంలోనూ దిక్సూచిగా....

పేదలకు ఉచిత వైద్యంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పేరుగాంచగా, ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం, సహజ ప్రసవాలు, కేసీఆర్ కిట్స్‌తో 16 రకాల వస్తువులు, జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అపరిమిత ఉచిత కార్పొరేట్ వైద్య సేవల వంటివి ఈ రంగంలో దేశానికే తలమానికంగా నిలిచాయి. దీనిని గమనించిన కేంద్రం 1.5 లక్షల హెల్త్ సెంటర్ల ఏర్పాటు దిశగా బడ్జెట్ లో పేర్కొంది. ఇందుకు రూ. 1200కోట్లు కేటాయింపులు చేసింది. రైతుబీమా తరహాలో దేశంలోని 10 కోట్ల మందికి ఒక్కో కుటుంబానికి రూ. 5లక్షల ఆరోగ్య బీమా కల్పనకు హామీనిచ్చింది. రాష్ట్రప్రభుత్వం రైతాంగానికి అండగా నిల్చేందుకు అమలు చేస్తున్న ఎకరాకు రూ. 10వేల ఆర్ధిక సాయం దిశలో అనేక రాష్ట్రాలూ పోటీపడుతున్నాయి.







రికార్డులు... ప్రశంసలు

దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగుతోందన్న వాదనకు జాతీయ స్థాయిలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలో కూడా చర్చ జరుగుతోంది. తాజాగా సింగపూర్ ప్రధాని కేసీఆర్‌కు ఫోన్ చేసి పథకాలు అమలుపై ప్రశంసల జల్లు కురిపించారు. ప్రజా సంక్షేమ పథకాలు, వినూత్న ఆలోచనలు దేశం యావత్తూ అన్ని రాష్ట్రాలకూ దిక్సూచిగా మారినట్లుగా ఎన్నికల హామీలే స్పష్టం చేస్తున్నాయి. మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్లు, కళ్యాణలక్ష్మి, భూ రికార్డుల ప్రక్షాళన, సమగ్ర కుటుంబ సర్వే, గొర్రెల పంపిణీ, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ పంపిణీ, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పించన్లు, రైతు బంధు వంటి అనేకానేక పథకాలు రాజకీయ విమర్శకులను సైతం మెప్పించాయి. ఇవే పథకాలకు పేర్లు మార్చి కొన్ని రాష్ట్రాల్లో కొనసాగించిన సందర్భాలు ఎదురయ్యాయి. విశ్వసనీయ సమాచారం కోసమని ఒకే రోజున 4లక్షల మందికి పైగా ఉద్యోగులను రాష్ట్రంలోని ఇంటింటికీ పంపి 94 సూచీల ఆధారంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే చారిత్రాత్మకం. ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ జరగలేదని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు చేశారు.

బాలికల్లో పోషకాహార లోపం

లైంగిక దాడులు ఆగడం లేదు: ఎంపీ కవిత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాలికలకు పోషకాహార లోపంతోపాటు విద్య సక్రమంగా అందడం లేదని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై లైగింకదాడులు కొనసాగుతుండటం వారిని బాధిస్తున్నాయని అన్నారు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా ఎంపీ ట్వీట్టర్ ద్వారా స్పందించారు. దుష్టశక్తుల అంతానికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని అప్పుడు మాత్రమే దేశం నిజమైన ప్రగతివైపు పయనిస్తుందని ట్వీట్ చేశారు.

హక్కులు కాపాడుతాం...

- హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అన్ని రకాల అసమానతలను నిర్మూలించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని హోం మంత్రి మహమూద్ ఆలీ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గురువారం ఇందిలా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహమూద్ అలీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ, బాలికల గురించి ప్రజల్లో పూర్తి చైతన్యం తీసుకువచ్చి వారికి అన్ని రంగాల్లో అవకాశాలు, హక్కులు కల్పించడం జాతీయ బాలికా దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆడపిల్లల పట్ల చిన్నచూపు లేకుండా బాలురతో సమానంగా ప్రోత్సహించేలా తలిదండ్రులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని హితవు పలికారు. బాల్య వివాహాలు చేయడం ఒక సాంఘిక దురాచారమని, దాన్ని రూపుమాపేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. గతంలో బాల్య వివాహాల నిష్పత్తితో పోలిస్తే వాటి శాతం చాలా వరకు తగ్గిందన్నారు.

ప్రభుత్వం మహిళల సంరక్షణకు పెద్ద పీట వేసిందని, అందులో భాగంగానే షీ టీమ్స్‌ని ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పిస్తోందన్నారు. బాలికలకు పూర్తి సామర్థ్యం భద్రత, అనుకూలమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సమాజంలో బాలికల స్థితిగతులు మెరుగు పరచి వారికి ఉన్నతమైన జీవన ప్రమాణాలను కల్పించే దిశగా తలిదండ్రులతో పాటు ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబానికే తలమానికంగా నిలిచి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే శక్తిగా మారుతుందన్నారు.

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ, బాలికలకు విద్యా, పోషకాహారం, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, భద్రత వంటి విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. బాలికల ఎదుగుదలకు కావాల్సిన అన్ని అంశాలను వారికి సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు హోంమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు.

ఆ నలుగురు కలిస్తే

మోడీకి కష్టమే!









(మొదటిపేజీ తరువాయి)

మూడ్ ఆఫ్ ద నేషన్ పేరుతో నిర్వహించిన పోల్ సర్వేలో యూపీఏ అధికారంలోకి వచ్చేందుకు అనుకూల సమీకరణలున్నాయని పేర్కొంది. యూపీఏ కూటమితో మాయావతి, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్ చేతులు కలిపితే మోడీ పదవికి ముప్పు తప్పదని తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎస్పీ, బీఎస్పీ, తృణమూల్, యూపీఏ కూటమికి 269 సీట్లు వస్తాయని, అదే సమయంలో ఎన్డీయేకి 237 సీట్లు, ఇతరులకు 140 సీట్లు వస్తాయి. ఓట్లశాతంగా చూస్తే యూపీఏ ప్లస్ టీఎంసీ,ఎస్పీ, బీఎస్పీకి 44శాతం, ఎన్డీయేకి 35శాతం, ఇతరులకు 21 శాతం వచ్చే చాన్స్ ఉంది. యూపీఏ, ఎన్డీయే కూటముల్లో లేని పార్టీలకు గతంలో కంటే 13 సీట్లు తగ్గనున్నాయి. దేశంలో ఇప్పుడున్న సంకీర్ణాలు, పొత్తుల ఆధారంగా సర్వే గణాంకాలు క్రోడీకరించారు. మళ్లీ ఎన్డీయే అధికారంలోకి వస్తుందని 60 శాతం మంది అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

ఎన్డీయేకి 60 శాతం చాన్స్ ?

హంగ్ పార్లమెంటులో ఎన్డీయే అధికారంలోకి వచ్చేందుకు 60 శాతం అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకు గాను యూపీఏ కూటమిలోని పార్టీలను తమవైపు తిప్పుకోవాలి. ఇలాంటి రాజీ తెరపైకి వస్తే, ప్రధానిగా మోడీకి బదులు వేరొకరిని ఎన్నుకోవాలని మిత్రపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

పీడీపీ, టీఎంసీ, బీఎస్పీ, ఎస్పీ మద్దతిస్తే యూపీఏ కింగ్

హంగ్ వస్తే ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు యూపీఏ ముందు రెండు మార్గాలుంటాయి. ఒకటి ... యూపీఏ కూటమికి పీడీపీ, తృణమూల్, ఎస్పీ, బీఎస్పీ మద్దతు తెలపాల్సి ఉంటుంది. 543 సీట్లకు ఎన్నికలు జరిగితే, ప్రభుత్వ ఏర్పాటుకు 272 సీట్లు అవసరం. ఈ నాలుగు పార్టీలు యూపీఏకి మద్దతిస్తే ఓటు శాతం 44కి చేరుతుంది. సంఖ్యాబలం 272కి చేరుతుంది. మేజిక్ ఫిగర్‌ను చేరుకోవడం సులువవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్డీయేకి 234 (వైకాపా, అన్నాడీఎంకే మద్దతుతో), ఇతరులకు 37 సీట్లు ఉంటాయి. రెండు కూటములకు దూరంగా ఉన్న పార్టీలు ఆఖర్లో ఎన్డీయేవైపు మొగ్గినా సంఖ్యాబలం 271 అవుతుంది.

టీఆర్ఎస్, వైకాపా, అన్నాడీఎంకే, ఎన్డీయేకి మద్దతిస్తే..

మరో విశ్లేషణ ప్రకారం..యూపీఏలో ఎస్పీ, బీఎస్పీ, పీడీపీ, తృణమూల్ పార్టీలు భాగస్వాములుగా ఉండి, తటస్థులుగా ఉన్న టీఆర్ఎస్, బిజూ జనతాదళ్ , అన్నాడీఎంకే, వైకాపా ఎన్నికల తర్వాత బీజేపీకి మద్దతు తెలిపినా యూపీఏకే మెజార్టీ ఉంటుంది. ఈ నాలుగు ఎన్డీయే వైపు నిలిస్తే సంఖ్యాబలం 257కి చేరుతుంది. ఇతరులు 14 స్థానాల్లో ఉంటారు. ఇతరులను కలుపుకున్నా ఎన్డీయేకి మరొక సీటు అవసరం.

టీఎంసీ, ఎస్పీ, బీఎస్పీ యూపీఏలో చేరి.. ఎన్డీయే యథాతథంగా ఉంటే..

ఎన్డీయే కూటమిలో ఇప్పుడున్న పార్టీ లే యథాతథంగా ఉండి, టీఎంసీ, ఎస్పీ, బీఎస్పీ యూపీఏలో చేరితే ఎన్డీయే సంఖ్యా బలం 219గా ఉంటుంది. అప్పుడు యూపీఏ బలం 269గాను, ఇతరులు 55 సీట్లలో ఉంటారు. ఇతరులు ఎన్డీయేకి మద్దతిస్తే 274 సీట్లు అవుతాయి. మేజిక్ ఫిగర్‌ను తేలిగ్గా అధిగమిస్తుంది. మరి ఎన్నికలయ్యాక వీటిలో ఏ లెక్కలు నిజమవుతాయో చూడాలి.


గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 8 మధ్య ప్రాంతంలో సర్వే చేపట్టారు. దేశవ్యాప్తంగా దాదాపు 13,179 మంది అభిప్రాయాలను సేకరించారు. 20 పార్లమెంటరీ స్థానాల్లో 1103 ఇంటర్వ్యూలను నిర్వహించి సర్వే నివేదిక రూపొందించారు. 19 రాష్ట్రాల్లో 97 లోక్‌సభ నియోజకవర్గాలు, 194 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్వే చేపట్టారు.

ప్రాంతాల వారీగా ఎవరికి ఎన్ని?

ఉత్తరభారతం (ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్)	పశ్చిమభారతం (గుజరాత్, మహారాష్ట్ర మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్)	దక్షిణభారతం. (ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్నాటక)	తూర్పు భారతం (అసోం, బీహార్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్)
ఎన్డీయేకి 40శాతం, యూపీఏకి 23శాతం ఓట్లు లభిస్తాయి. యూపీఏ కేవలం 20 సీట్లు మాత్రమే నెగ్గుతుంది. ఎన్డీయే 66 సీట్లు, ఇతరులు 37శాతం ఓట్లతో 65 సీట్లు గెలిచి కీలకంగా మారుతుంది.	ఇక్కడ ఎన్డీయే, యూపీఏ మధ్య ఓట్ల శాతంలో తీవ్రపోరు ఉంటుంది. సీట్ల పరంగా చాలా వ్యత్యాసం ఉంటుంది. ఎన్డీయే 46శాతం ఓట్లతో 76 సీట్లు, యూపీఏ 42శాతం సీట్లతో 40సీట్లు, ఇతరులు 12శాతం ఓట్లు సాధిస్తారు.	ఉత్తర,పశ్చిమ ప్రాంతాలకు భిన్నంగా దక్షిణాదిలో ఓటరు తీర్పు ఉండబోతున్నది. ఇక్కడ ఎన్డీయేకి నామ మాత్రంగానే ప్రభావం ఉంటుంది. యూపీఏకి ఆయువుపటుట్టగా నిలుస్తుంది. ప్రాంతీయ పార్టీలు చెప్పుకోదగిన స్థాయిలో నిలుస్తాయి. ఎన్డీయేకి 18శాతం ఓట్లు..26సీట్లు, యూపీఏకి 43శాతం ఓట్లు 78 సీట్లు, ఇతరులు 39శాతం ఓట్లు 30 సీట్లు.	ఇక్కడ ఎన్డీయేదే పైచేయి. అదే సమయంలో ప్రాంతీయపార్టీల హవా కూడా ఉంటుంది. యూపీఏ కూడా బలమైన శక్తిగా నిలుస్తుంది. ఎన్డీయేకి 37శాతం ఓట్లతో 69 సీట్లు, యూపీఏ 25 శాతం ఓట్లతో 28సీట్లు, ఇతరులు 38 శాతం ఓట్లతో 45 సీట్లు గెలిచే అవకాశం ఉంది.

ఇద్దరు మించి పిల్లలుంటే

ఓటు హక్కు రద్దు



న్యూఢిల్లీ: యోగాగురు రాందేవ్‌బాబా మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణకు తనదైన శైలిలో సూచన ఇచ్చారు. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లల్ని కనేవారికి ఓటు హక్కును రద్దుచేయాలని సూచించారు. గ్యాన్‌కుంభ్ ప్రారంభోత్సవన కార్యక్రమంలో పాల్గొన్న రాందేవ్ బ్రహ్మచర్యం గొప్పదని చెప్పారు. నాలాంటి అవివాహితులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, అదే సమయంలో ఇద్దరికంటే ఎక్కువ సంతానం ఉంటే సదరు దంపతులకు ఓటుహక్కు రద్దుచేయాలని చెప్పారు. అనంతరం తన వ్యాఖ్యలకు వివరణ ఇస్తూ, ఇప్పటికే జనాభా సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దీనికి చెక్ పెట్టాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. ప్రస్తుతం మన దేశంలో జనాభా 150 కోట్లను సమీపిస్తోంది. అందువల్ల ఎక్కువ సంతానం శ్రేయష్కరం కాదు. అధికజనాభా వల్ల వచ్చే సమస్యలపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలి. ఓటు హక్కు రద్దుచేయడంతోపాటు, ప్రభుత్వ ఉద్యోగాలు, వైద్యసౌకర్యాలు, సంక్షేమ పథకాల్లో అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపడితే సత్ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏమతమైన అందరికీ ఈ నిబంధన వర్తింపజేయాలని కోరారు.



బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఢిల్లీలో కేంద్రమంత్రి మేనకాగాంధీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్.



స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కొత్త ఉద్యోగంలో చేరా సార్...


కేటీఆర్‌కు ఉపాసన ట్వీట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సమావేశాలకు హాజరైన అపోలో గ్రూపు ఉపాసన తాను కొత్త ఉద్యోగంలో చేరినట్టు తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు గురువారం ట్వీట్ చేశారు. నా ఉద్యోగం ఎలా ఉంది సార్? అంటూ కేటీఆర్‌ను తన ట్వీట్ ద్వారా ప్రశ్నించారు. తెలంగాణలో పెట్టుబడి పెట్టాలనుకుంటున్న కంపెనీలకు సమాచారం ఇచ్చేందుకు ఆమె రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ డెస్క్‌కు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఇన్వెస్ట్ తెలంగాణ డెస్క్‌లో కొద్దిసేపు కూర్చోవడంతో పాటు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ళను కలిశారు.

రైల్వే పనులు పూర్తి చేయాలి

- మార్చిలోపు మనోహరాబాద్, గజ్వేల్ వరకు రైలు నడపాలి
- దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు, ఇంజనీర్లను ఆదేశించిన హరీష్‌రావు

సిద్దిపేట అర్బన్, ప్రభ న్యూస్: మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులు, ఇంజనీర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఆదేశించారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో గురువారం కలెక్టర్ కృష్ణభాస్కర్, జేసీ పద్మాకర్, దక్షణ మధ్య రైల్వేజోన్ సుబ్రమణ్యం, ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్‌లు, రైల్వే ఇంజనీర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ మార్చి నెలలోపు హైదరాబాద్ నుంచి మనోహరాబాద్, గజ్వేల్ వరకు రైలు నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైల్వేలైన్, రైల్వేస్టేషన్ నిర్మాణం ఇతర పనుల పురోగతి అంశాలపై రైల్వే సీఈతో చర్చించారు. మొత్తం 150కి.మీ.రైలు మార్గానికి గజ్వేల్ నుంచి దుద్దెడ వరకు భూసేకరణ పూర్తయిందని తెలిపారు. రూ.11.60కోట్ల వ్యయంతో నాలుగు ఫేజ్‌లుగా ఈ రైల్వే పనులు చేపడుతున్నట్లు వివరిస్తూ మొదటి ఫేజ్ మనోహరాబాద్ నుంచి గజ్వేల్‌కు ఈ మార్చి 2019లోపు అందించనున్నట్లు రైల్వే సీఈ వివరించారు. గజ్వేల్ నుంచి దుద్దెడ వరకు 28కి.మీ.ల భూసేకరణ చేపట్టినట్లు, 493ఎకరాలలో 393ఎకరాలు భూసేకరణ చేసినట్లు రెవెన్యూ అధికారులు వివరించారు. రెవెన్యూ అధికారుల సమన్వయంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, రైల్వే అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో వారం, పది రోజులలో రైల్వే ఫేజ్2 భూసేకరణ పూర్తి చేయాలని హరీష్‌రావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హరీష్‌రావు



లాన్స్‌నాయక్ నజీర్ అహ్మద్ వనీకి అశోకచక్ర

- ఉగ్రవాదం వదిలి సైన్యంలోకి
- యుద్ధక్షేత్రంలో సాహసాలు
- ఉగ్రవాదులతో పోరాడుతూ అమరుడైన నాయక్
- అశోకచక్ర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

ఆయన గతంలో ఓ ఉగ్రవాది.. కానీ ఆయన ఓ ఉగ్రవాదిలా మిగల్లేదు. మనసు మార్చుకున్నారు. దేశంపై ప్రేమను పెంచుకుని అంకిత భావంతో సైనికుడిగా సేవలు అందించారు. యుద్ధక్షేత్రంలో ధైర్య, సాహసాలు ప్రదర్శించారు. గాయపడినా పోరాడే వీరుడు ఆయన. అందుకే ఆయనకు దేశఅత్యున్నత శౌర్య పురస్కారం అశోకచక్ర దక్కింది. ఆయన లాన్స్ నాయక్..

న్యూఢిల్లీ: ఉగ్రవాదులతో పోరాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ సైనికుడు 38 ఏళ్ల లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీకు దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోకచక్రతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. యుద్ధం క్షేత్రంలో ధైర్య, సాహసాలు, ప్రాణాలు అర్పించిన సైనికులకు మిలిటరీలో దక్కే అత్యున్నత శౌర్య పురస్కారం అశోకచక్రను గణతంత్ర దినోత్సవ వేడుకల్లో లాన్స్ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రదానం చేయనున్నారు. గతేడాది నవంబర్ 25న కశ్మీర్‌లోని షోపియాన్‌లో నిర్వహించిన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌లో పోరాడుతూ ఎదురు కాల్పుల్లో లాన్స్ నాయక్ ప్రాణాలు కోల్పోయారు. కుల్గాంలోని అషుముకు చెందిన లాన్స్ నాయక్ గతంలో ఉగ్రవాదంవైపు ఆకర్షితుడయ్యారు. కానీ తన మనసుమార్చుకుని 2004లో భారత ఆర్మీలో చేరారు. దక్షిణ కశ్మీర్‌లో జరిగిన అనేక ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో పాల్గొన్న ఆయన విశిష్ట మైన సేవలు అందించారు. ముష్కరులను అణచివేయడంలో ఆయ న కృషికిగాను గతంలో రెండు అవార్డులు ఆయనకు దక్కాయి. సైన్యంలో చేరినప్పటి నుంచి లాన్స్ నాయక్ అంకితభావంతో సైనికుడిగా పనిచేశారని, ఆపదేవున్నను సవాళ్లను స్వచ్ఛందంగా స్వీక రించేవారని, ప్రతికూల పరిస్థితులలో కూడా ధైర్య, సాహసాలు ప్రద ర్శించారని రాష్ట్రపతి కార్యాలయం నోటిఫికేషన్‌లో వెల్లడించింది. లా న్స్ నాయక్ ధైర్యం, పనితీరుకు గ తంలో రెండు అవార్డు దక్కా యని, ఆయన శౌర్యానికి ఈ అవార్డులు తెలియజేస్తున్నాయని పేర్కొంది.

గాయపడినా లక్ష్యాన్ని మరువలేదు..

జమ్ము-కశ్మీర్‌లోని ఓ గ్రామంలో స్థావరం ఏర్పరచుకున్న ఆరుగురు ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో ఉన్నారని ఇంటెలిజెన్స్ సమాచారం అందించింది. ఆపరేషన్ నిర్వహించేందుకు అక్కడికి చేరుకున్న బలగాలలో లాన్స్ నాయక్ కూడా ఉన్నారు. ఉగ్రవాదులు పారిపోయేందుకు అవకాశమున్న మార్గాల వెంబడి బృందం తోపాటు వ్యూహాత్మకంగా లాన్స్ నాయక్ ఉగ్రవాద స్థావ రానికి సమీపానికి చేరుకున్నారు. అయితే బలగాలను గుర్తించిన ఉగ్ర వాదులు విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. గ్రెనెడ్లతో దాడులు చేశారు. తీవ్రంగా గాయపడినా లాన్స్ నాయక్ ధైర్యాన్ని, లక్ష్యాన్ని మరువలేదు. గాయపడి నేలపై పడిన లాన్స్ నాయక్ కదులుగుట్టిన ఓ ఉగ్రవాదిని అతి సమీపం నుంచి కాల్చిచంపారు. అనంతరం కిటికీలో నుంచి పారిపోతున్న మరో ఉగ్రవాదిని కూడా కాల్చించారు. అనంతరం తీవ్రమైన గాయాలతో కన్నుమూశారు.



చందా కొచ్చర్‌కు సీబీఐ షాక్

- భార్యా భర్తలపై ఎఫ్‌ఐఆర్ నమోదు..
- ఆపై సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లు, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణు గోపాల్ దూత్‌లకు సీబీఐ షాక్ ఇచ్చింది. ముగ్గురిపై గురువారం సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీడియోకాన్ గ్రూప్‌కు రుణాలు మంజూరు చేయడంలో అవినీతి పాల్ప డ్డారంటూ నిందితులుగా ఆరోపిస్తూ వీరిపై సీబీఐ కేసు నమో దు చేసిన విషయం తెలిసిందే. సుమారు ఐసీఐసీఐ బ్యాంకుకు రూ.1,730 కోట్లు నష్టపోయిందని వాదనలు వినిపిస్తున్నా యి. వీడియోకాన్‌కు ఇచ్చిన అరుదఫాలుగా రూ.1,875 కోట్ల రుణాలను ఐసీఐసీఐ బ్యాంకు అందజేసింది. ఈ ముగ్గురితో పాటు ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత సీఈఓ సందీప్ బక్షి, సంజయ్ ఛటర్జీ, రూరిన్ దారువాలా, రాజీవ్ సబర్వాల్, కేవీ కామత్‌తో పాటు హోమి ఖుస్రోఖాన్‌లు అనుమానితులుగా ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదైన తర వాత గురువారం తెల్లవారు జామున ముంబై, ఔరంగా బాద్‌లోని వీడియోకాన్ కార్యాలయాలపై సీబీఐ ఏక కాలం లో దాడులు నిర్వహించింది. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియో కాన్ రుణం కేసులో రూ.3,250 కోట్ల మేర అక్రమాలు జరిగా యనే ఆరోపణలు ఉన్నాయి. వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణు గోపాల్ దూత్ న్యూపవర్ రెన్యూవబుల్స్ పేరుతో ఉన్న కంపెనీలో రూ.64 కోట్లపెట్టుబడులుపెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రాథమిక విచారణలో క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని అభియోగాలు నమోదయ్యాయి. డిసెంబర్, 2017లో ప్రాథమిక విచారణ చేపట్టారు. 2009, జూన్ నుంచి 2011 అక్టోబర్ వరకు వీడి యోకాన్ గ్రూప్‌కు సంబంధించిన రుణాల విషయంలో సీబీ ఐ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. వీడియోకాన్ ఇంట ర్నేషనల్ లిమిటెడ్, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో పాటు ఇతర కంపెనీల పేరుతో రూ.1,875 కోట్ల రుణం అందినట్లు సీబీఐ తేల్చింది. రుణాల అవకతవకల వివాదం కారణంగా చందా కొచ్చర్ గత ఏడాది అక్టోబర్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ పదవి నుంచి తప్పుకున్నారు. 2012 లో వీడియోకాన్ గ్రూప్ రూ.3,250 కోట్ల రుణం పొందగా, కొచ్చర్ కుటుంబం లాభపడిందనే ఆరోపణలు వచ్చాయి. చందా కొచ్చర్ భర్తకు చెందిన కంపెనీలో వీడియోకాన్ ఎండీ వేణుగోపాల్ కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టిన తరువాత వీడి యోకాన్‌కు రుణం మంజూరైనట్టు ఆరోపణలు వచ్చాయి.

ఈసీని తప్పించండి

- కేంద్ర ఎన్నికల సంఘం వైఫల్యాలపై విపక్ష పార్టీల నిరసన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ఎన్నికల సంఘం వైఫల్యాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో విపక్షాలు గళమెత్తాయి. ఎన్నికల సంఘం వైఖరిని ఎండగడుతూ తీవ్రంగా విమర్శించాయి. గురువారం ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఎన్నికల సమన్వయ కమిటి ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన నిరసన సభ జరిగింది. ఈ సభలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాకూటమి భాగస్వామి పార్టీలు టీడీపీ, సీపీఐ, టీజేఎస్ సహా ఆమ్‌ఆద్మీ పార్టీ పాల్గొన్నాయి. పేపర్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టమని రాజకీయ పార్టీలు, ప్రజలు కోరుతున్నప్పటికీ ఎన్నికల సంఘం ఎందుకు వెనక్కి వెళ్తుందని నిలదీశారు. తెలంగాణలో ఓటు హక్కు కోసం ప్రజలు తన్నుకోవడం విచిత్రంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 32 నియోజక వర్గాల్లో పోలైన ఓట్ల కంటే కౌంటింగ్ ఓట్లులో తేడా వచ్చిందని, ఈ తేడాలపై ఇప్పటి వరకు ఈసీ వివరణ ఇవ్వలేదని నేతలు దుయ్య బట్టారు. 20 లక్షల ఓట్లను గల్లంతు చేసి, క్షమించమని ఎన్నికల కమిషనర్ కోరితే సరిపోతుందా? అని నేతలు మండిపడ్డారు. ఓటర్ల జాబితాను సరిచేయకుండా హడావిడిగా ఎన్నికలను నిర్వహించి, ఆపై జరిగిన అవకతవకలకు ఈసీ సహకరించిందని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్ని కల్లో బ్యాలెట్ పేపర్ ఓటింగ్ విధానం కోసం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. నిరసన సభలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీనేత భట్టి విక్రమార్క, ఎంపీ నంది ఎల్లయ్య, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, డి.కె. అరుణ, విహెచ్, అంజన్ కుమా ర్, ఫిరోజ్‌ఖాన్, తెదేపా రాష్ట్ర అధ్యక్షు డు ఎల్. రమణ, రావుల చంద్రశేఖర రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి, మాజీ ఎంపీ అజీజ్ పాషా, టీజెఎస్ అధ్యక్షుడు కోదండరామ్, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అహ్మద్ మజీద్, పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి దేశాల్లో ఈవీఎంలు లేవు: భట్టి

అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎం యంత్రాలను వదిలిపెట్టి బ్యాలెట్‌ను ఉపయోగిస్తున్నాయని సిఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్ర మార్క అన్నారు. ఈవీఎం వాడకంలో అనుమానాలను నివృత్తి చేయడంలో ఎన్నికల సంఘం వైఫల్యం చెందింది, కాబట్టి పాత బ్యాలెట్ పేపర్ విధానాన్నే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఈసీగా రజత్‌కుమార్ వద్దు: ఉత్తమ్

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా రజత్‌కుమార్ పనికిరారని, ఆయనను తొలగించాలని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లో కౌంటింగ్ రెండు రోజులు జరిగాయని, అక్కడ వీవీప్యాట్ పేపర్లు కూడా లెక్కించారన్నారు. కానీ తెలంగాణలో వీవీప్యాట్ పేపర్లు ఎందుకు లెక్కించలేదని ఆయన నిలదీశారు. ఏ కారణం లేకుండా ఓటర్ల జాబితాను కుదించి, ఈసీ క్షమాపణ కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్ల గల్లంతుపై ఆధారాలు చూపించినా ఈసీ పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.

బ్యాలెట్ కరెక్టు: ఎల్. రమణ

పంచాయితీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ విధానం అనుసరించడంతో ఎక్కడా ఎలాంటి ఆరోపణలు రాలేదని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ అన్నారు. ఎన్నికల ఫలితాలు సక్రమంగా రావాలంటే బ్యాలెట్ పేపరే కరెక్టు అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

క్షమించరాని నేరం: చాడ

ఓట్లు గల్లంతు క్షమించరాని నేరమని, గల్లంతుకు కారకులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ నేత చాడా వెంకటరెడ్డి నిలదీశారు. ఈవీఎంల రద్దుపై దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఓట్లు నమోదులో వివక్ష: కోదండరామ్

ఓట్లు నమోదు చేసే సమయంలో కూడా వివక్ష చూపిస్తున్నారంటూ టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఓట్ల జాబితాను సరిచేస్తారా? అనే అనుమానం తమను వెంటాడుతుందన్నారు.

బ్యానర్‌పై ఒవైసీ అభ్యంతరం

కాంగ్రెస్ తన నిరసనలో భాగంగా రూపొం దించిన బ్యానర్‌పై ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్రఅభ్యంతరం తెలియజేశారు.

అవసరం మేరకే ప్లాస్టిక్

- సిపెట్ స్వర్ణోత్సవాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్య

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మనిషి జీవన నాణ్యతను పెంపొందించుకునే క్రమంలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి నష్టం కలుగకుండా సమతుల్యత పాటించాలని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. చైన్నైలోని ''సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ'' స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న వెంకయ్య నాయుడు, జీవన నాణ్యతను మెరుగు పరుచుకునేందుకు అవసరమైన మేర ప్లాస్టిక్ వస్తువులకు ప్రాధాన్యత ఇస్తూనే, మరో వైపు ప్లాస్టిక్ విచక్షణా రహిత వినియోగానికి స్వస్థి పలకాలని సూచించారు. ప్లాస్టిక్ ప్రజల ఆరోగ్యం మీద దుష్ప్రభావాన్ని చూపిస్తున్న నేపథ్యంలో, సందర్భానుసారంగా ప్లాస్టిక్ వినియోగం ఉండాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ఉండే దీర్ఘకాలిక మన్నిక, తక్కువ బరువు వంటి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని, అదే సమయంలో ప్లాస్టిక్ అధిక వినియోగం కారణంగా పర్యావరణానికి ఎదురౌతున్న సమస్యలను మరచిపోకూడదని పేర్కొన్నారు. 50 ఏళ్ళుగా వేలాది మంది సాంకేతిక నిపుణులు మరియు పాలిమర్ ఇంజనీర్లకు శిక్షణ అందిస్తున్న ఈసంస్థను అభినందించిన ఉపరాష్ట్రపతి, గత ఐదేళ్ళలో ఇనిస్టిట్యూట్ నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాల ద్వారా రెండు లక్షలకు పైగా నిరుద్యోగ యువత లబ్ధి పొందారని తెలిపారు. తక్కువ బరువు, మన్నిక కారణంగా నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తులు ముఖ్యమైన భూమిక పోషిస్తున్నాయని, ఏరోనాటిక్స్ నుంచి మెడికల్ సైన్సెస్ వరకూ 3డి ప్రింటింగ్ రంగాలు సహా ప్లాస్టిక్ రోజువారీ జీవితాన్ని మార్చిందని అభిప్రాయపడ్డారు. భారత ఆర్థిక వ్యవస్థలోనూ ప్లాస్టిక్ కీలక పాత్ర పోషిస్తోందన్న ఉపరాష్ట్రపతి, 2018-19 నాటికి 8 బిలియన్ డాలర్ల ఎగుమతులు అంచనా వేస్తున్నారని తెలిపారు. దేశంలో సామర్థ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను ప్లాస్టిక్ పరిశ్రమ కలిగి ఉందని తెలిపారు.

భవనం కూలి ఏడుగురు మృతి

గుర్‌గాం : నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో ఏడుగురు చనిపోయారు. ఈ ఘటన గురువారం ఉదయం 5.15 గంటలకు ఉల్లవాస్‌లో చోటు చేసుకుంది. అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందంతో పాటు జాతీయ విపత్తు మేనేజ్‌మెంట్ టీం శిథిలాల కింద ఉన్న వారిని రక్షించేందుకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్‌గాం పోలీస్ పీఆర్‌ఓ సుభాష్ బోకన్ మాట్లాడుతూ.. శిథిలాల కింద మరికొంత మంది కూలీలు ఉన్నట్టు గుర్తించామని, వారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాంక్రీట్, ఐరన్ రాడ్లు, శిథిలాలు తొలగించేందుకు రెస్క్యూ బృందం తీవ్రంగా శ్రమిస్తోందని అగ్నిమాపక శాఖ అధికారి ఇషాం సింగ్ తెలిపారు. భవనం నిర్మాణంలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుందని వివరించారు. భవంతి యజమాని ఉల్లవాస్ నివాసి అని, అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు పోలీసులు వివరించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టసవరణపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ చట్టసవరణపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులో నిందితులకు బెయిల్ లభించకుండా కేంద్రం తీసుకువచ్చిన చట్ట సవరణను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు స్టే ఇచ్చేందుకు సమ్మతించలేదు. ఈ చట్టానికి సంబంధించి గత ఏడాది మార్చి 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను, సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన ఇతర పిటిషన్లను కలిపి ఒకేసారి విచారణ చేపడతామని జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. అదేవిధంగా ఈ అంశాన్ని సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి పరిశీలనకు ధర్మాసనం పంపి ఈ పిటిషన్లపై విచారణకు జస్టిస్ లలిత్‌ను చేర్చి తిరిగి ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. గత ఏడాది ఎస్సీ, ఎస్టీ చట్టంపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో జస్టిస్ లలిత్ సభ్యుడిగా ఉన్నందున ఆయనను కూడా ఈ ధర్మాసనంలో చేర్చాలని కోరింది. కాగా గత ఏడాది మార్చి 20న ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులను వేధిస్తున్నారని అందుచేత ఈ చట్టం ప్రకారం కేసునమోదు చేయగానే వెంటనే అరెస్టు చేయరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసులు విచారణ అనంతరమే అరెస్టు చేయాలని నిందితులకు ముందస్తు బెయిలు కూడా ఇవ్వాలని సుప్రీంకోర్టు గత తీర్పులో పేర్కొంది. అనంతరం ఈ తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా దళిత సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని యథాతథంగా ఉంచుతూ కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ చట్టసవరణ 2018 ప్రకారం నిందితులకు ముందస్తు బెయిల్ లభించదు.

ఈవీఎంలతోనే ఎన్నికలు



న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నిక ల్లోనూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల ద్వా రానే ఎన్నికలు నిర్వహిస్తామని బ్యాలెట్ పేపర్ల విధానానికి వెళ్లేది లేదంటూ ఎన్ని కల ప్రధాన కమిషనర్ సునీల్ అరోరా స్ప ష్టం చేశారు. ఈవీఎంల పనితీరుపై వస్తున్న విమర్శ లను కొట్టిపారేశారు. ఈవీఎంలను ఎవరూ హ్యాక్ చేయలేరని గట్టిగా వాదిం చారు. రాజకీయ నాయకులు ఈవీఎంలను ఫుట్ బాల్‌లా ఉపయోగించుకుంటున్నా రని విమర్శిం చారు. ఈవీఎంల పనితీరు విషయంలో భారత ఎన్ని కల కమిషన్‌పై ఆరోపణలు చేయడం బాధాకర మ న్నారు. గతంలో కూడా ఈసీఐనే ఎన్ని కలు నిర్వహిం చిందని, భవిష్యత్తులో కూడా నిర్వహిస్తుందని, కానీ బ్యాలెట్ ద్వారా కాదని తేల్చిచెప్పారు. బ్యాలెట్ ద్వారా కౌం టింగ్‌లో ఆలస్యం అవుతుందని, దీనికి తోడు ఎన్నికల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటా రన్నారు. ఈసీఐకి రాజకీయ పార్టీలు ప్రధానం అని, వారి విమ ర్శలు, అభి ప్రాయాలు, సూచనలు తీసు కుం టామ తెలిపా రు. దేశంలో రెండు దశాబ్దా లుగా ఈవీ ఎంలను ఉపయో గిస్తున్నా మని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన డిమాం డ్, అభ్యర్థ నల మేరకు మరిం త పార దర్శ కగా ఎన్నికలు నిర్వహిం చడానికి వీవీ ప్యాట్ యంత్రాలను కూడా తీసుకొ చ్చామని సునీల్ అరోరా తెలి పారు. గతంలో హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్నాటక, త్రిపుర, నాగా లాండ్, మిజోరంలో ఈవీఎంల ద్వారానే ఎన్నికలు నిర్వహిం చామని, మళ్లీ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలం గాణ, రాజస్థాన్‌లో కూడా చేపట్టామని, వివిధ రాష్ట్రా ల్లో వివిధ రకాల ఫలితాలు వచ్చాయని అన్నారు. గెలి స్తే ఈవీఎంలు బాగున్నాయని, ఓడిపోతే హ్యాకింగ్ చేశారని అనడం ఏంటని ప్రశ్నించారు. ఈవీఎంలపై ఎలాంటి విమర్శలు, వివాదాలు ఎదుర్కొనేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ట్యాంపరింగ్ సాధ్యం కాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్స్ (ఈవీఎం)లను ట్యాంపరింగ్ చేయడం సాధ్యంకాదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి డాక్టర్ రజత్ కుమార్ పునరుద్ఘాటించారు. తానొక ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌నని, 200 శాతం ట్యాంపరింగ్ చేయలేరని చెప్పగలనని ఆయన స్పష్టంచేశారు. ఈవీఎంలను ట్యాంపర్ చేస్తారంటూ 30 కేసులు వేశారని, సాంకేతికంగా వీటిని నిరూపించలేక పోయారని ఆయన చెప్పారు.


ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం గురువారం నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రోతలు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్ర జనాభాకన్నా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, 34 లక్షల మందిని భోగస్ ఓటర్లుగా తొలగించామని ఆయన తెలిపారు. శాసనసభ ఎన్నికల తర్వాత 13 లక్షల మంది తమ ఓటు గల్లంతైందని ఫిర్యాదు చేశారని రజత్ కుమార్ తెలిపారు. అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలన్నదే తమ లక్ష్యమని, అది ప్రజాస్వామ్యం మనుగడకు దోహద పడుతుందని ఆయన అన్నారు. ఓటర్ల నమోదు, పరిశీలన, ప్రక్షాళన చేశామని, అనర్హులు, అడ్రస్ మార్చిన వారి పేర్లను మాత్రమే జాబితా నుంచి తొలగించినట్లు స్పష్టంచేశారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఎన్నికల సంఘం బహిరంగ సవాల్ చేస్తే నిరూపించలేకపోయారని రజత్‌కుమార్ చెప్పారు. 2014 ఎన్నికల్లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసినట్టు చెబుతున్న వ్యక్తి ఈసీఐఎల్ ఉద్యోగి కాదని తేలిపోయిందని, ఆయన ఆరోపణల్లో ఏమాత్రం బలం లేదని రజత్ కుమార్ చెప్పారు. ఈవీఎంలపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చాక చర్చ ముగిసిందని, వచ్చే ఎన్నికల్లో కూడా ఈవీఎంలతోనే పోలింగ్ నిర్వహిస్తామని ఆయన స్పష్టంచేశారు.

1 నుంచి ఈబీసీ కోటా

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్ల కోటా ఫిబ్రవరి 1నుంచి అమలవుతుందని కేంద్రం ప్రకటించింది. ఇక నుంచి అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో 10శాతం ఈబీసీ కోటా అమలుచేయాలని కేంద్ర ఉన్నతాధికారులు తమ ఆదేశాల్లో తెలిపారు. ఈబీసీ కోటా అమలుకు సంబంధించి వివరణాత్మక సూచనలు ప్రత్యేకంగా జారీ అవుతాయని కేంద్రం తమ ఆదేశాల్లో తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, సేవలులో ఆర్థికంగా వెనుకపడిన బలహీన అగ్రవర్ణాల కోసం 10శాతం రిజర్వేషన్లు ఇకనుంచి 2019, ఫిబ్రవరి 1నుంచి అన్ని ప్రత్యక్ష నియా మ కాల ఖాళీల్లో సమర్థంగా అమలుచేయాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది. కాగా జనరల్ కేటగిరీ పేదలకు ఉద్యోగాలు మరి యు విద్యలో 10శాతం రిజర్వేషన్‌లు కల్పించే రాజ్యాంగ (124 సవరణ) బిల్లును జనవరి 9న పార్లమెంటు ఆమోదించిన సంగతి విదితమే. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు మరియు సామాజికంగా, విద్యాపరంగా వెనుకపడిన తరగతులకు రిజర్వే షన్లు కల్పించిన పథకం పరిధిలో లేని వ్యక్తులకు ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయని కేంద్ర సామాజిక మంత్రిత్వశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సోనియా, ప్రియాంక సైనికులు



- మోడీ..కాపలాదారు కాదు దొంగ
- లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం
- అమేథీ సమావేశంలో రాహుల్ గాంధీ

అమేథి (ఉత్తర్‌ప్రదేశ్) : లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అన్ని విధా లుగా సిద్ధమైందని, ఉత్తర్‌ప్రదేశ్‌లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రియాంక గాంధీ వాద్రా, సింధియాను రంగంలోకి దించామని ఆ పార్టీ అధ్యక్షు డు రాహుల్ గాంధీ ప్రకటించారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా వీరిద్దరూ యూపీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. బీజేపీ ముక్త్ భారత్ గురించి మాట్లాడనని అన్నారు. కాంగ్రెస్ నుంచి భారత్‌కు విముక్తి కల్పించాలంటూ మోడీ ఇచ్చిన పిలుపు మేరకు రాహుల్ పైవిధంగా స్పందించారు. గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు ఎక్కడైనా బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తుందని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ వెనుకడుగు వేయకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు గురించి ప్రస్తావిస్తూ.. ప్రధాన నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు ప్రజాధనాన్ని దోచి పెడుతోందని విమర్శించారు. దేశానికి కాపలాదారుగా ఉంటానన్న మోడీ ఓ దొంగ అని తేలిందని దుయ్యబట్టాడు. అనంతరం 'గలీ గలీ మే షోర్ హై.. చౌకీదార్ చోర్ హై' అంటూ రాహుల్ గాంధీ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

స్థానిక శివాలయంలో రాహుల్ పూజలు

బహిరంగ సభకు ముందు రాహుల్ స్థానికంగా ఉన్న శివాలయాన్ని సందర్శించారు. అనంతరం అతిథి గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ప్రియాంక గాంధీ వాద్రా, సోనియా గాంధీ ఇద్దరూ దేశం కోసం సైనికుల్లా పని చేస్తారని అభివర్ణించారు. 2014 ఎన్నికల్లో భాగంగా నరేంద్ర మోడీ చేసిన హామీలు నెరవేర్చలేదని, ఉద్యోగాల్లేక యువత తీవ్ర నిరాశలో ఉందని, అదేవిధంగా తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదని రాహుల్ విమర్శించారు. ఫుడ్ పార్క్‌కు పునర్ వైభవం తీసుకొస్తామని, ప్రధాని మోడీ, యోగి ఆదిత్యనాథ్ ద్వారా నిలిపివేసిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కులం, మతం, వర్గాల పేరుతో ప్రజలను బీజేపీ విభజిస్తోందని, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌లో హిందువులు, ముస్లిములకు మధ్య గొడవలు పెడుతున్నారని ఆరోపించారు. నరేంద్ర మోడీ అంటే ద్వేషానికి చిహ్నం మోడీ అని, 2019లో మోడీ బహిష్కరణను ఎవరూ ఆపలేరని అన్నారు.

రాహుల్ గో బ్యాక్ టు ఇటలీ

రెండు రోజుల పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీకి సొంత నియోజకవర్గం అమేథీలో నిరసన సెగ తగిలింది. ఆయన రాకను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు ఆందోళన చేపట్టారు. రాహుల్ తిరిగి ఇటలీ వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ తమ భూములు లాక్కుందంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినా దాలు చేశారు. ఈ సందర్భంగా ఆందోళన కారులు మాట్లా డుతూ.. రాహుల్ గాంధీ తీరుతో విసిగిపోయామని, మా భూములు లాక్కోవడం బాధాకరమని, ఇలాంటి వ్యక్తి భారత్‌లో ఉండటానికి అర్హుడు కాదని, ఇటలీకి వెళ్లి పోవాలని అన్నారు.

సీబీఐ చీఫ్ ఎంపిక నిర్ణయం వాయిదా!

- వచ్చేవారం మరోసారి భేటీ.. పరిశీలనలో 70-80 పేర్లు

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సారథి ఎంపిక మళ్లీ వాయిదా పడింది. గురువారం ప్రధానమమంత్రి నివాసంలో హైపవర్ కమిటీ భేటీ అయ్యింది. ప్రధాని మోడీతోపాటు సుప్రీం సీజే రంజన్ గొగొయ్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే సమావేశం అయ్యారు. సీబీఐ చీఫ్ పదవికి అర్హులైన వారి జాబితాను పరిశీలించారు. ఇందులో 70-80 మంది అధికారుల పేర్లు ఉన్నాయి. కానీ వారి సమర్థతకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు. ఏయే హో దాల్లో పనిచేశారు? గతంలో దర్యాప్తు అనుభవాలు? సీబీఐ చీఫ్ పోటీకి వారికున్న అర్హతలు? వంటి మరింత సమాచారం అవసరమని తాను, సుప్రీం సీజే ఇద్దరం ప్రధానికి సూచించామని, వచ్చేవారంలోగా దీనిపై కసరత్తు పూర్తిచేయాలని కోరా మని కాంగ్రెస్ సీనియర్‌నేత మల్లికార్జున్ ఖర్గే మీడియాకు వెల్లడించారు. కాగా, 1982-85 బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ అధికారులు రేసులో ముందున్నట్లు రెండు రోజుల కిందట పీఎంవో వర్గాలు చెప్పాయి. సీనియారిటీ, సమర్థత, అవినీతి కేసుల్లో అనుభవం, సీబీఐ లేదా విజిలెన్స్ కేసుల దర్యాప్తులో నేర్పు వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలుస్తోంది.

శివానంద లేదంటే మోడీ!

1983 బ్యాచ్ అధికారి గుజరాత్ డీజీపీ శివానంద ఝా, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ రజనికాంత్ మిశ్రా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్‌రంజన్, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ వైసీ మోడీ, ముంబై పోలీస్ కమిషనర్ సుబోధ్ జైశ్వాల్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ కేవలం సీనియారిటీకి ప్రాధాన్యంఇస్తే గుజరాత్ డీజీపీగా పనిచేసిన శివానంద ఝా సీబీఐ చీఫ్ అయ్యే అవకాశం ఉంది. ప్రధానితో నేరుగా పరిచయం ఉండటం కలిసొచ్చే అంశమని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఝా 2021లో పదవీ విరమణ చేయనున్నారు. ఝాను ఎంపిక చేస్తే గుజరాత్ డీజీపీ పదవి ఖాళీఅవుతుంది..ఈ బాధ్యతల్లో సీబీఐ నెం-2 రాకేశ్ ఆస్థానాను నియమించొచ్చని సమాచారం. అత్యున్నత దర్యాప్తు సంస్థ సారథ్య రేసులో ముందున్న మరొక వ్యక్తి వైసీమోడీ. ఈయన ఎన్ఐఏ డీజీగా పనిచేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం..సీబీఐలో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవం కూడా ఉంది. గుజరాత్ అల్లర్ల కేసులో సిట్ బృందంలో వైసీ మోడీ సభ్యుడు కూడా. ఇక మూడో వ్యక్తి బీఎస్ఎఫ్ డీజీ ఆర్‌కే మిశ్రా. ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి నిపేందర్ మిశ్రాకు సన్నిహితుడు. ఇతనితోపాటు ముంబై పోలీస్ కమిషనర్, ఆర్ఎస్ఎస్ మూలాలు కలిగివున్న సుబోధ్ జైశ్వాల్ పేరు టాప్-5లో ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సీబీఐలో అంతర్యుద్ధం మొదలై మూడు మాసాలవుతోంది. అప్పటి నుంచి పూర్తిస్థాయి చీఫ్ ఎవరూ లేరు. ఈ సస్పెన్స్‌కు మరో నాలుగైదు రోజుల్లో తెరపడే అవకాశంఉంది.



ప్రియాంక ప్రభావం ఎంత?



కేవలం తూర్పు ఉత్తర ప్రదేశ్ బాధ్యతలు అప్పచెప్పి, కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనేక మంది ప్రధానకార్యదర్శుల్లాగా అదే పదవి ఇవ్వడంతోనే ప్రియాంకా గాంధీ రాక ఇప్పుడు దేశ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. 2014లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా రంగ ప్రవేశం చేసిన నరేంద్రమోడీ సృష్టించిన ప్రజా ప్రభంజనాన్ని ఇప్పుడు అదే స్థాయిలో ప్రియాంకగాంధీ వాద్రా సృష్టిస్తుందా అన్నదానిపై దేశవ్యాప్తంగా వాడీవేడి చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో అతిథి పాత్ర పోషించిన ప్రియాంకగాంధీ ఇకపై కీలక పాత్రలో తన సోదరుడు రాహుల్ గాంధీకి కాంగ్రెస్‌ను తిరిగి ఢిల్లీ గద్దెపై కూచు పెట్టడంలో సహకరించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పోరాట చిత్రం మల్టీ స్టారర్‌గా మారిపోయిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.



న్యూఢిల్లీ: ఇప్పుడు ప్రియాంకగాంధీకి కేవలం తూర్పు యూపీ బాధ్యతలు అపచెప్పారు. గతంలో నాన్న రాజీవ్‌గాంధీ, సోదరుడు రాహుల్‌గాంధీ కూడా ప్రధాన కార్యదర్శి పదవుల నుంచే పార్టీలో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. అయితే ప్రియాంక గాంధీ కేవలం తనకు అప్ప చెప్పిన యూపీలోని చిన్న భాగంలోని బాధ్యతలకు పరిమితం అవుతారా అంటే కాదు అనే సమాధానం వినవస్తోంది. యూపీ వ్యాప్తంగా ప్రియాంకగాంధీ ప్రచారం కోసం ఆ పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తాయంటున్నారు. ఒక్క యూపీనే కాకుండా దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి కూడా ప్రియాంక రావాలనే నినాదం రాబోయే రోజుల్లో ప్రతిధ్వనిస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఇందిరమ్మ శైలే..!



ఇక మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ మరణించిన తరువాత నెహ్రూ కుటుంబం నుంచి ఎవరైనా పార్టీ పగ్గాలను, ప్రధాని బాధ్యతలను స్వీకరిస్తారని ఆశించారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవిని సోనియాగాంధీ స్వీకరించాలని కోరితే ఆమె సున్నితంగా తిరస్కరించారు. ప్రధాని పదవిని చేపట్టడానికి కూడా సోనియాగాంధీ అప్పట్లో విముఖత ప్రదర్శించారు. అప్పుడే పీవీ నరసింహారావు ప్రధాని పీఠం ఎక్కారు. పీవీకి పార్టీలో ప్రధాన శత్రువైన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ దిగ్గజం అర్జున్‌సింగ్... ఆయన్ను పదవిలోంచి దించడానికి అనేక యుక్తులు ప్రదర్శించారని అంటారు. సరిగ్గా ఆ రోజుల్లోనే ప్రియాంక గాంధీ గురించి అర్జున్‌సింగ్ అభిప్రాయం ఇప్పుడు కీలకంగా మారుతోంది. కుటుంబ అధికారాన్ని కొనసాగించే శక్తి ప్రియాంకగాంధీలోనే ఉందని అర్జున్ సింగ్ అన్నారు. రాహుల్‌లో మృదుత్వం ఎక్కువని, అయితే ఆ విషయంలో ప్రియాంక గాంధీ స్వభావం చాలా దృఢమైందన్నారు. నెహ్రూ కుటుంబంతో ఎంతో సాన్నిహిత్యం ఉండే అర్జున్‌సింగ్ రాహుల్, ప్రియాంకల గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇప్పుడు కీలకంగా మారాయి. నిజానికి ఆ రోజుల్లో అంటే.. రాజీవ్ మరణం తరువాత తను కాని, తన పిల్లలు కానీ రాజకీయాల్లో రావడం సోనియాగాంధీకి ఏమాత్రం ఇష్టం లేదు.

దాడి చేయడంలో దీటుగా..

ఇక అర్జున్‌సింగ్ వెలిబుచ్చిన అభిప్రాయానికి అద్దపట్టే సంఘటన 2014 సార్వత్రికల ఎన్నికల సమయంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీకి 124 సంవత్సరాలు వచ్చాయని, బాగా ముసలిది అయిపోయిందనే అర్థంలో నాటి బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యపై స్పందించాల్సిందిగా విలేఖరులు ప్రియాంకగాంధీని కోరారు. దీనికి ఆమె.. కాంగ్రెస్ అంత ముసలిగా కనిపిస్తుందా? అంటే ఇచ్చిన జవాబు ప్రత్యర్థులను నివ్వెరపరిచేలా చేసింది. ప్రియాంకగాంధీ నాకు కుమార్తెతో సమానమని మోడీ చేసిన వ్యాఖ్యపైనా ఆమె తీవ్రంగా స్పందించారు. ఎవరంటే వారు తనను కుమార్తెగా భావించక్కర్లేదని, తనకు నాన్న రాజీవ్ అంటే ఎంతో ఇష్టమని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ రెండు సందర్భాల్లో ప్రియాంక వ్యవహరించిన తీరు, చేసిన వ్యాఖ్యలు అచ్చం నానమ్మ ఇందిరాగాంధీని గుర్తుకు తెచ్చాయంటున్నా రు రాజకీయ పరిశీలకులు.

యూపీలో రాజకీయాలు మారతాయా?

- కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందా?
- ప్రియాంకకి నానమ్మకీ పోలికేంటి?
- రాహుల్‌కి చేదోడు వాదోడుగా వాద్రా!

ప్రియాంక తర్వాత ఆమె పిల్లలకు పదవులు

నాయకత్వం ఎవరికి ఉందో ప్రజలే నిర్ణయిస్తారుప్రియాంకకు పదవిపై వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి వీకే సింగ్ప్రియాంక గాంధీ వాద్రాను తూర్పు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించడంపై కేంద్రమంత్రి వీకే. సింగ్ స్పందించారు. ఈ రోజు ప్రియాంక గాంధీ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారని, రేపు ఆమె పిల్లలు నియమితులవుతారని విమర్శించారు. జనరల్ సెక్రటరీగా ప్రియాంక గాంధీని ప్రజలు ఎన్నుకోలేదన్నారు. దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వం ఎవరికి ఉందో ప్రజలే నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు. ప్రియాంక గాంధీ గతంలోనే పలు ఎన్నికల్లో ప్రచారం చేశారని వీకే సింగ్ గుర్తుచేశారు.

సోదరుడికి చేదోడు వాదోడుగా..

ఏ సినిమాలనైనా అతిథి పాత్ర పోషించడం వేరు. సినిమా విజయాన్ని పూర్తిగా భుజాలకెత్తుకొనే పాత్ర వేయడం వేరు. ఇప్పుడు రాహుల్ ఏ పాత్ర అయితే పోషిస్తున్నారో, అదే బాధ్యత ప్రియాంక గాంధీ వాద్రా మీద ఉంది. 2014లో ఉన్న దయనీయ స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు లేదు. ఎంతో కొంత మెరుగుపడింది. ఇటీవల ముగిసిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాలను కాంగ్రెస్ ఖాతాలోకి జమ చేయడం ద్వారా రాహుల్ మంచి ఉత్సాహంగా ఉన్నారం టున్నారు. గత సంక్షోభాల నుంచి బయటపడి ఇప్పుడిప్పుడే కొంతమేరకు కాంగ్రెస్ పార్టీ కోలుకుంటున్న దశలో ప్రియాంకగాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించారు. కేవలం మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో మాత్రమే గెలవగలిగింది. అయితే ఇప్పుడు రాహుల్‌గాంధీని ఎవరూ పప్పు అని పిలవడం లేదు. అది ఒక మార్పు అయితే, ప్రధాని మోడీ రక్షణాత్మక స్థితిలో పడడం, ప్రాభవం తగ్గడం మరో పరిణామని అంటున్నారు. ప్రియాంక గాంధీ వాద్రా ఖచ్చితంగా కాంగ్రెస్ విజయావకాశాల్లో కీలక పాత్ర పోషిస్తారని , రాహుల్ కూడా తన వంతు ప్రభావాన్ని చూపి స్తారనే అంటున్నారు.

యూపీని గెలుచుకొని రా..!

అధికార కేంద్రం అవుతారా?

బీజేపీని సమూలంగా తుదముట్టించి, ఉత్తరప్రదేశ్‌లో కమలనాథులను చిత్తుచిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే ప్రియాంకగాంధీ వాద్రా, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతైన ప్రతిభ కనబర్చిన జ్యోతిరాదిత్య సింధియా ముందున్న లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ధేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తీ శక్తితో పోరాడుతుందని రాహుల్ స్పష్టం చేశారు. భారతదేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తి చేయాలని ప్రధాన నరేంద్రమోడీ అన్నట్లుగా తాను అనబోనని రాహుల్ చెప్పారు. బీజేపీ విముక్తి భారత్ అనే నినాదాన్ని తాను ఇవ్వదలుచుకోలేదన్నారు. గుజరాత్ కానీ, యూపీ కానీ, తమిళనాడు కానీ ప్రతి చోటా కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేసి యావత్ శక్తిని ఉపయోగించి పోరాడుతుందన్నారు. విధాన సభ ఎన్నికల తరువాత యూపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని జోస్యం చెప్పారు.

అయితే ఇప్పటి వరకు సోదరిగా ఉన్న ప్రియాంక గాంధీ వాద్రాతో రాహుల్‌కి ఎలాంటి రాజకీయపరమైన సమస్యలు రాలేదు. ఇకపై ఆమె కూడా కాంగ్రెస్‌లో ఒక అధికార కేంద్రంగా ఆవిర్భవించడం ఖాయంగా కనిపించడంతో రాబోయే రోజుల్లో ఇదే అక్కా, తమ్ముడి బంధాన్ని దెబ్బ తీస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే కాంగ్రెస్‌కి, రాహుల్‌గాంధీ ఇప్పుడు ఏం జరుగుతుందనేది ముఖ్యంగా మారిందని అంటారు. భవిష్యత్ సమస్యల గురించి ఆలోచించే తీరిక లేదంటారు. అందుకనే ప్రస్తుతానికి అయితే మాత్రం ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయ ప్రవేశం కాంగ్రెస్ పార్టీకి శుభవార్తగానే భావించాల్సి ఉంటుంది.



- ప్రియాంకగాంధీ కరిష్మా విషయంలో ఎవరికీ ఎటువంటి సందేహం అక్కర్లేదు. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను మంత్రముగ్ధుల్ని చేస్తారు. ప్రియాంక సభలకు జనం తండోపతండాలుగా వస్తారు. ఇందిరాగాంధీ మనవరాలిగా, ఆమె పోలికలుండడంతోనూ.. ప్రజల్లో విశేషమైన ఆసక్తి ఉంది. రాహుల్ వల్ల కానీ వర్గాల నుంచి కూడా ప్రియాంకగాంధీ ఓట్లను రాబట్టడంలో విజయం సాధిస్తారని భావిస్తున్నారు.
- ఇక రాహుల్‌గాంధీకి ఇప్పుడు మరో గొప్ప ఊరట లభించింది. ప్రియాంకగాంధీ అక్కగా తన తమ్ముడి విజయాన్ని ప్రగాఢంగా కోరుకుంటారు. అత్యంత విశ్వసనీయమైన సలహాదారుగా ఉండగలరు. ఈ విషయంలో ఇతరులు ఎవ్వరూ కూడా ప్రియాంకగాంధీకి సాటి రాలేరు. ప్రియాంక గాంధీ నుంచి వచ్చిన సలహాలు, సూచనలను రాహుల్ గాంధీ నిస్సందేహంగా విశ్వసించడం ఎన్నికల వేళ కలిసి వచ్చే అంశమంటున్నారు.
- ఇక్కడ మరో విషయం కూడా ఉంది. గత ఎన్నికల్లో రాహుల్ వెంట పలువార్లు యూపీయే అధినేత్రిగా సోనియాగాంధీ పర్యటించేవారు. అనేక సభల్లో పాల్గొనే వారు. ఇప్పుడు ఆమె ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పుడు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచార బాధ్యతలను పంచుకోవడం సాధ్యమవుతుంది. ఎవరు ఎక్కడి వెళ్లాలో నిర్ణయించుకొని సమష్టిగా పని చేయడం వీలవుతుంది. సమయాభావం వల్ల తాను వెళ్లాలనుకొని వెళ్లలేకపోయిన ప్రాంతాల గురించి ఇక రాహుల్‌గాంధీకి దిగులు అక్కర్లేదు. అలాంటి నియోజక వర్గాల్లో ప్రియాంకగాంధీ పర్యటించి ఆ లోటును తీర్చ గలదంటున్నారు.

ప్రియాంక రాకతో ఏం జరుగుతుంది?

భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఇందిరాగాంధీ అంటే ఎంతో అభిమానం ఉంది. ఇందిరమ్మ అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. మహిళల్లో ఇందిరాగాంధీ అంటే మరెంతో ఆదరణ ఉంది. ప్రియాంకగాంధీకి నానమ్మ పోలికలుండడం, ఆమె లక్షణాలు, నాయత్వ పటిమ ఉండడం కూడా కలిసి వచ్చే అంశమంటున్నారు. ప్రియాంకలో ఇందిరాగాంధీని చూసుకొనే అవకాశం ప్రజలకు రావడం, అది ఓట్ల రూపంలోకి మారుతుందనే ఆశలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఇప్పటికే ప్రియాంక గాంధీ, ఇందిరాగాంధీ పోస్టర్లు యూపీల్లో పలు ప్రాంతాల్లో వెలిశాయి.

- ఇక ఇంత దేశంలో తూర్పు యూపీ బాధ్యతలే ప్రియాంకకి ఎందుకు అప్పచెప్పారనే ప్రశ్న విశ్లేషకుల్ని సైతం వేధిస్తోంది. ఇక్కడే కాంగ్రెస్ పార్టీ తెలివిగా వ్యవహరించిందంటారు. తూర్పు యూపీలో అగ్ర వర్ణ ఓటర్ల ఆధిక్యం ఎక్కువ. 2014లో బీజేపీ విజయ పరంపరంలో ఈ వర్గాలే కీలక భూమిక పోషించాయని రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. అయితే ఇవే శక్తులు మండల-కమండల్, అయోధ్య రాజకీయాలు రంగ ప్రవేశం చేయడానికి ముందు కాంగ్రెస్‌కి పెట్టని కోటగా ఉండేవని గుర్తు చేస్తున్నారు. 2014కి ముందు అగ్రవర్ణాలు తమకు ఒక రాజకీయ వేదిక కావాలని చూస్తున్న తరుణంలో బీజేపీ వారికి వరదాయనిగా కనిపించింది. ఒకసర్వే ప్రకారం 72 శాతం బ్రాహ్మణులు, 77 శాతం రాజ్‌పుట్లు, 71 శాతం వైశ్యులు, 79 శాతం ఇతర అగ్ర వర్ణాలు బీజేపీని చూసి, కొంత మోడీ ప్రభావంతో ఓటేశారని తెలుస్తోంది. అయితే అగ్రవర్ణాల్లో ఒక వర్గం మాత్రం ఇప్పుడు బీజేపీపై గుర్రుగా ఉంది. ఎస్సీ, ఎస్టీ చట్టం విషయంలో తమ అభిమతానికి అనుగుణంగా కమలనాథులు వ్యవహరించేలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా అగ్రవర్ణాల పార్టీనే పెట్టి, బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయడాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అగ్రవర్ణాలు ఏకమొత్తంగా ఎస్పీ, బీఎస్పీకి ఓటేయరని, అవకాశం ఉంటే అంటే, కాంగ్రెస్ గెలుస్తుందని భావిస్తే.. ఆ వర్గాలు హస్తం గుర్తుకు గంపగుత్తగా ఓటేస్తారనే పరిస్థితి కమలనాథుల్లో కలవరానికి కారణమవుతోంది. అగ్ర వర్ణాల ఓటు బ్యాంకులో కాంగ్రెస్ కొంతైన కొల్లగొడుతుందని ఆందోళన చెందుతోంది.

తూర్పు యూపీ అంత తేలికా?

- కాంగ్రెస్‌కి నల్లేరు నడక కాదు..
- బలంగా పాతుకుపోయిన బీజేపీ
- అగ్రవర్ణ ఓటర్లే కీలకం..
- ప్రియాంకగాంధీ వాద్రాకి అగ్ని పరీక్ష
- తూర్పు యూపీ సమగ్ర ముఖచిత్రం



న్యూఢిల్లీ: తూర్పు ఉత్తర ప్రదేశ్‌కి ఇంఛార్జీగా ప్రియాంకగాంధీ వాద్రాను నియమించి కాంగ్రెస్ పార్టీ తన ప్రత్యర్థులను ఆశ్చర్యానికి గురి చేసి ఉండవచ్చు. అయితే 2014 పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఒక్కసీటు కూడా గెలవని కాంగ్రెస్ పార్టీ దురదృష్టాన్ని ప్రియాంకగాంధీ ఒంటి చేత్తో తిరగరాస్తారా అన్నది కీలక ప్రశ్నగా మారింది. తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో 23 జిల్లాలున్నాయి. ఇక్కడి నుంచి 28 మంది ఎంపీలు లోక్‌సభకి ప్రాతినిధ్యం వహిస్తారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో కేవలం రాయ బరేలీలో, అమేధిలో మాత్రమే కాంగ్రెస్ బొటాబొటి ఆధిక్యంతో గెలవగా, ఇదే రాష్ట్రం నుంచి ప్రధాని మోడీ, యోగి ఆదిత్యానాథ భారీ మెజారిటీతో గెలిచారు. తూర్పు యూపీలో ఉన్న 29 స్థానాల్లో 23 నియోజవర్గాల్లో బీజేపీ గెలిచింది. బీజేపీతో పొత్తు పెట్టుకున్న అప్నా దళ్ పార్టీ రెండు స్థానాలు, సమాజ్ వాదీ పార్టీ ఒక స్థానంలో గెలిచింది.

అప్నాదళ్ అభ్యర్థి అనుప్రియ పటేల్ నుంచి మిర్జాపూర్ పార్లమెంటరీ స్థానంలో గెలవగా అదే పార్టీకి చెందిన మరో అభ్యర్థి కున్వర్ హరివంశ్ సింగ్ ప్రతాప్‌గఢ్ సీటులో పార్లమెంటుకి ఎన్నికయ్యారు. ఇక అజాంగఢ్ స్థానంలో పోటీ చేసిన ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్ కూడా గెలిచారు. ప్రధాని మోడీ వారణాశిలో, యోగి ఆదిత్యానాథ్ గోరఖ్‌పూర్ నియోజక వర్గాల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ఘజియాపూర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి మనోజ్ సిన్హా గెలిచారు. తూర్పు యూపీలో గోరఖ్‌పూర్, ప్రతాప్‌గఢ్, వారణాశి, అజాంగఢ్, దియోరా, కుషినగర్, బన్స్‌గావ్, ఫజియాబాద్, రాయ్ బరేలి, అమేధి, బహ్రైక్, శ్రవస్థి, గోండా, అలహాబాద్, దుమారియాగంజ్, ఫుల్పూర్, మహరాజ్‌గంజ్, అంబేద్కర్‌నగర్, నాగార్, బస్తి, సంత్ కబీర్ నగర్, సలేంపూర్, బల్లియా, జౌన్పూర్, ఘజిపూర్, చందౌలి, భదోహి, మిర్జాపూర్, ఫతేపూర్ ఎంపీ స్థానాలున్నాయి.

2009లో నాలుగే స్థానాలు..!

2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తూర్పు యూపీ నుంచి నాలుగు స్థానాల్లో గెలిచింది. దొమారియగంజ్, శ్రవస్థి, కుషినగర్, ప్రతాప్‌నగర్ పార్లమెంటరీ నియోజక వర్గాల్లో గెలిచింది. ఇక 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గొప్పగా ప్రభావాన్ని చూపించలేకపోయింది. ఇక్కడ 130 అసెంబ్లీ స్థానాలుంటే అందులో బీజేపీ 87 సీట్లలో గెలుపు బావుటా ఎగురేయగా, కాంగ్రెస్ ఒక్క సీటుతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అప్నాదళ్ 9, సమాజ్ వాదీ పార్టీ 14, బీఎస్పీ 10 స్థానాల్లో గెలిచాయి. తూర్పు యూపీలోని ఫుల్పూర్ ఎంపీ స్థానం నుంచి దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1952, 1957, 1962 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచారు. 1964లో మరణించే వరకు నెహ్రూ ఫుల్పూర్ పార్లమెంటరీ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. నెహ్రూ మరణం తరువాత ఆయన సోదరి విజయ లక్ష్మి పండిట్ 1964, 1968 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచారు. 1969లో తొలిసారిగా ఫుల్పూర్ ఓటర్లు కాంగ్రెసేతర పార్టీకి పట్టం కట్టారు. సంయుక్త సోషలిస్టు పార్టీ అభ్యర్థి జనేశ్వర్ మిశ్రా ఫుల్పూర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలిచారు. ఇక ఫుల్పూర్‌లో ప్రధాని నెహ్రూ కాకుండా మరో ప్రధాని వీపీ సింగ్ కూడా గెలిచారు.

రాహుల్ చేతులెత్తేసినట్లే!

ప్రియాంకగాంధీని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతోనే రాహుల్ గాంధీ ఒక్కరే రాజకీయాలు చేయలేరని ఒప్పుకున్నట్లైందని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్నారు. సామర్థ్యమున్న నేతలు ముందుకు రావాలని మహాజన్ పిలుపిచ్చారు. ప్రియాంక మంచి మహిళ అని, అయితే ఆమె పార్టీలో పదవి ఇవ్వడంతోనే రాహుల్ అశక్తత వ్యక్తమైందన్నారు. కాంగ్రెస్ కుటుంబ రాజకీయాల గురించి నేనేమీ వ్యాఖ్యానించనని, అది వారి సొంత వ్యవహారమన్నారు.

కాబోయే ప్రధాని ప్రియాంకా?

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీకి ధీటైన అభ్యర్థిగా ప్రియాంక గాంధీ వాద్రాను పోల్చడం తొందరపాటు చర్య అవుతుందని జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ అన్నారు. ప్రియాంక గాంధీకి కొన్ని సంవత్సరాల సమయాన్ని ఇవ్వాలనే అప్పుడే ఆమె ప్రధాని పదవికి అర్హురాలో రాదో దేశ ప్రజలు నిర్ణయిస్తారన్నారు.

మోడీతో ప్రియాంక ఢీ

లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వ్యతి రేకంగా ప్రియాంక గాంధీ పోటీ చేస్తారంటూ వారణాసిలో పోస్టర్లు వెలిశాయి. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతానికి కాంగ్రెస్ బాధ్యురాలిగా ప్రియాంక పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో, వారణాసి నుంచే ప్రియాంక పోటీచేయాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. నేరుగా మోడీతో తలపడాలని కోరుతున్నాయి. యూపీతోపాటు పొరుగు రాష్ట్రాలకుచెందిన ఓటర్లు ఈ విధమైన అభిప్రాయం వ్యక్తంచేస్తున్నట్లు సదరు పోస్టర్లు తెలియజెస్తున్నాయి. పోస్టర్‌లో ప్రియాంక గాంధీ చిత్రాన్ని మధ్యభాగంలోనూ, పైవైపున రాహుల్ గాంధీ, అజయ్ రాయ్ (2014లో మోడీ ప్రత్యర్థి) ఫొటోలను ఉంచారు.



వారణాసిలో పోస్టర్లు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ శ్రేణులు

క్రీడాప్రభ

న్యూజిలాండ్- భారత్ మహిళల వన్డే సిరీస్

మంధాన, రోడ్రిగ్స్‌ల జోరు

తొలి వన్డేలో 9 వికెట్ల తేడాతో భారత్ విజయం



మంధాన
105 (104 బంతుల్లో)



జెమీమా రోడ్రిగ్స్
81*



నేపియర్: ఓపెనర్ స్మృతి మంధాన, టీనేజ్ సంచలనం జెమీమా రోడ్రిగ్స్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించడంతో భారత్ న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి వన్డేలో మిథాలీ సేన 9 వికెట్ల తేడాతో గెలుపును అందుకుంది. ఈ విజయంతో సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని పొందింది. కివీస్ జట్టు నిర్దేశించిన 192 పరుగుల లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు మంధాన, రోడ్రిగ్స్ అద్భుతగా ఆడి తొలి వికెట్‌కు 190 పరుగులు జతచేశారు. మంధాన 104 బంతుల్లో 105 పరుగులు చేసి ఔటయింది. మంధాన ఇన్నింగ్స్‌లో తొమ్మిది ఫోర్లు, 3 సిక్సర్లు న్నాయి. రోడ్రిగ్స్ 94బంతుల్లో 81 పరుగులు(9ఫోర్ల సహాయంతో) చేసి నాటౌట్ నిలువగా, మంధాన ఔట్ తర్వాత క్రీజులోకి వచ్చిన దీప్తి శర్మ పరుగులేమీ చేయకుండా నాటౌట్‌గా ఉంది. చివరి పరుగు వైడ్ రూపంలో వచ్చింది. 33 ఓవర్లలో భారత్ 193 పరుగులు చేసి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. టీ20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్లో ఓడి టోర్నీనుంచి విరమించిన తర్వాత భారత్ తొలిసారిగా ఆడుతున్న సిరీస్ ఇది. ఐసీసీ మహిళల క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందుకున్న మంధాన వన్డేల్లో తన నాలుగో సెంచరీని సాధించింది. రోడ్రిగ్స్ తొలిసారిగా వన్డేల్లో అర్ధసెంచరీని పూర్తిచేసుకుంది. మ్యాచ్ అనంతరం మిథాలీ మాట్లాడుతూ.. 'ఇది గొప్ప ప్రారంభం. సిరీస్‌లో సెంచరీ సాధించడం ఆనందంగా ఉంది. ఓపెనింగ్ భాగస్వామ్యం 100పరుగులను మించి చేయడం అద్భుతం. మంధాన తన ఆటతో మిగతా క్రీడాకారిణుల దృష్టిని తనవైపుకు తిప్పుకుంది. 2018 లో కూడా మంధాన బాగా ఆడి ముగించి.. 2019లో కూడా అదే ఊపును కొనసాగిస్తోంది. ఆమె తన ఆటతో మిగతా ఆటగాళ్ల ఆత్మ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది' అని పేర్కొంది. మేము కూడా తప్పిదాలు చేశాము. కొన్ని తేలిక క్యాచ్‌లను పట్టి ఉండాల్సింది. ఈ విషయంలో మేము అతి విశ్వా సంతో లేమని మిథాలీ తెలిపింది. న్యూజిలాండ్‌పై అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం 190 పరుగులు చేయడం ఇదే ప్రథమం. ఇందుకు మంధాన, రోడ్రిగ్స్‌లు కలిసి 32.2 ఓవర్లు ఆడారు. రోడ్రిగ్స్ తన అంతర్జాతీయ కెరియర్లో ఆడుతున్న ఐదో మ్యాచ్ ఇది. పిచ్ బ్యాటింగ్‌కు బాగా సహకరించింది. మేము బంతులను గమనిస్తూ.. బ్యాటింగ్ చేశాము. ఇది గొప్ప ఇన్నింగ్స్ అని మంధాన పేర్కొంది. అంతకు ముందు టాస్ గెలిచిన భారత్, న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్పిన్నర్లు పూనం యాదవ్, ఏక్తా బిష్త్‌లు పకడ్బంధీగా బౌలింగ్ చేస్తూ భారత్‌కు మంచి ఆరంభాన్నిచ్చారు. బిష్త్, యాదవ్‌లు చెరో మూడు వికెట్లు పడగొట్టారు. యాదవ్ న్యూజిలాండ్ మిడిలార్డర్‌ను కుప్పకూల్చడంలో కీలక భూమిక పోషించింది. కివీస్ స్కిప్పర్ అమి సాటర్త్‌వైట్ (31), లారెనడ్ డౌన్ (0), అమీలియా కెర్ (28) వికెట్లను తన 10 ఓవర్ల కోటాలో దక్కించుకుంది. న్యూజిలాండ్ ఓపెనర్లు సూజీ బేట్స్ 36 పరుగులు, సోఫీ డివైన్ 28 పరుగులు చేసి తమ జట్టు స్కోరుకు మంచి ఆరంభాన్నిచ్చారు. డివైన్‌ను దీప్తి శర్మ అద్భుతమైన త్రోతో రనౌట్ చేయడంతో.. న్యూజిలాండ్ వికెట్ల పతనం ప్రారంభమైంది. బేట్స్ 38 బంతుల్లో 28 పరుగులు చేసి దీప్తి శర్మ బౌలింగ్‌లో గోస్వామికి క్యాచిచ్చి వెనుదిరిగింది. మొత్తానికి న్యూజిలాండ్ 48.4 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటయింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు స్మృతి మంధానకు దక్కింది. ఈ సిరీస్‌లో రెండో వన్డే 29న మౌంట్ మాంగన్యూలో జరుగనుంది.

స్కోర్లు

న్యూజిలాండ్: సూజీ బేట్స్ (సి) గోస్వామి (బి) దీప్తి శర్మ 36, సోఫీ డివైన్ రనౌట్(దీప్తి శర్మ) 28, లారెన్ డౌన్ స్టంప్డ్ తాన్యా బాటియా (బి) పూనం యాదవ్ 0, అమీ సాటర్త్‌వైట్ (సి) రోడ్రిగ్స్ (బి) పూనం యాదవ్ 31, అమీలియా కెర్ (సి) హేమలతా (బి) పూనం యాదవ్ 28, మాడి గ్రీన్ (బి) ఎక్తా బిష్త్ 10, బెర్నాండైన్ బెజుడిన్‌హోట్ స్టంప్డ్ తాన్యా బాటియా (బి) దీప్తి శర్మ 9, లెయిగ్ కాస్పెరెక్ (సి) శిఖా పాండే (బి) ఎక్తా బిష్త్ 25, హోలీ హడిల్‌స్టాన్ (సి) హర్మనీ ప్రీత్ కౌర్ (బి) శిఖా పాండే 10, లీ తాహుహు నాటౌట్ 4 ఎక్స్‌ట్రాలు 5, మొత్తం 192 ఆలౌట్ (48.4 ఓవర్లు) **బౌలింగ్:** జులన్ గోస్వామి 10-0-41-0, శిఖ పాండె 7.4-1-38-1, ఎక్తా బిష్త్ 9-0-32-3, దీప్తి శర్మ 10-1-27-2, పూనం యాదవ్ 10-0-42-3, దయాలన్ హేమలత 2-0-11-0

భారత్: జెమీమా రోడ్రిగ్స్ నాటౌట్ 81, స్మృతి మంధాన (సి) తాహుహు (బి) అమీలియా కెర్ 105, దీప్తి శర్మ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 7 మొత్తం 193/1(33 ఓవర్లు)

బౌలింగ్: లీ తాహుహు 5-0-34-0, హన్నా రోవ్ 5-0-29-0, హోలి హడిల్‌స్టాన్ 3-0-22-0, లెయిగ్ కాస్పరెక్ 7-0-37-0, అమీలియా కెర్ 6-0-33-1, సోఫీ డివైన్ 3-0-14-0, అమీ సాటర్త్‌వైట్ 4-0-22-0

పాండ్యా, రాహుల్‌పై
సస్పెన్షన్ ఎత్తివేత



న్యూఢిల్లీ: టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కెఎల్ రాహుల్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు బీసీసీఐ పాలక కమిటీ ప్రకటించింది. గురువారం ఈమేరకు పాలక కమిటీ ఒక ప్రకటనను మీడియా కు విడుదల చేస్తూ.. పాండ్యా సాధ్యమైనంత త్వరలో న్యూజిలాండ్‌కు చేరుకుని భారత జట్టులో కలుస్తాడని పేర్కొంది. కె ఎల్ రాహుల్ దేశీయ క్రికెట్ లేదా ఇండియా ఎ జట్టు తరపున ఆడుతూ ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడే సిరీస్‌లో పాల్గొంటాడని తెలిపింది. రెండు వారాల క్రితం ఆస్ట్రేలియా టూర్లో ఉన్నప్పుడు పాండ్యా, రాహుల్‌లు కాఫీ విత్ కరణ్ టీవీ షోలో పాల్గొంటూ... మహిళలతో సంబంధాలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనితో సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తడంతో.. బీసీసీఐ వీరిపై సస్పెన్షన్ విధించి విచారణకు ఆదేశిస్తూ భారత్‌కు తిప్పి పంపింది.

ఈ అంశంపై కొత్త అమికస్ క్యూరీ పీఎస్. నరసింహాతో సంప్రదించిన పాలక కమిటీ తన నిర్ణయాన్ని గురువారం వెల్లడించింది. జనవరి 11న వీరిద్దరిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడమేకాక, వారిపై మోపిన ఆరోపణలనుంచి విముక్తం చేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. ఈ వివాదంపై విచారణ కోసం సుప్రీంకోర్టు అంబుడ్స్‌మన్ నియమించాల్సి ఉంది. దీనిపై సుప్రీం కోర్టు ఫిబ్రవరి 5న నిర్ణయం తీసుకునే వీలుంది. వీరిపై సస్పెన్షన్ ఎత్తివేసేందుకు బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా ప్రతిపాదించాడు. ఈ విషయంలో స్పెషల్ జనరల్ మీటింగ్(ఎస్‌జీఎం) ఏర్పాటును వ్యతిరేకిస్తూ...రాహుల్, పాండ్యాలను క్రికెట్ బరిలోకి దించడం తప్పనిసరి.. అదే సమయంలో వారిపై విచారణ కూడా కొనసాగించవచ్చని తెలిపాడు. ఇంగ్లండ్ ఆల్ రౌండర్లలో ఒకడైన బెన్ స్టోక్ పబ్ వెలుపల చేసిన హంగామాతో విచారణను ఎదుర్కొంటూ జట్టులో కొనసాగుతున్న విషయాన్ని ఉదహరించాడు. కర్నాటక రంజీ ఫైనల్లో చోటు సంపాదిస్తే.. 26 ఏళ్ల రాహుల్, మయాంక్ అగర్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి.

జోహన్ బోథా క్రికెట్‌కు గుడ్‌బై



హోబర్ట్: మాజీ దక్షిణాఫ్రికా ఆల్ రౌండర్ జోహన్ బోథా క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. గురువారం ఈమేరకు బోథా ఒక ప్రకటన చేశాడు. క్రికెట్ అన్ని ఫార్మాట్ల నుంచి రిటైరవుతున్నట్లు తన నిర్ణయం ఈరోజు నుంచే వర్తిస్తుందని తెలిపాడు. బోథా సభ్యుడిగా ఉన్న ఆస్ట్రేలియా టీ20 లీగ్ జట్టైన హోబర్ట్ హరికేన్స్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. 36 ఏళ్ల బోథా 2016లో ఆస్ట్రేలియన్ పౌరసత్వాన్ని పొందాడు. బుధవారం సిడ్నీ సిక్సర్స్‌తో ఆడిన మ్యాచ్‌లో బోథా ఒక్క వికెట్‌ను కూడా దక్కించుకోలేకపోయాడు. ఈ సీజన్లో హరికేన్స్ జట్టు తరఫున బోథా 10 మ్యాచులు ఆడాడు. 2005 నుంచి 2012వరకు దక్షిణాఫ్రికా తరపున బోథా ఐదు టెస్టులు, 78 వన్డే మ్యాచ్‌లు, 40 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. బోథా దక్షిణాఫ్రికా జట్టు ఆడిన 10 వన్డే మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2009లో ఆస్ట్రేలియాను 4-1తో ఓడించిన తర్వాత తన జట్టును నెంబర్ 1 జట్టు స్థానానికి తీసుకుపోయాడు.

రంజీ సెమీఫైనల్స్

వైనాడ్: రంజీ సెమీ ఫైనల్స్ మ్యాచులు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి సెమీ ఫైనల్లో ఆడుతున్న విదర్భ జట్టు టాస్ గెలిచి కేరళను బ్యాటింగ్ చేయాలని కోరింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే ఆలౌట్ కాగా, అనంతరం విదర్భ తొలి ఇన్నింగ్స్ ప్రారంభించి తొలిరోజు ఆట ముగిసేసమయానికి 5 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. విదర్భ ఆటగాడు ఉమేష్ యాదవ్ 48 పరుగులకు 7 వికెట్లు తీశాడు. కర్నాటక, సౌరాష్ట్ర మధ్య జరుగుతున్న రెండో సెమీఫైనల్లో కర్నాటక టాస్ గెలిచి బ్యాటింగ్ చేస్తూ ఆటముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. సౌరాష్ట్ర బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్ 4, కమలేష్ మక్వానా 3, చేతన్ సకరియా, ధర్మేంద్రసింగ్ జడెజా చెరి ఒక వికెట్‌ను దక్కించుకున్నాడు.

పాక్ టూర్‌కు
విండీస్ మహిళా జట్టు కెప్టెన్ టేలర్ దూరం



సెయింట్ జాన్స్(అంటిగ్వా, బార్బుడా): వెస్టిండీస్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ స్టెఫానీ టేలర్ పాకిస్తాన్‌లో జరిగే మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించింది. ఈ నెల 31న కరాచి వేదికగా ప్రారంభం కానున్న ఈ సిరీస్‌లో భద్రతా కారణాల దృష్ట్యా టేలర్ ఆడటం లేదని పేర్కొంది. మిగతా రెండు మ్యాచ్‌లు కూడా ఫిబ్రవరి 1, ఫిబ్రవరి 3న కరాచిలోనే జరుగనున్నాయి. మహిళల క్రికెట్లో స్టార్‌గా రాణిస్తున్న టేలర్ ఈ టీ 20 సిరీస్ అనంతరం యూఏఈలో పాక్‌తో ఆడే వన్డే సిరీస్‌కోసం తిరిగి జట్టులో కలుస్తుంది. గురువారం టేలర్ నిర్ణయాన్ని క్రికెట్ వెస్టిండీస్ బోర్డు ధ్రువీకరించించింది. పాకిస్తాన్ క్రికెట్ కంట్రోల్ బోర్డ్, స్వతంత్ర భద్రతా సంస్థ నివేదికల మేరకు టేలర్ ఈ నిర్ణయం తీసుకుందని క్రికెట్ వెస్టిండీస్ తెలిపింది. 2009లో లాహోర్‌లో శ్రీలంక క్రికెట్ జట్టు ప్రయాణిస్తున్న బస్‌పై దాడి అనంతరం పాకిస్తాన్‌లో వేళ్ల మీద లెక్కపెట్టే మ్యాచులు మాత్రమే జరిగా యి. ఈ ఘటనలో ఆరుగురు పోలీసు అధికారులు, ఇద్దరు పౌరులు మృతి చెందగా, శ్రీలంక జట్టులోని ఆరుగురు సభ్యులకు గాయాలయ్యాయి.

ఆస్ట్రేలియా ఓపెన్
ఫైనల్లో ఒసాకా, క్విటోవా







మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన జపాన్ స్టార్ నవోమి ఒసాకా, చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి పెట్రా క్విటోవాలు ఫైనల్స్‌కు చేరారు. శనివారం జరిగే టైటిల్ పోరులో వీరిద్దరు అమీతుమీకి సిద్ధమయ్యారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీ ఫైనల్లో 21 ఏళ్ల ఒసాకా చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఏడో సీడెడ్ క్రీడాకారిణి కరోలినా ప్లిస్కోవాను 6-2, 4-6, 6-4 తేడాతో ఓడించి రెండో సారి గ్రాండ్ స్లామ్ ఫైనల్‌కు చేరింది. ఒసాకా తొలిసారిగా యూఎస్ ఓపెన్ ఫైనల్లోకి చేరి టైటిల్ విజేతగా నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగిన సెరెనా విలియమ్స్‌ను మట్టికరిపించిన ప్లిస్కోవా తొలి సెట్లో ఒసాకా ముందు చేతులెత్తేసింది. రెండో సెట్లో పుంజుకుని గెలుపును అందుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్లో ఇరువురు నువ్వానేనా అంటూ తలపడ్డారు. చివరికి ఒసా కాదే పైచేయి అయింది. నేను అనుకున్నట్టే పోరు హోరాహోరీగా సాగింది. మూడో సెట్లో నా శక్తినంతా ఏకం చేసి ఆడి మూడో సెట్‌ను సొంతం చేసుకుని మ్యాచ్ గెలిచాను అని మ్యాచ్ అనంతరం ఒసాకా చెప్పింది. ఒసాకా టైటిల్ గెలిస్తే.. వరుసగా రెండు గ్రాండ్ స్లామ్‌లు గెలుచుకున్నట్లవుతుంది. 2015లో సెరెనా విలియమ్స్ వరుసగా యూఎస్, ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లను సొంతం చేసుకుంది. అంతేకాక, ప్రస్తుతం వరల్డ్ నెంబర్ వన్‌గా ఉన్న రుమేనియా క్రీడాకారిణి సిమోనా హలెప్ స్థానాన్ని కైవసం చేసుకుంటుంది. రెండో సెమీ ఫైనల్లో ఎనిమిదో సీడ్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రా క్విటోవా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించింది. క్విటోవా యూఎస్ క్రీడాకారిణి డేనియల్‌ఈ కోలిన్స్‌ను 7-6(7/2), 6-0, తేడాతో ఓడించింది. 2016లో క్విటోవా కత్తి దాడికి గురైన తర్వాత గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోకి చేరడం ఇదే ప్రథమం. మునుపటి ఫామ్‌ను పొందడానికి ప్రయత్నిస్తున్న క్విటోవా తొలిసెట్లో పోరాడి గెలిచింది. స్కోరు సమానం కావడంతో టై బ్రేకర్ ద్వారా సెట్‌ను సొంతం చేసుకుంది. అనంతరం రెండో సెట్లో ప్రత్యర్థి కోలిన్స్‌కు ఏమాత్రం అవకాశమివ్వకుండా 6-0తో విజయం సాధించి తన ఆధిక్యతను చాటింది.

పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాదల్

వరల్డ్ నెంబర్ 2 స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ గ్రీక్ క్రీడాకారుడు 14వ సీడెడ్ స్టెఫానోస్ టిసిటిసిపాస్‌ను ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. గురువారం జరిగిన సెమీఫైనల్-1లో నాదల్ 6-2, 6-4, 6-0తేడాతో స్టెఫానోస్ పై గెలిచాడు. స్టెఫానోస్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్‌ను ఓడించినప్పటికి.. నాదల్ చేతిలో ఖంగుతిన్నాడు. గంటా 46 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో నాదల్ అన్ని సెట్లలోను ఆధిక్యాన్ని చాటాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన నాదల్ వరుసగా 63 గేముల్లో పాయింట్లు సాధించడమే కాక, సర్వీస్‌ను కోల్పో లేదు. ఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ ఆటగాడు సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ లేదా ఫ్రాన్స్‌కు చెందిన లూకాస్ పోయులీతో తలపడతాడు. జకోవిచ్, లూకాస్ మధ్య నేడు జరిగే రెండో సెమీ ఫైనల్లో రెండో బెర్త్ ఖరారవుతుంది.

క్వార్టర్ ఫైనల్లో
సింధు, సైనా, శ్రీకాంత్







జకార్తా: స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ పోటీలో రెండో సీడెడ్ షట్లర్ సింధు జార్జియాకు చెందిన మారిస్కా టున్‌జాంగ్‌ను 23-21, 21-7 తేడాతో చిత్తు చేసింది. 37 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో పోరు హోరాహోరీగా సాగి స్కోరు సమానమైంది. అనంతరం సింధు వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సింధు పూర్తి ఆధిక్యతను ప్రదర్శించి తేలికగా విజయం సాధించి గేమ్, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సింధు స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్‌తో తలపడతుంది. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ ఇండోనేషియాకు చెందిన ఫిత్రియానిపై 21-17, 21-15తేడాతో విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడెడ్‌గా బరిలోకి దిగిన కిదాంబి శ్రీకాంత్ ఆసియా క్రీడల కాంస్య పతక విజేత జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటోను 21-14, 21-9 తేడాతో ఓడించాడు. గత వారంలో జరిగిన మలేసియా మాస్టర్స్‌లో కూడా కిదాంబి క్వార్టర్ ఫైనల్ చేరి ఓటమితో వెనుదిరిగాడు. ఈ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఇండోనేసియాకు చెందిన ఆసియా క్రీడల చాంపియన్ జొనాథన్ క్రిస్టీ లేదా చైనాకు చెందిన అల్ ఇంగ్లండ్ చాంపియన్ షి యూకితో తలపడనున్నాడు. ప్రారంభ గేమ్‌లో శ్రీకాంత్ 2-5తో వెనకబడ్డప్పటికి.. అనంతరం ర్యాలీగా ఆడుతూ.. 11-8 లీడ్‌ను పొంది అదే ఊపులో గేమ్‌ను గెలుచుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్ పూర్తి ఆధిక్యాన్ని చాటుతూ.. 21-9తో సొంతం చేసుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో మను అత్రి, బి సుమీత్ రెడ్డి జోడీ 14-21, 21-17, 10-21 తేడాతో డెన్మార్క్‌కు చెందిన కిమ్ అస్ట్రుప్, అండర్స్ స్కరూప్ రాసముస్సేన్‌ల చేతిలో ఓడింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
Lively Interaction For Ever
లైఫ్ I
శుక్రవారం 25 జనవరి 2019

సమాజానికే దారి చూపు ధీరులు!



ఎన్‌సిసి డే సందర్భంగా మార్చ్ పాస్ట్

శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న నేత్ర విద్యాలయం

అన్నింటా రాణిస్తూ అబ్బురపరుస్తున్న విద్యార్థులు

వారి చేతివేళ్లకు కళ్లుంటాయి.. చెవులకు చూపుంటుంది....గుండెల నిండా ఆత్మస్థైర్యం తొణికిసలాడుతుంది..శరీరంలోని అణువణువూ... ఉత్సాహం పరుగులు పెడుతుంది.. గెలుపు కోసం అలుపెరుగని పోరాటం వారి నైజం....మనోనేత్రంతో సమస్త విశ్వాన్ని ఆకళింపు చేసుకునే ప్రతిభాపాటవాలు వారి సొంతం...అందుకే ఏ రంగంలోనైనా...లక్ష్యాన్ని ఛేదించి గమ్యాన్ని ముద్దాడుతారు....ఇది అక్షర సత్యం! ఇదే..జీవాశ్రమంలోని నేత్ర విద్యాలయానికి వెళ్లి...అక్కడి విద్యార్థులతో మమేకమైతే బోధపడే నిజం!!

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిలో శంషాబాద్ దాటిన తర్వాత వచ్చే ముచ్చింతల్ పరిధిలోని శ్రీరామ్ నగర్‌లో జీవాశ్రమం ఉంది. ఆధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి స్వీయపర్యవేక్షణలో నిర్వహించబడుతున్న జీవాశ్రమం..ఆధ్యాత్మిక, సేవారంగాల మేళవింపు. 53ఎకరాల సువిశాలమైన ఆశ్రమ ప్రాంగణంలో అంధులకు ఉచిత విద్యాగంధం పరిమళాలు అందిస్తుందీ నేత్ర విద్యాలయ. విద్యాలయానికి వెళ్లేందుకు .. ఆశ్రమంలోకి అడుగు పెట్టగానే మొదట గోశాల స్వాగతం పలుకుతుంది. గోమాతల చల్లని చూపులు ఆస్వాదిస్తూ.. ముందుకు వెళితే... ఎడమవైపున శరవేగంగా నిర్మాణం జరుగుతున్న శ్రీ రామానుజ సహస్రాబ్ది -సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం ....అక్కడ 150అడుగుల ఎత్తైన విగ్రహం దర్శనమిస్తుంది. అలా లోనికి వెళితే మూడంతస్తుల్లో నిర్మించిన దివ్యసాకేతం ఆధ్యాత్మిక వీచికలు ప్రసరిస్తుంది. దానిని దాటుకుని ఇరువైపులా మొక్కలతో నిండిన విశాలమైన రోడ్డు వెంట ముందుకు వెళితే.. నిరాడంబరంగా, పచ్చనిచెట్ల నడుమ చినజీయర్ స్వామి కుటీరం..దానికి దగ్గర్లో ఆహ్లాదకరమైన,ఆధ్యాత్మిక వాతావరణంలో ఉంటుంది నేత్రవిద్యాలయగా పిలువబడే చూపులేని విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల. కులాతీతమైన వేదాంత గురుకుల పాఠశాల, అలోపతి,ఆయుర్వేద వైద్యం అందించే జిమ్స్ ఆస్పత్రి, హోమియోపతి కళాశాలలు కూడా జీవాశ్రమం ఆధ్వర్యంలో



నాటి వార్ధా కలెక్టర్‌తో చెస్ ఆడుతున్న నవీన్

నిర్వహించబడుతున్నాయి. ప్రభుత్వాలు, కార్పొరేటు సంస్థలు కూడా నిర్వహించని రీతిలో స్వామి ఆధ్వర్యంలో కళాశాల నిర్వహిస్తున్న తీరు దేశం దృష్టిని ఆకర్షిస్తోంది. పాలకులకు,కార్పొరేట్ సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

అంధ విద్యార్థులకు అమ్మ ఒడి

వివరాల్లోకి వెళితే....ప్రోత్సాహం లభిస్తే...మామూలు విద్యార్థులకు దీటుగా..అంధవిద్యార్థులు రాణిస్తారని, సమాజానికి ఉద్బోధించే శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి మానస పుత్రిక ఈ నేత్ర విద్యాలయం! చూపులేకపోవడం అనేది శారీరక లోపమే తప్పు..ప్రగతినిరోధకం కాదన్న నిజాన్ని ఇది లోకానికి చాటుతోంది. దీని మూలాలు ఏపీలో ఉన్నాయి. 2001లో విశాఖపట్నంలో విజువల్లీ డిజేబుల్డ్ స్టూడెంట్స్ కోసం ప్రాథమిక,మాధ్యమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. 2007లో ముచ్చింతల్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో ఆంగ్లమాధ్యమంలో ఇంటర్,డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి, కార్పొరేట్ స్థాయిలో అధునాతన బోధనా పద్ధతులను ప్రవేశపెట్టారు. డిగ్రీలో బీఏ,బీకాం.. ఇంటర్‌లో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల మానసికోల్లాసం కోసం సంగీతం,నృత్యం, గానం నేర్పిస్తున్నారు. శారీరకోల్లాసం కోసం చెస్,క్యారమ్స్, స్కిప్పింగ్ లాంటి ఇన్‌డోర్ గేమ్స్, క్రికెట్, కబడ్డీ, షాట్‌పుట్, డిస్క్ త్రో తదితర ఔట్ డోర్ గేమ్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. మొదట 16 మందితో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రస్తుతం వివిధ ప్రాంతాలకు చెందిన 176 మంది విద్యార్జన చేస్తున్నారు. ఇక్కడ చదువుకునే వారికి పుస్తకాలు,ల్యాప్‌టాప్‌లు, భోజనం, డ్రెస్సులు..ఇలా అన్నీ ఉచితమే. ఒక్కమాటలో చెప్పాలంటే నేత్ర విద్యాలయ వారి పాలిటి అమ్మఒడి!

ప్రపంచంలోనే ప్రథమం

అంధులకు ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యాబోధన అనేది ప్రపంచంలోనే మొదటిసారిగా నేత్ర విద్యాలయంలో ప్రవేశపెట్టబడింది. అందుకోసం యాజమాన్యం జాస్ అనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయించింది. కరిక్యులమ్, కో-కరిక్యులమ్ యాక్టివిటీస్‌కు సమప్రాధాన్యత ఇస్తూ...అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతోంది. వృత్తి విద్యాకోర్సుల్లో నిష్ణాతులైనవారిచే శిక్షణ ఇప్పిస్తున్నారు. వార్షిక పరీక్షలు ల్యాప్‌ట్యాప్ ద్వారా రాయడం అనేది దేశంలోనే ప్రథమం. అంతేకాదు వీరు బోర్డు పరీక్షలతో పాటు, ఉస్మానియా యూనివర్సిటీ స్థాయి ప్రవేశ పరీక్షలు సైతం ల్యాప్‌ట్యాప్ ద్వారానే రాస్తారు. ల్యాప్‌ట్యాప్ ముందు కూర్చుంటే ఈ విద్యార్థుల చేతివేళ్లు కీ బోర్డుపై నాట్యం చేస్తాయనడం అతిశయోక్తి కాదు.

జాతీయ స్థాయిలో రాణింపు

నేత్ర విద్యాలయ విద్యార్థులు చదువులోనే కాదు, క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. డిసెంబర్ 2018లో ఢిల్లీలో ఇండియన్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోషియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో ఇంటర్ విద్యార్థిని అనూష..11సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించి..బంగారు పతకం సాధించి..జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించింది. ఈ పోటీల్లో పాల్గొన్న నేత్ర విద్యాలయ విద్యార్థులు..పరుగు పందెం,షాట్‌పుట్, డిస్క్‌త్రో పోటీల్లో కలిపి ఐదు గోల్డ్, ఐదు సిల్వర్,ఐదు బ్రాంజ్ మెడల్స్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. మహారాష్ట్రలోని వార్ధాలో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆడిన స్నేహపూర్వక మ్యాచ్‌లో కళాశాలకు చెందిన నవీన్ అనే విద్యార్థి వార్ధా కలెక్టర్‌ను ఓడించి అందరిచేత ఔరా అనిపించారు. ఈ ఏడాది జనవరి 4న హైదరాబాద్- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వరల్డ్ బ్రెయిలీ డే ఉత్సవాలలో కళాశాల విద్యార్థుల జానపద, శాస్త్రీయ నృత్యాలు, గ్రూప్ సాంగ్స్ ప్రేక్షకులను అబ్బురపరిచాయి. ముఖ్యంగా భగవద్గీత మీద విద్యార్థులు ప్రదర్శించిన బ్యాలే మహామహుల ప్రశంసలు అందుకుంది. అంతేకాదు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు మార్చ్ పాస్ట్‌కు ఎంపిక కావడం వారి ప్రతిభకు తార్కాణం.

-చొల్లేటి వేంకటేశ్వరా చారి



మంచి చెడు చూడలేకపోవడమే అంధత్వం

-శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి

చూపులేక పోవడం కాదు.. కళ్లుండి చూడలేక పోవడమే అసలైన గుడ్డితనమని శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఉద్బోధించారు. సమాజంలో ..మన చుట్టూ జరుగుతున్న మంచి,చెడులను చూస్తూ స్పందించని వారే నిజమైన గుడ్డివారని, చూపులేని వారు గుడ్డివాళ్లకాదని అన్నారు. చూపులేక పోవడం అనేది శరీర లోపం మాత్రమే.. అందుకే చూపులేని వాళ్లను గుడ్డివాళ్లు అనడం సరైంది కాదని, వారికి సరైన ప్రోత్సాహం లభిస్తే..మామూలు మనుషులకంటే మిన్నగా రాణిస్తారని అన్నారు.

గణతంత్ర వేడుకల్లో మార్చ్ పాస్ట్

- కృష్ణకుమారి, కో-ఆర్డినేటర్



చూపులేదన్న శారీరక లోటు తప్ప....అంధవిద్యార్థులు ఇతరులకు ఏమాత్రం తీసిపోరని నేత్ర విద్యాలయ కోఆర్డినేటర్ కృష్ణకుమారి అన్నారు. తెలంగాణ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో 25మంది అబ్బాయిలు, 25మంది అమ్మాయిలు పెరేడ్ నిర్వహించనున్నారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల16 నుంచి వింగ్ కమాండర్ శ్రీనివాసులు ఆధ్యర్యంలో శిక్షణ తీసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులలోని జిజ్ఞాసను, ప్రతిభను గుర్తించిన ఆర్టీసీ ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించిందని, ఉదయం పరేడ్ గ్రౌండ్‌కు తీసుకెళ్లి,సాయంత్రం ఆశ్రమానికి తీసుకొస్తున్నారని అన్నారు. గతేడాది ఆగస్టు 15న మా ఆశ్రమంలోని పెరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించగా, చినజీయర్ స్వామి గౌరవవందనం స్వీకరించారని చెప్పారు. దానిని వీడియో తీసి ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కమోడోర్ ఎన్ఎన్ రెడ్డికి పంపానని చెప్పారు. అదిచూసిన రెడ్డి ప్రశంసించారన్నారు. ఆ తర్వాత తనను పిలిపించి....నవంబర్ 25న జరిగిన ఎన్‌సీసీడేరోజు ఎన్‌సీసీకేడెట్‌లతో పాటు ...పాల్గొనేందుకు అవకాశం ఇచ్చారని చెప్పారు. ఆ సందర్భంగా విద్యాలయ విద్యార్థులు రెడ్డితో పాటు పలువురు అధికారుల ప్రశంసలు అందుకోవడంతో.. అంధులు ఏ రంగంలోనైనా రాణిస్తారన్న ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. వారి ప్రతిభను లోకానికి చాటాలన్న తపనతో..గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆయన రికమండేషన్ మేరకు నేత్ర విద్యాలయ విద్యార్థులకు ఈసారి రిపబ్లిక్ డే వేడుకల్లో మార్చ్ పాస్ట్ నిర్వహించేందుకు అవకాశం వచ్చిందని, మా విద్యాలయం స్టాఫ్ సహకారం, ఉన్నత అధికారులు, ప్రభుత్వ ప్రోత్సాహం దీనికి కారణమని స్పష్టంచేశారు.




ధ్వని ఆధారంగా బంతిని గుర్తిస్తాం

ప్రేమ్ కుమార్, బి.కాం ఫైనలియర్

అందరిలాగే మేమూ క్రికెట్ ఆడుతామని, పరుగులు చేస్తామని బి.కాం ఫైనలియర్ చదువుతున్న ప్రేమ్ కుమార్ స్పష్టం చేసారు. జనవరి 4న బ్రెయిలీ డే రోజు అనంతపురంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో తాము కప్ సాధించామంటూ....విజయనగరంజిల్లా బొబ్బిలికి చెందిన ప్రేమ్ ..మేమూ ఏదైనా సాధించగలం అనే ధీమా వ్యక్తం చేశారు. మామూలు క్రికెట్‌కు, మా క్రికెట్‌కు బంతిలో మాత్రమే తేడా ఉంటుందని, మిగతా నిబంధనలన్నీ మామూలుగానే ఉంటాయన్నారు. సాధారణ క్రికెట్‌లో బంతిని పైకి విసురుతారని, కాని మేము మాత్రం బంతిని నేల మీదుగా విసురుతామన్నారు. కాకపోతే బ్లైండ్స్ కు నిర్వహించే క్రికెట్ బాల్‌లో ఇనుప చక్రాలు ఉంటాయని, దానిని విసిరినప్పుడు వాటివల్ల వచ్చే శబ్దం ఆధారంగా బంతిని కొడతామని చెప్పారు. టీంలో పూర్తిగా చూపు కనిపించని వాళ్లు, పాక్షికంగా కనిపించేవాళ్లు 4గురు చొప్పున,పాక్షికంగా కనిపించే వారికన్నా కొంత మెరుగ్గా కనిపించేవాళ్లు ముగ్గురు ఉంటారని, పూర్తిగా కంటిచూపు లేనివారు బ్యాటింగ్ మాత్రమే చేస్తారని, మిగతావారు రన్‌లు చేస్తారని చెప్పారు. మీకు డౌట్ ఉంటే రండి గ్రౌండ్‌లో ఆడి చూపిస్తామంటూ ..మేము అందరిలానే క్రికెట్ ఆడగలమన్న ఆత్మవిశ్వాసాన్ని ప్రేమ్ కుమార్ ప్రదర్శించారు.

తపన ఉంటే దేనినైనా సాధించవచ్చు

- దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి



సాధించాలనే తపన, ప్రోత్సాహం, చక్కని వ్యవస్థ ఉంటే సాధించలేనిదంటూ ఏదీ లేదని జీవాశ్రమానికి చెందిన దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి ఉద్బోధించారు. త్రిదండి చినజీయర్ స్వామి సంకల్పం వల్ల నేత్ర విద్యాలయమనే చక్కని వ్యవస్థ ఏర్పాటైందని, ఆయన ప్రోత్సాహంతో రాణిస్తోందని, చూపులేని విద్యార్థులకు మహదావకాశం లభించిందని అన్నారు. చూపు లేకపోవడమనేది శరీర లోపమే అన్నారు. కృషి,పట్టుదల,సాధించగలం అనే విశ్వాసం ఉంటే ఏ లోపాలనైనా జయించవచ్చని, నేత్ర విద్యాలయ విద్యార్థులు రుజువుచేస్తున్నారని, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. చూపులేకపోయినా, మామూలు విద్యార్థులకు దీటుగా అన్నిరంగాల్లో వాళ్లు రాణించడం ఎంతో ముదావహం అన్నారు. అందరూ బాగుండి, అందరికి సమానమైన అవకాశాలు దక్కినప్పుడే సమాజం బాగుంటుందని స్పష్టం చేశారు.

సమాజానికే స్ఫూర్తిదాయకం

- సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్



కృషి,పట్టుదల ఉంటే లక్ష్యసాధనకు అవయవ లోపం అడ్డురాదని నేత్ర విద్యాలయ విద్యార్థులు నిరూపిస్తున్నారని, సమాజానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి చెప్పారు. తాను డిఈవోగా పనిచేసి రిటైర్డ్ అయి ప్రస్తుతం ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నానని చెప్పిన రెడ్డి, సాధారణ విద్యార్థుల కంటే ..అంధవిద్యార్థుల్లోనే తనకు ఎక్కువ ప్రతిభ కనిపిస్తుందన్నారు. ప్రోత్సహించే వారుంటే.. ఏదైనా సాధించి తీరుతారన్నారు. ఇంటర్, డిగ్రీ కలిపి 176 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని చెప్పారు. క్రీడల్లో,సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు రాణిస్తున్నారని, జాతీయ స్థాయిలో అవార్డులు,రివార్డులు అందుకుంటున్నారని చెప్పారు. ఇప్పటి వరకు నేత్రవిద్యాలయంలో చదువుకుని,వివిధ వృత్తి కోర్సుల్లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు 60 మందికిపైగా , నేవీ,ఎయిర్‌ఫోర్స్, విద్యా,బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాల్లో చేరారని చెప్పారు. వరల్డ్ బ్రెయిలీ డే సందర్భంగా సమర్థనామ్ ట్రస్టు సికింద్రాబాద్‌లో నిర్వహించిన రీడింగ్,రైటింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు తమ విద్యార్థులు నాగచతుర, మధు, రాజేశ్వరికి దక్కాయన్నారు. వార్ధాలో నిర్వహించిన చెస్ పోటీల్లో తమ విద్యార్థులు చక్కని ప్రతిభను కనబరిచారన్నారు. స్నేహపూర్వకంగా ఆడిన చెస్‌లో వార్ధా కలెక్టర్ కె.నవీన్ గారిని ఓడించారని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 10మందికిపైగా విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులో సీట్లు సాధించారని చెప్పారు. మా విద్యార్థి ప్రేమ్ స్వరూప్ ఐఐఎం రాయిపూర్‌లో ఎంబీఏలో సీటు సాధించారని, ప్రస్తుతంఫైనల్ ఇయర్ చదువుతున్నారని అన్నారు.

స్వచ్ఛతకు మారు పేరు

- జగదేవి పాటిల్ , కంప్యూటర్ టీచర్



అంధవిద్యార్థులు స్వచ్ఛతకు మారు పేరని నేత్రవిద్యాలయ కంప్యూ టర్ టీచర్ జగదేవి పాటిల్ అభిప్రాయపడ్డారు. బెంగళూరుకు చెందిన జగదేవి మాట్లాడుతూ చూపు ఉన్న వాళ్లు ఎదుటివారిని బట్టి మాట్లాడుతారని, కాని అంధులకు అలాంటిది ఏదీ ఉండదనినిర్మలమైన మనస్సుతో మాట్లాడతారన్నారు. కాలేజ్‌లో చేరిన మొదటి రోజు వీళ్లకు ఎలా చెప్పాలా అని భయపడ్డానని,కానీ.. చూపు ఉన్నవారికంటే వీళ్లే కంప్యూటర్ వాడడంలో షార్ప్ గా ఉంటున్నారన్నారు. కొద్ది రోజులు వీళ్లతో కలిసి ఉంటే..ఆ తర్వాత వాళ్లు లేకుండా ఉండలేమన్నారు.అంతటి ప్రేమ చూపిస్తారని, వాళ్లది అమలినమైన ప్రేమ అన్నారు. అందుకే ప్రస్తుతం ఒక్కరోజు కూడా వీరిని చూడకుండా ఉండలేకపోతున్నానని చెప్పారు. చాలా చలాకిగా ఉంటూ అందరితో కలిసిపోయే మనస్తత్వం వీరి సొంతమన్నారు. చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న నేత్ర విద్యాలయలో ఉద్యోగం చేయడం..నిజంగా తన అదృష్టమని చెప్పారు. సమాజ ప్రోత్సాహం లభిస్తే...సాధారణ విద్యార్థుల కంటే రెట్టింపుగా రాణిస్తారని చెప్పారు.

సొంతబిడ్డల్లా చూసుకుంటారు

హర్షిత, సాయిరాం.. ఇంటర్ సెకండ్ ఇయర్




విద్యాలయంలోని లెక్చరర్లు తమను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు అంకుల్ అంటూ...ఇంటర్ సెకండియర్ చదువుతున్న,అనంతపురంజిల్లా పెనుగొండకు చెందిన హర్షిత, శ్రీకాకుళానికి చెందిన సాయిరాం అనే విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.ఏనాడు లెక్చరర్లు తమను కోపడిందిలేదన్నారు. మాలోని టాలెంట్‌ను గుర్తించి.. ఆ దిశలో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. అందరిలాగే మేము ల్యాప్‌టాప్‌ను ఉపయోగిస్తామని చెప్పిన హర్షిత,సాయిరాంలు ...అంకుల్ మీరు ఏదైనా చెప్పండి,మేము కంపోజ్ చేసి చూపిస్తామంటూ....రెట్టించిన ఉత్సాహంతో ల్యాప్‌టాప్ కీబోర్డుపై వేళ్లను నాట్యం చేయించారు. మాకోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తయారు చేయించారని అన్నారు. కీబోర్డ్ మీద-జే-ఎఫ్- లెటర్స్ బటన్ పైన ఉబ్బెత్తుబొడిప ఉంటుందని..వాటిని గుర్తించి మా చూపుడు వేళ్లు వాటిని మీద పెట్టగానే మిగతా వేళ్లు పొజిషన్‌లోకి వస్తాయని ఆ తర్వాత మాకు కావాల్సింది, గురువులు చెప్పింది కంపోజ్ చేస్తామన్నారు. వాళ్లు చెబుతున్నప్పుడు వారిమాటల్లో... .మేమూ మీకు ఏమాత్రం తీసిపోము అంకుల్ అని చెప్పినట్లు అనిపించింది. కల్మషంలేని వారి మనో నేత్రానికి వారి మాటలు అద్దం పట్టాయి.

సచ్చిదానందయోగం



> మనసు, దాని కార్యకలాపాలు, కర్మ వలన కలిగే అనుభవం, ఆనందం...ఇదంతా భావ పారవశ్యమే. వీటన్నింటిని దాటి, సర్వేంద్రియాలు తమ తమ కార్యకలాపాలు వదలి శూన్య వృత్తులతో మనసు నిశ్చల, నిర్మల స్థితిలో నిలకడ చెంది ఉండటం అందునా జాగ్రదవస్థలో! అదే సహజ సమాధి.

బహిర్ముఖమైన మనసు సాధన ద్వారా, స్పృహతో స్వస్థానమైన హృదయంతో లయమయే స్థితే సమాధి. లయం కావటమంటే నిశ్చింతగా ఉండటం. ఆ స్థితి ఏర్పడినపుడు సంకల్పాలంటూ ఉండవు. కానీ మనసు పూర్ణంగా లయం కానందున తన ఉనికిని కోల్పోదు. అంటే మనో హృదయాలు పూర్తిగా ఏకం కాని కారణంగా ఆ స్థితి నిర్వికల్పమవుతుందేమో కాని తిరిగి ప్రయత్నించడం ప్రారంభం కాగానే యధాపూర్వ స్థితిని పొందుతుంది. యోగంలో ఇది ఒక భాగమే. అందరూ పొందే తాత్కాలిక స్థితే ఇది. కావలసింది. పొందవలసింది సహజ సమాధి!

దీనిని పొందటం ఎలా? ఎవరి మనసు, తన మూలమైన హృదయంతో లయమై నిలకడ చెంది, రాకపోకలెరుగని నిరామయ స్థితిని పొంది, కదలక, మెదలక ఎరుగని స్థితిలో ఉంటుందో, అదే సహజ సమాధి. ఇది కానిదంతా క్రియా యోగమే. అంటే ప్రయత్నపూర్వకంగా సాగి, ఆగినట్లున్న స్థితే. క్రియ లేని నిశ్చల స్థితే సమాధి

ఎరుక లేకుండా మనసు హృదయంలో లయమైనపుడు ఏర్పడేది, నిద్ర!

ఎరుక కలిగి, మనోలయం జరిగినపుడున్న జాగ్రదవస్థే సమాధి. ఈ స్థితిలో మనసుకు చలనం ఉండదు. ప్రాణ స్పందనలు మంద్ర స్థాయిలో ఉంటయ్. దేహాత్మ భావం ఉండదు. దేనినీ పట్టించుకోని స్థితి ఉంటుంది.

పాతంజలిక యోగం ఆనంద పారవశ్యాన్ని చరమ స్థాయి అంటుంది. యోగాభ్యాసం వలన కలిగిన మహోన్నత భావనా భూమికే తప్ప, అది సహజ సమాధి కాదు.

మనసు, దాని కార్యకలాపాలు, కర్మ వలన కలిగే అనుభవం, ఆనందం... ఇదంతా భావ పారవశ్యమే. వీటన్నింటిని దాటి, సర్వేంద్రియాలు తమ తమ కార్యకలాపాలను వదలి శూన్య వృత్తులతో మనసు నిశ్చల, నిర్మల స్థితిలో నిలకడ చెంది ఉండటం అందునా జాగ్రదవస్థలో! అదే సహజ సమాధి.

హృదయంలో పూర్తిగా లయమైనందున మనసు ఆలోచనా రాహిత్యాన్ని పొంది, అంటే ఉనికిని కోల్పోయి అన్నిటికీ మూలమైన ఆత్మ స్పర్శను పొందటం ప్రారంభిస్తుంది. అంటే మనో వృత్తులు నశించి, సద్వృత్తులు సన్నగా తమ ఉనికిని చాటుతుంటయ్. అంటే మనసు లేదు కనుక అహంకారం లేదు. అందువలన అహమూ లేదు. అహం స్ఫురణ కారణంగా సర్వమూ అధీనమైన స్థితి. జాగ్రదవస్థలో సహజ స్థితిగా ఏర్పడుతుంది. అదే సహజ సమాధి.

సహజ స్థితి జ్ఞాన మార్గ సంబంధి. కనుక సహజ సమాధిని సాధించిన జ్ఞాని కార్యకలాపాలు, ప్రాపంచిక విషయాలు...ఒకటేమిటి, అన్నీ సత్యస్ఫోరకంగా సాగుతయ్. జరుగుతున్న వాటినన్నిటినీ ఆత్మతో కూర్చి ఉన్నందున అవన్నీ ఆత్మనిష్ఠగా సాగుతయ్. కనుకనే సత్యానుసంధానం వల్ల కలిగేవన్నీ శాంతివైపు, ఆనందంవైపు, సచ్చిదానందం వైపు జరిగి, జ్ఞాని యందు కరుణాసముద్రంగా నిలబడి ఉంటయ్. లోక కల్యాణం లక్ష్యంగా జ్ఞాని అంతరంగం అచల స్థితిలో ఉంటుంది. ఆ లోకంతో ఆయనకెట్టి బంధమూ, సంబంధమూ లేకపోయినా! అదే సత్ చిత్ ఆనంద స్థితి.

ఈ సహజ సమాధి స్థితే సంపూర్ణసమాధి స్థితి.

నిరంతరాభ్యాసం వలన ఈ స్థితి కాలగమనంలో నిత్య సత్య శాశ్వతావస్థ అవుతుంది. శరీరం, ఇంద్రియాలు, మనసు ఎంతగా లోక సంబంధ విషయాలలో నిమగ్నమై ఉన్నా సహజ సమాధి స్థితికి భంగం కలుగదు.

జాగ్రదవస్థలో, ఆత్మనిష్ఠలో సహజ సమాధి స్థితిని తన స్వరూపంగా, స్వభావంగా, నిజానికి తనకూ తానున్న స్థితికి భేదమెరుగని జ్ఞానికి మాత్రమే సహజ సమాధి స్థితి సాధ్యమవుతుంది.

ఇటువంటి జ్ఞానికి రాకపోకలు లేవు. జనన మరణ భావనలు ఉండవు. ఆత్మ తప్ప అన్యమెరుగని స్థితి కలిగి నిరహంకార స్థితి నిలకడగా ఉంటుంది.

మనసున్నంతవరకూ అహంకారం తప్పదు.

అహంకారమున్నంత వరకు భయం, బాధ, దుఃఖం తప్పవు. ఇదొక విషవలయం. అన్ని వేళలా ఆగకుండా పరిభ్రమించే చక్రం.

జ్ఞానికి అనేకం అంటూ లేదు. ఉన్నదంతా ఒకటే. అదే సత్యం. అదే ఆత్మ. అహంకారాన్ని గమనించి స్వీయ సాధనతో దాన్ని దూరం చేసుకోవటం వల్ల అన్నీ పోయి ఆత్మ ఒక్కటీ మిగులుతుంది. ఆపై జరిగేదంతా ఆత్మసంబంధమే. అనుకోవలసింది ఒకటే, నేను ఆత్మను అని!

ఆ అనుకోవటం ఆపగానే, ఆ నేనూ నశించి, ఆత్మ స్థిరమౌతుంది. కర్తృత్వం నశిస్తుంది. కనుక బంధనా ఉండదు. ఆ కారణంగా పొందటమూ ఉండదు. పోగొట్టుకోవటమూ ఉండదు. ఇదే నిరామయ స్థితి.

ఇదంతా నిద్రావస్థలోనో, సుషుప్తిలోనో జరగటం లేదు. జాగ్రదవస్థలో సాక్షీభూత స్థితిలో ఉండిపోవటమే సహజ సమాధి స్థితి.

నిర్వికల్ప సమాధి వరకూ వచ్చిన సాధకుడు క్రియను సైతం వదలిపెడుతూ చేరుకోవలసిన గమ్యమే సహజ సమాధి.

నిరంతర యత్నమూ, లక్ష్యశుద్ధి ఉన్నప్పుడు సహజ సమాధి సులభంగానే లభిస్తుంది. కావలసింది ఎరుక, ఆత్మనిష్ఠ సచ్చిదానంద యోగం. సహజ సమాధే అసలైన అచల స్థితి. అందుకోవలసిన స్థితి.




- వి.యస్.ఆర్. మూర్తి
9440603499

చింతన

అంతర్గతంగా పరమాత్మ దర్శనానికి వివిధ మార్గాలు

భగవద్గీత



అధ్యాయం 13, శ్లోకం - 25

ధ్యానేనాత్మని పశ్యంతి
కేచిదాత్మానమాత్మనా।
అన్యే సాంఖ్యేన యోగేన
కర్మయోగేన చాపరే॥

తాత్పర్యం

పరమాత్ముని కొందరు ధ్యానము చేతను, మరికొందరు జ్ఞానాభ్యాసము చేతను, ఇంకను కొందరు నిష్కామ కర్మ చేతను తన యందే దర్శింతురు.

భాష్యం

రెండు రకాల బద్ధ జీవులు ఉంటారు. ఒకరు నాస్తికులు, వితండ వాదులు. ఇక రెండవ వారు అంతర్ముఖులైన భక్తులు, సాంఖ్యాతత్త్వ వాదులు, కర్మలు చేసేవారు. ఆత్మ పరమాత్మ ఒకరేనని వాదించువారు కూడా మొదటి తరగతికే చెందుతారు. సాంఖ్యాతత్త్వ వాదులు, ఆత్మ, భౌతిక మూలకాల కంటే భిన్నమని తెలుసుకున్నప్పుడు దానిని 25వ అంశముగా, భగవంతుణ్ని 26వ అంశముగా అర్థం చేసుకుని భక్తులవుతారు. అలాగే భగవంతుని కోసం కర్మ చేసేవారు, భగవంతుని పట్ల క్రమేణ ఆకర్షణ పెంపొందించుకుని భక్తులవుతారు. అంతేకాక పవిత్రాత్ములు పరమాత్మను అన్వేషించి తమ హృదయమున ఉన్న పరమాత్మను గుర్తించగలిగి దివ్యానందాన్ని పొందుతారు. భగవంతుడు, భౌతిక సంసారానికి అతీతముగా ఉండి పరమాత్మగా ప్రతి హృదయములో నిలిచి ఉన్నాడనే సరైన జ్ఞానమే దీనికి కారణమని అర్థము చేసుకొనవచ్చు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

మహనీయుల జీవకారుణ్యం

అందరూ భగవంతుని రూపాలే!



జాలారాం బాపా

శాస్త్రాలు మానవ జీవితానికి కొన్ని విధి నిషేధాలు విధించాయి. అయితే అవి సామాన్యులకే. అందరిలోనూ దేవుని చూసేవారు అటువంటి కొలమానాలకు అతీతులు. జాలారాం బాపా అన్నదానం చేసేవాడు. ఎందరో వచ్చి ఆకలిని తీర్చుకునేవారు. భోజనము చేసే వారిలో బలిష్టులు కూడా ఉండేవారు. ''బలంగా, ఆరోగ్యంగా రాయిలా, ఉన్నవారికి కూడా అన్నం పెట్టి సోమరితనాన్ని పెంచుతున్నావు. శాస్త్రములో పాత్రత ఎరిగి దానం చేయాలని ఉన్నదిగా'' అన్నారెవరో జాలారాం బాపాతో. ''సోదరులారా! శాస్త్రాల గురించి నాకేమి తెలియదు. ఇంక పాత్రత అపాత్రత నాకేమి తెలుస్తాయి? కాకపోతే నామనస్సుకు వారందరూ భగవంతుని రూపాలుగానే కనిపిస్తారు. ఇప్పుడు వెళ్లిన సాధువులు పరమేశ్వరులే''అన్నాడు జాలారాం బాపా విమర్శకునితో.

జంతువులు కూడా...

మానవులే పరమేశ్వరులా? మరి జంతువుల మాటేమిటి?


ఒకసారి ఒక రౌతు చాలా దూరం నుండి గుర్రముపై స్వారీ చేసుకుంటూ బాపా ఆశ్రమానికి వచ్చాడు. ఆ రౌతు ఎంత అలసిపోయాడంటే, గుఱ్ఱముపై నున్న సామానుగాని, గుఱ్ఱం జీనును కూడా విప్పే స్థితిలో లేడు. ఈ పరిస్థితిని దయార్ద్రహృదయుడు జాలారాం చూశాడు. రౌతును దించాడు.

రౌతు పడుకుంటానన్నాడు. ''ఖాళీ కడుపుతో ఉన్నావు. ఎలా పడుకుంటావు నాయనా?'' అని తన చేతితో ఒక లడ్డూను తినిపించి, నీళ్లు త్రాగించి, నిద్రపొమ్మన్నాడు. వెంటనే ఆ రౌతు నిద్రలోనికి జారిపోయాడు. బాపా గుఱ్ఱం వద్దకు పోయాడు. దానిపై సామాను దించాడు. జీనును తీసివేశాడు. గుఱ్ఱానికి నమస్కారం చేశాడు. ''ఓ నా రామా! నీపై స్వారీ చేసిన యజమానే అంతగా అలసిపోతే, పాపం నువ్వెంత అలసిపోయావో'' అంటూ గుఱ్ఱానికి దానా వేశాడు. వేడినీరు తెచ్చి గుఱ్ఱం కాళ్లకు కాపడం పెట్టాడు. ఇంకా గుఱ్ఱాన్ని పరుండనిచ్చి, దాని కాళ్లను ఒత్తటం ఆరంభించాడు. రౌతులో ఉన్న రాముడినే గుఱ్ఱంలోనూ చూచిన జాలారాం బాపా ధన్యుడు.

కుక్కలోనూ పాండురంగడే

నామదేవుడు పాండు రంగని భక్తుడు. జ్ఞాని కూడా కావాలని నామదేవుని విశోబా ఖేచర్ వద్దకు పంపారు పాండురంగడు. నామదేవునకు జ్ఞానోదయం అయ్యింది విశోబాఖేచరుని కృపవలన.

ఇప్పుడు నామదేవుడు భక్తుడే కాదు, మహాజ్ఞాని కూడా. ఒకసారి అన్న సమారాధన జరుగుతోంది. నామదేవుని కూడా ఆహ్వానించారు నిర్వాహకులు. అన్నదానంలో నామదేవుడు కూడా పాల్గొంటున్నాడు ఒక కుక్క అకస్మాత్తుగా జొరబడింది. ఆ సమయంలో నామదేవుని చేతిలో ఒక రొట్టె ఉన్నది. ఆ కుక్క రొట్టెను నోట కరచుకుని పరుగెత్తసాగింది. నామదేవుడు 'అయ్యో'అనుకున్నాడు. వెంటనే లేచి ''రంగా! రంగా! ఆ రొట్టెను అలా తినకు. గట్టిగా ఉంది. నములుటకు కష్టం అవుతుంది. ఇదిగో ఈ నేతిలో ముంచితే మెత్తబడుతుంది'' అంటూ ఆ కుక్క వెంట నేతిగిన్నెతో పరిగెత్తసాగాడు నామదేవుడు. నామదేవునకు ఆ కుక్క సాక్షాత్తు పాండురంగడే. ప్రతిజీవిలోను రంగని చూడగలిగినాడు. కనుకనే నామదేవుడు మహాజ్ఞాని అయ్యాడు.



నామదేవ్

జంతువులతోనూ మంతనాలు

రమణాశ్రమంలో మహాపండితులు, కుక్కలు ఒకేవిధంగా మహర్షి పాదాల చెంత కూర్చోవటం సామాన్య దృశ్యమే. పండితులకు, జంతువులకు ఏ విధమైన వ్యత్యాసాలు లేకుండా ఒకేవిధమైన ఆహారమూ, వసతి లభించేవి. మహర్షి మనుజులతో (సందర్శకులతో) మాట్లాడినట్లే జంతువులతోనూ మాట్లాడేవారు. చిన్న చిన్న ఆదేశాలనూ ఇచ్చేవారు. అవి అర్థం చేసుకుని ఆ ప్రకారం నడచుకునేవి. ఆలనా, పాలనా, పరిశుభ్రతా, ఇత్యాదులను శ్రద్ధగా చూచేవారు. వాటిని 'పిల్లలు' అనేవారు. పిల్లలకు ముందుగా ఆహారం ఇచ్చినట్లే. ఆ జంతువులకు పెట్టేవారు. తరువాత ఆశ్రమం బయట ఉన్న బిచ్చగాళ్లకు, ఆ తరువాత మహర్షీ, వారి అతిథులు మిగిలిన వాటిని తినేవారు. కాఫీ అయినా, రొట్టె అయినా, పిండి వంట అయినా మొదట 'పిల్లలకు' ఇవ్వవలసినదే.

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

దిన ఫలాలు

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకొంటాయి. గృహ విషయాల్లో ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రత్యర్థులు బలహీనపడతారు. ఆదాయంలో అనువైన మార్గాలు సులభతరమవుతాయి.

వృషభరాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రి యలు ప్రతికూలతను కలిగిస్తాయి. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావా దేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఉపకరి స్తాయి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలు ఉంటాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ వ్యవహారాల్లో చిరుసమస్యలను ఎదుర్కొంటారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటక రాశి: శత్రుభీతిపోతుంది. ఆర్థిక లావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్యఖర్చులు కొనసాగుతాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు అనుకూలం. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. వ్యయం నియంత్రించగలుగుతారు. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. పనులలో వేగం తగ్గుతుంది. ఆదా యంలో అనుకూల మార్పులు ఉంటాయి..

తులా రాశి: వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. ప్రోత్సాహ పరిస్థితులు వృత్తిలో కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు కూడా సులభతరమవుతాయి.

వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులు పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: శ్రమ అధికమవుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: రుణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఉంటాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులను పెడతాయి.

కుంభరాశి: ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం పెరుగుతుంది. ప్రయాణాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. ఆదాయం పర్వాలేదు.

మీనరాశి: నూతన కార్యాలలో ప్రోత్సాహం. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి కాబట్టి జాగ్రత్తలు తప్పనిసరి. ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేకపోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

Business సరిగమలు



మార్కెట్లో ఏ అమ్మకాలు అయినా పూర్తి నిజాయితీతో జరగవు. తమ ఉత్పత్తులు అమ్మడానికి కొనుగోలు దారులను పక్కదారి పట్టిస్తారు. అన్నీ నిజమని నమ్మకుండా వినియోగదారుడు తెలివిగా ఆలోచించగలగాలి. సాధారణ ప్రజలే కాదు ఆర్థిక నిపుణులు కూడా బోల్తా పడే విషయాలు చాలానే ఉంటాయి. మీరు ఒక ప్లాన్ లేదా ఉత్పత్తి కొనాలనుకున్నప్పుడు అవగాహనతో ఉండాలి.


'అమ్మకం ట్రిక్కు'లను అర్థం చేసుకోవాలి

నెట్ అసెట్ వేల్యూ తక్కువ ఉంది అంటే ఆ ఫండ్ చవకైనది అనకోవడం తప్పు. కొన్నాళ్ల కిందట వరకు మార్కెట్లో ఫండ్ అమ్మకాల విషయంలో ఈ ట్రిక్‌ను ఉపయోగించేవారు. సమయం గడిచేకొద్దీ జనాల్లో అవగాహన పెరిగేసరికి పెట్టుబడిదారులు ఆవిధమైన ప్రలోభాలకు లోనుకావడం మానేశారు. అయినా మనీ మార్కెట్‌కి సంబంధించిన కొన్ని నమ్మకాలు, మిథ్యలు ఇప్పటికీ ఉన్నాయి. ఉదాహరణకు, మోటార్‌వాహనం బీమా మీద మీరు 50-60 శాతం ఆదా చేసుకోవచ్చనే ప్రకటనలు నమ్మకండి.

ఆన్‌లైన్‌లో కొనే బీమా మీకు మంచి లాభం చేకూరుస్తుంది

ఇది అందరూ నమ్మే విషయం. కాని మీకు చివరలో వచ్చే బీమా మొత్తం తక్కువ ఉండటం వల్లనో, ప్లాన్ ఫీచర్స్‌లో మార్పు వల్లనో కూడా ప్రీమియం తక్కువ ఉండిఉండవచ్చు. ఈ మెలిక అర్థం చేసుకోవాలి. సాధారణంగా టర్మ్ ప్లాన్స్ చవకగానే ఉంటాయి. అది కూడా ఆన్‌లైన్‌లో కొంటే ధర మరింత తక్కువ ఉండవచ్చు. ఉదాహరణకు, మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి సూపర్ టర్మ్ ప్లాన్‌ను 30 ఏళ్లవారు 30 ఏళ్లకోసం 1 కోటి రూపాయల కవర్ తీసుకుంటే దాని ప్రీమియం ఏడాదికి 12,100 రూపాయలుంటుంది. కాని అదే కంపెనీ నుంచి ఆన్‌లైన్ టర్మ్ ప్లాన్ ప్లస్ తీసుకుంటే 30 శాతం చవకగా వస్తుంది. అంటే ప్రీమియం 8,378 రూపాయలు మాత్రమే పడుతుంది. ఆన్‌లైన్‌లో మోటార్ ఇన్సూరెన్స్ తీసుకుంటే చవక పడుతుందని ఆన్‌లైన్ డిస్ట్రిబ్యూటర్లు అంటున్నా కొనుగోలుదారులు చైతన్యంతో ఉండాలి. ప్రీమియం తగ్గింది అంటే బీమా సొమ్ము నుంచి భారీగా కట్ అవుతుందని అర్థం. ఏడాది కిందట తీసుకున్న కారు పాలసీ రెన్యువల్ కోసం ఒక డిస్ట్రిబ్యూటర్ దగ్గరకు వెళితే రెన్యువల్ చేయడానికి వెళితే 16,000 అడిగాడు. కాని ఆన్‌లైన్ డిస్ట్రిబ్యూటర్ 8,500 మాత్రమే అడిగాడు. అంతమాత్రాన అది చవకబేరం కాదు. మీ ప్రీమియం తగ్గింది అంటే కారు ఐడివి (అంటే బీమా కంపెనీవారు, బండికి జరిగిన నష్టానికి ఇస్తామని ఒప్పుకున్న నియమిత మొత్తం)5.9 లక్షలు ఉన్నదల్లా

మొదటి ఏడాదికి 4.2 లక్షలకు తగ్గిపోతుంది. దానితోపాటే ఉన్న పాలసీ మీద చేకూరాల్సిన అదనపు లబ్ధి కూడా తగ్గిపోతుంది. కారు మార్కెట్ విలువనుబట్టి ఐడివిని పెంచి, అది కూడా అదనపు లబ్ధితోపాటుగా వస్తుంటే ప్రీమియంలో ఉన్న చిన్నపాటి వ్యత్యాసాన్ని పట్టించుకోనక్కరలేదు. కాని ఐడివి తగ్గిపోతే ప్రీమియం



తగ్గడం వలన కూడా లాభం ఉండదు. కాబట్టి మెడికల్ లేదా కార్ బీమాను ఆన్‌లైన్‌లో బీమా పాలసీ కొనేటప్పుడు ఒకసారి మీ కొత్త పాలసీ ఫీచర్లు ఎలా ఉన్నాయో చూసుకోండి.

ఫండ్స్‌ను దీర్ఘకాలంగా పట్టి ఉంచుకోవడం వలన కాంపౌండింగ్(పెట్టుబడి పెట్టిన మొత్తం మీద అప్పటివరకు వచ్చిన వడ్డీ మొత్తం మీద వచ్చే వడ్డీ. అంటే ఒకరకంగా చక్రవడ్డీ)జరుగుతుంది

ఫండ్స్ అమ్మేవారు కాంపౌండింగ్ ఆశ చూపుతారు. కాని ఈక్విటీ, మ్యూచ్యువల్ ఫండ్స్ రిటర్న్‌లు ఫిక్స్‌డ్ ఉండవు కాబట్టికాంపౌండిగ్ సూత్రం వాటికి వర్తించదు. దీర్ఘకాలికంగా ఉంచితే మ్యూచ్యువల్ ఫండ్స్ మంచి రిటర్న్‌లు ఇస్తాయి. దానితో కాంపౌండింగ్‌కు ఏం సంబంధం ఉండదు. ఫండ్ మీద ఉండే పెరుగుదల అన్ని సంవత్సరాలకు సమానంగానే ఉంటుంది. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్లు అయితే దానికి ముందుగానే రేటు ఎంత ఉంటుందో తెలిసిపోతుంది. కాంపౌండింగ్ ఎలాగూ ఉండదు కాని కొన్నిసార్లు స్టాక్స్, ఇంకా మ్యూచ్యువల్ ఫండ్స్ కూడా వ్యతిరేక ఫలితాలు ఇచ్చిన సందర్భాలున్నాయి. మ్యూచ్యువల్ ఫండ్స్ వడ్డీ ఇవ్వవు. కాంపౌండింగ్ అనే అంశం దానికి వర్తించదు. అది తెలుసుకోవాలి. ఫండ్ పనితీరును అంచనా వేయడానికి సిఎజిఆర్ మెట్రిక్ ఉపయోగిస్తారు. అది చూసి తమ పెట్టుబడి కాంపౌండింగ్ అవుతుందనుకుంటారు. కాని ఈ పద్ధతి ద్వారా ఇచ్చిన గణాంకాలు పెట్టుబడిదారులను పక్కదోవ పట్టిస్తాయి. దీర్ఘకాలికంగా ఉంచితే పెరుగుతుందనే భ్రమ కల్పిస్తాయి.

ఆన్‌లైన్ మెగా సేల్స్ ఎక్కువ డిస్కౌంట్లు ఇస్తాయి

ఆ డిస్కౌంట్లు స్టాక్ క్లియరెన్స్ సేల్ కంటే గొప్పవి కావు. సేల్స్ పేరుతో విపరీతంగా అమ్మకాలు చేసేవారిని అందరూ సులువుగా నమ్మేస్తారు. మెగా డిస్కౌంట్ సేల్‌లో అమ్మే ఉత్పత్తులు సాధారణంగా సేల్ లేనప్పుడు అమ్మే ధర కంటే 416 శాతం ఎక్కువ ధర ఉంటాయి. కాని సూపర్ సేవింగ్ అనగానే కొనేద్దామనిపిస్తుంది. అటువంటివే ఈకామర్స్ పోర్టల్స్ కూడా. మిమ్మల్ని నమ్మేలా చేస్తాయి. సేల్స్ సమయంలో షాపింగ్ వెబ్‌సైట్లు సేల్ తీసేస్తే 17 శాతం తక్కువగా అమ్మకాలు చేస్తాయి. అందుకే అవి దాదాపు ఏడాది అంతే సేల్ పేరుతో పాత సరుకును తోసేయడానికి చూస్తాయి. బ్రాండ్ కంపెనీలు నిజంగా డిస్కౌంట్లు ఇస్తాయని నమ్మడం కూడా సరికాదు. డిస్కౌంట్ల నిజాయితీ విషయం పక్కనపెడితే అమ్మకందారులెప్పుడూ రెండు ధరలు చూపిస్తారు. ఒకదానిమీద కొట్టివేత ఉంటుంది. కొట్టేసింది ఎక్కువ రేటు ఉంటుంది. కనిపించేది తక్కువ ఉంటుంది. కాని ఇదంతా అమ్మకం ట్రిక్ తప్ప ఇంకేం కాదు. అదే పెద్ద బ్రాండ్ కంపెనీల ఉత్పత్తులను వివిధ వెబ్‌సైట్లలో ఎంతెంత రేటుకు అమ్ముతున్నారో చూసుకుని తక్కువ ఉన్నవి కొనుక్కోవచ్చు. ఇది ఒక సౌలభ్యం మాత్రమే. ఇది కూడా ఇతర కంపెనీల మాదిరిగానే కొనిపించడానికి వేసే ఎత్తుగడ మాత్రమే.

సిప్‌లు సురక్షితం. క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే డబ్బు నష్టం ఉండదు

సిప్స్(క్రమానుగత పెట్టుబడులు) కేవలం ఈక్విటీ పెట్టుబడుల రిస్క్‌ను తగ్గిస్తాయి. కాని ఆ రిస్క్‌ను పూర్తిగా పోగొట్టలేవు. గత కొంత కాలంగా పెట్టుబడిదారులు సిప్‌లలో పెట్టుబడి పెట్టడం ఇష్టపడుతున్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులకు సిప్‌లు రక్షణకవచాలు అనుకుంటారు. కాని అవి కూడా నష్టం జరగదని గ్యారంటీ ఇవ్వవు. కొంతమేరకు ఈక్విటీ పెట్టుబడులలో ఉండే రిస్క్‌ను తగ్గిస్తాయి. మార్కెట్ కిందికి పడిపోయినప్పుడు మీ పెట్టుబడులు కూడా కిందకి వెళ్లిపోతాయి. సిప్ అయితే చాలు మంచి రిటర్న్‌లు ఇస్తుంది అనుకోవడం తప్పు. అది ఆ ఫండ్ పనితీరుబట్టి ఉంటుంది అంతే. గత 12-18 నెలలుగా సిప్స్‌లో పెడుతున్నవారు నష్టాలలో ఉన్నారని నిపుణులు చెప్తున్నారు. పోర్ట్‌ఫోలియోలో ఎర్ర మార్క్ వచ్చినంతమాత్రాన వారి సిప్‌లను ఆపేయాలని కాదు. పెట్టుబడిదారులు ముందుగా తెలుసుకోవలసింది, తాము ఎందుకు సిప్స్‌లో పెట్టుబడి పెడుతున్నాం అనేది. ప్రతి నెల కొంత డబ్బు ఆదా చేయడం అనే క్రమశిక్షణ అలవడి దీర్ఘకాలికంగా దానివలన ఫలితాలు పొందాలి. సిప్‌లనుంచి నిజంగా లబ్ధి పొందాలనుకుంటే మార్కెట్ పరిస్థితులు ఎలా అయినా ఉండవచ్చు కాని వాటిని పట్టించుకోకుండా ఎక్కువకాలం వేచి ఉండాల్సిందే. అయితే సిప్‌ల వలన నష్టాలు కూడా జరగవచ్చు. వాటి రిటర్న్‌లు కాలపరిమితిని బట్టి ఇలా ఉంటాయి. ఐదేళ్లకి 8.90 శాతం, మూడేళ్లకి 3.12 శాతం, ఏడాదికి 12-14 శాతం. దీన్నిబట్టి చూస్తే దీర్ఘకాలికంగానే సిప్‌లు ఉపయోగం అని అర్థం అవుతుంది.

ఇన్సూరెన్స్ చేశామంటే అది కేవలం పన్నురహితమే ఉండాలి

ఇన్సూరెన్స్ పాలసీ పన్నురహితమని అమ్మేవాళ్లు కొనేవాళ్లకి చూపే ఆశలో ఒకటి. పెట్టిన పెట్టుబడి ద్రవ్యోల్బణం కంటే తక్కువ ఇస్తే, ఎలాగూ అది పన్నురహితమే అవుతుంది. వారు ప్రత్యేకంగా ఇచ్చేదేం లేదు. సెక్షన్ 10(10డి) కింద పాలసీ ఇన్సూరెన్స్ కవర్ వార్షిక ప్రీమియం కంటే పదిరెట్లు ఉంటే మెచ్యూరిటీ మొత్తం ఏదయితే వస్తుందో దానికి పన్ను పడదు. అందుకే కొనుగోలుదారుని ఆకర్షించడానికి పన్ను రహిత ఇన్సూరెన్స్ పథకం పేరుతో అమ్మేస్తుంటారు. అదే ఫండ్ విషయంలో అయితే మీరు కొన్న ఫండ్ ఇండెక్సేషన్(ఫండ్ కొన్న దగ్గరనుంచి అమ్మేవరకు ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించడం. ఉదాహరణకు 5 వేల రూపాయలు ఆస్తి విలువ అనుకుంటే వార్షిక ద్రవ్యోల్బణం రేటు 5 శాతం ఉంటే ఆస్తి విలువ 3,868కి పడిపోతుంది. దానివలన కట్టవలసిన పన్ను తగ్గుతుంది.)కి అర్హత సాధిస్తే పన్ను రహితం అవుతుంది. మీరు ఫండ్‌ను ఎంతకాలం పెట్టుకుంటే అంతకాలం ఇండెక్సేషన్ లబ్ధి దొరుకుతుంది. అయితే ఇండెక్సేషన్ లబ్ధి కేవలం బంగారం, మ్యూచ్యువల్ ఫండ్స్, రియల్ ఎస్టేట్ లాటి మూలధన ఆస్తులకు మాత్రమే వర్తిస్తుంది. ఇన్సూరెన్స్‌కి ఇండెక్సేషన్‌కి అర్హత ఉండదు. సంప్రదాయ ఇన్సూరెన్స్ పాలసీలు సాధారణంగా 4.5-5 శాతం రిటర్న్‌లను ఇస్తాయి. దీర్ఘకాలిక ప్లాన్‌లు అయితే 10-15 ఏళ్లు ఉండి 5-6 శాతం ఎక్కువ రిటర్న్‌లు ఉంటాయి. గత పదిహేనేళ్లుగా ఇండెక్సేషన్ లబ్ధి 6.49 శాతం కాంపౌండ్ రేట్ చొప్పున పెరిగితే ధర ద్రవ్యోల్బణ సూచీని ఉపయోగిస్తున్నారు. దాన్నిబట్టి పన్ను పడుతుంది.

ఎక్కువ క్రెడిట్ కార్డులుంటే మీరు అప్పుల ఊబిలో పడిపోతారు

ఎన్ని కార్డులున్నాయని కాదు మీ ఖర్చు ఎంతవరకు అదుపులో ఉందో ముఖ్యం


గత కొన్నేళ్లుగా క్యాష్ లేని ఖర్చులు పెరగడం వలన క్రెడిట్ కార్డుకు ఎక్కువ వినియోగం ఏర్పడింది. ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులుంటే ఖర్చులు కూడా పెరిగిపోతాయని అంటారు. కాని వాస్తవానికి ఎక్కువ కార్డులున్నంతమాత్రాన ఖర్చు పెరిగిపోదు. ఈ కార్డులు లేకున్నా అతిగా ఖర్చు పెట్టేవారు, అప్పులు చేసేవారు ఆగలేరు. అలా ఎక్కువ కార్డులు ఉండటం వలన లాభం కూడా ఉంది. ఉదాహరణకు, మీకు క్రెడిట్ కార్డు ఇచ్చిన కంపెనీ, అంతకుముందు మీదగ్గర ఉన్న కార్డు మీద ఉన్న అప్పును తనకు ట్రాన్స్‌ఫర్ చేయమంటాడు. ఇంకొన్ని బ్యాంకులు మొదటి ఒకటి రెండు నెలలకు ఏం చార్జీలు వేయవు. లేకుంటే అంతకుముందు కార్డు మీద 2-3 శాతం చార్జీ పడితే దీని మీద 1.5-2 శాతం చార్జీ పడవచ్చు. ఎక్కువ క్రెడిట్ కార్డులుంటే మీ క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. కార్డు వినియోగదారులు ఏ కార్డు అయితే వారి అవసరాలకు, ఖర్చులకు తగినట్లుగా ఉపయోగపడుతుందో చూసుకుని దానిద్వారా రివార్డులు పొందవచ్చు. అన్ని కార్డులు ఒకేరకంగా ఉండవు. కొన్ని వాడటం మంచిది కాదు. ఇంకొన్ని కేవలం గ్రోసరీ షాపింగ్‌కి మాత్రమే ఉపయోగకరం. ఇంకొన్ని ఆన్‌లైన్ షాపింగ్ చేయడానికి పనికివస్తాయి. కాబట్టి వివిధ క్రెడిట్ కార్డులు ఉండటం తప్పు కాదు. తెలివిగా వినియోగించడం తెలియాలి.

చిన్న పథకాలయితే ఫిక్స్‌డ్ రిటర్న్‌లు ఇస్తాయి

మార్కెట్ ఆధారితంగా రేట్‌లు ఉంటాయి. అవి ప్రతి మూడు నెలలకు మారుతుంటాయి. ఒకమాదిరి పెట్టుబడి పెట్టగలిగే పెట్టుబడిదారునికి చిన్న పొదుపు పథకాలు ఏమాత్రం రిస్క్ లేనివని, తప్పక మంచి రిటర్న్ లను ఇస్తాయని నమ్ముతారు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్ పథకంవంటివి సురక్షితం అనుకుంటారు. గత ఐదేళ్ల నుంచి చిన్న పొదుపు పథకాల మీద వచ్చే వడ్ఈ రేట్ఉ ప్రభుత్వ బాండ్ ఫలితాలకు లింక్ చేశారు. కాబట్టి కూడా ఇప్పుఉ మార్కెట్‌కు లింక్ అయి ఉన్నాయి. దానిబట్టి ప్రతి మూడునెలలకు రేట్లు పునరుద్ధరిస్తారు. కాని నియమాలు ప్రతి పథకానికి వేర్వేరుగా ఉంటాయి. నేషనల్ సేవింగ్ స్కీమ్, సీనియర్ సిటిజన్ పథకాలు, ఇంకా టర్మ్ డిపాజిట్లలో ఒకసారి పెట్టుబడిదారు పెట్టుబడి పెట్టాక ఆ వడ్డీరేటు మారదు. మీరు నేషనల్ సేవింగ్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టినప్పుడు 8 శాతం వడ్డీరేటు ఉంటే తర్వాత ఏ మార్పులు మీ పెట్టుబడిని ప్రభావితం చేయలేవు. ప్రావిడెంట్ ఫండ్, సుకన్య లాటి దీర్ఘకాలిక ఉత్పత్తులలో రేట్ మార్పులుంటే అది మీకు వచ్చే రిటర్న్ మీద ప్రభావం చూపిస్తుంది. కొన్నేళ్లుగా చిన్న పొదుపు పథకాల వడ్డీరేట్లు 70-100 బేసిస్ పాయింట్లు తగ్గాయి. ప్రావిడెంట్ ఫండ్ 2015-16 లో 8.7 శాతం ఉంటే ఇప్పుడు 8 శాతం ఉంది. గత ఏడాది 7.6 శాతం ఉంది.

నా భర్త డబ్బుకి నేను పన్ను కట్టాలా?

నేను హౌస్‌వైఫ్‌ని. నాకు నా భర్త ప్రతినెల 30,000 రూపాయలు బ్యాంకులో నా ఎకౌంట్ లో జమచేస్తారు. అలా పోయిన ఏడాది జూన్ నుంచి చేస్తున్నారు. నేను ఆ డబ్బును సిప్‌ల రూపంలో మ్యూచ్యువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్నాను. నేను దానికి ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్ ఫైల్ చేయాలా? పన్ను కట్టవలసిన అవసరం ఉంటుందా?



మీరు ప్రత్యేకంగా ఆదాయపు పన్ను రిటర్న్ ఫైల్ చేయడం కాని పన్ను కట్టవలసిన అవసరం కాని ఉండదు. ఆ డబ్బును పెట్టుబడిగా పెట్టి మీరు సంపాదించే డబ్బు మీ భర్త ఆదాయంలోకి చేరుతుంది. దాని మీద పన్ను అతనే కట్టవలసి ఉంటుంది. ఒకవేళ మీరు పెట్టుబడుల వలన వచ్చిన ఆదాయాన్ని మళ్లీ పెట్టుబడిగా పెట్టి దానిమీద ఆదాయం సంపాదించేటట్లయితే అప్పుడు అది మీ ఆదాయం కింద పరిగణన జరుగుతుంది. ఆ ఆదాయం మీద పన్ను పడుతుంది. అయితే ఆ ఆదాయం 2.5 లక్షల లోపు అయితే పన్నురహితం.

25 ఏళ్లుగా ఉన్న మా సొంత ప్లాట్ ను అమ్మి ఆ డబ్బుతో నేను నా భార్య భాగస్వామ్యంతో కలిసి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాను. కాని నేను ఎంతకైతే అమ్ముతానో అంతకంటే ఎక్కువ డబ్బు పెట్టి మళ్లీ ఇల్లు కట్టుకోవాల్సి వస్తుంది. నేను అమ్మకపు పన్ను కట్టవలసి వస్తుందా?

సెక్షన్ 54ఎఫ్ దీర్ఘకాలిక మూలధనపు లాభాల మీద పన్ను మినహాయింపు ఇస్తుంది. మీరు ఇల్లు అమ్మిన రెండేళ్ల లోపు ఇంకో ఇల్లు కొనుక్కుంటే లేదా ఇల్లు అమ్మిన మూడేళ్ల లోపు ఇంకో ఇల్లు నిర్మిస్తే అది పన్నురహితం. అందులో ఒక నియమం ఉంది. మీకు మళ్లీ మీరు కొనుక్కున్న కొత్త ఇల్లుతోపాటు ఇంకొక్క ఇల్లు కంటే ఎక్కువ ఉండకూడదు. అదే కనుక ఇల్లు పునర్నిర్మాణ విషయంలో కొత్త ఫ్లోర్, అదనపు గదులు మొదలైనవి జరిగినప్పుడు దానికి పన్ను మినహాయింపు ఉంటుంది. నియమిత కాలపరిమితి లోపున అమ్మకం డబ్బును ఖర్చుపెట్టకపోతే దాన్ని కేపిటల్ గెయిన్స్ ఎకౌంట్‌లో జమచేయాలి. పన్ను ఆదా కావాలంటే దాన్ని కూడా నియమిత కాలపరిమితి లోపు ఉపయోగించాలి.

సొంతింటికి ఆర్థిక సోపానం

ప్రతివ్యక్తి ముందు నిలువ నీడ ఏర్పాటు చేసుకోవాలని తరాల నుంచీ చెప్తూ వస్తున్నమాట. అదే నమ్మకంతో సొంతిల్లు ఎలాగైనా కొనుక్కోవాలనుకుంటాం. ఇల్లు కొనుక్కోవడం జీవితంలో మనం చేసే అతి పెద్ద ఆర్థిక పెట్టుబడులలో ఒకటి. సొంత ఇల్లు కావాలని మానసిక భావోద్వేగాలు పక్కనపెడితే ఇల్లు కొనుక్కోవడం వెనక రెండు బలమైన అంశాలుండాలి.



ఇంటికోసం కొంత డబ్బు డౌన్ పేమెంట్‌గా కట్టడానికి సరిపడినంత డబ్బు ఉండటం. ఇంటికి నెలవాయిదాలు కట్టగలిగేటంత స్థోమత ఉండటం అవసరం. అయితే ఇల్లు కొనుక్కోవడానికి ఈ రెండు మాత్రమే కారణాలు కాకూడదు. నిర్ణయం తీసుకునేముందు ఇంకా కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

మీ దగ్గర డౌన్ పేమెంట్ కట్టడానికి డబ్బు ఉందా?

ఇంటి ధర ఎంతయితే ఉంటుందో అందులో 20 శాతం డౌన్ పేమెంట్‌గా కట్టాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు ఇల్లు 50 లక్షల రూపాయలతో కొనుక్కుంటే మీదగ్గర డౌన్‌పేమెంట్ కట్టడానికి 10 లక్షలుండాలి. మిగిలింది రుణం కింద కట్టేయచ్చు. ఇంటి ఖరీదునుబట్టి మీదగ్గర 20 శాతం డౌన్‌పేమెంట్ కోసం లేకుంటే మీరు ఇల్లు కొనుక్కోవడానికి సిద్ధంగా లేనట్లే.

నెల వాయిదాలు కట్టే స్థోమత ఉందా?

ఒకవేళ మీరు ఎలాగొలా డౌన్‌పేమెంట్ కట్టడానికి సిద్ధపడినా వాయిదాలు నెలకి సరిగా కట్టగలరా అని ప్రశ్నించుకోండి. కట్టాలని మీరు అనుకోవడం, కట్టే స్థోమత ఉండటం రెండు విభిన్నమైన విషయాలు. మీ నెల ఆదాయంలో నెల వాయిదా 30-40 శాతం కంటే ఎక్కువ ఉండకూడదు. అంతకంటే ఎక్కువ ఉంటే మీకు కష్టమవుతుంది. కేవలం రుణం తీసుకున్న మొత్తం మీద మాత్రమే ఇది ఆధారపడి ఉండదు. రుణకాలపరిమితి ఎంతకాలం అనేది కూడా దానికి సంబంధించినదే. ఉదాహరణకు మీ నెలాదాయం 75,000 అనుకోండి. ఇంటి రుణం వడ్డీరేట్ఉ 9.5 శాతం అనుకుంటే మీ ఆదాయం, రుణ కాలపరిమితి, నెల వాయిదా ఇవన్నీ కలిసి వివిధ రకాలుగా ఎలా ఉంటాయో తెలిపే పట్టిక ఇది.

రుణం ఇచ్చేవారు ఈవిధంగానే నిర్ణయిస్తారు. మీ ఆదాయం చాలా ఎక్కువ ఉంటే ఎక్కువ ఖరీదు కాని చిన్న ఆస్తి కొనుక్కోవచ్చు లేదా డౌన్ పేమెంట్‌గా పెద్దమొత్తం చెల్లించవచ్చు. ఇంకోవైపు మీ నెలవాయిదా మీ ఆదాయం కంటే 40 శాతం కంటే ఎక్కువ ఉంటే మొదట్లో కొంచెం కష్టంగా ఉంటుంది. 30 శాతం డౌన్ పేమెంట్‌గా కట్టడం చాలామందికి సులువుగా ఉంటుంది. వాయిదాలు కట్టడంలో భార్యభర్తలు ఇద్దరూ భాగస్వామ్యం తీసుకుంటారు. ఇది వారికి ఎక్కువ సౌలభ్యం కలిగిస్తుంది. ఈ పద్ధతి బావుంటే పర్వాలేదు. ఇద్దరిలో ఒకరు ఉద్యోగం మానేస్తే ఒక ఆదాయం తగ్గిపోతుంది. కాని వాయిదా మాత్రం అంతకుముందులానే కట్టాల్సి ఉంటుంది. అంతకుముందు చెప్పినట్లుగా డౌన్ పేమెంట్, ఇంకా నెల వాయిదాలు కట్టగలిగే స్థోమత ఉంటేనే మొదటి ఇల్లు కొనే ఆలోచన చేయాలి.

నెలవాయిదాలు కట్టంగా అత్యవసరాలకు కూడా మిగలాలి

అనుకోని అత్యవసరాలు ఎప్పుడైనా ఎదురవచ్చు. వాటిని ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. మీరు మదుపు చేసుకున్న డబ్బుతో డౌన్ పేమెంట్ కట్టినవారికి పెద్దమొత్తంలో వాయిదా కట్టడం కష్టం అవుతుంది. అటువంటి పరిస్థితులున్నప్పుడు మొండిగా పెద్ద వాయిదాలు కట్టడానికి సిద్ధం అయితే అత్యవసర వైద్య ఖర్చులు, అకస్మాత్తుగా ఉద్యోగం మానేయడం, ఇంకేవైనా అనుకోని పెద్ద ఖర్చులు వస్తే మీ దగ్గర డబ్బు ఉందా? అందుకే మదుపు చేసిన డబ్బు అంతా డౌన్ పేమెంట్‌కి కట్టేయడం సరికాదు. అత్యవసరాలకు ఉంచుకోవాలి. ఆరు నెలలకు సరిపడా ఖర్చులకోసం మీ దగ్గర సేవింగ్స్ ఉండాలి. ఇంకా చెప్పాలంటే మూడు నెలల వాయిదాలకు సరిపడా సొమ్ము పక్కన పెట్టుకుని ఉండాలి. ఒకవేళ మీరు అకస్మాత్తుగా ఏవో కారణాల వలన నెల వాయిదాలు కట్టలేకపోతే ఆ డబ్బు ఉపయోగపడుతుంది.

ముఖ్యలక్ష్యాల కోసం కొంత దాచుకోవాలి


డౌన్‌పేమెంట్ ఎలాగొలా కట్టేసి, వాయిదాల కోసం కొంత మొత్తం ఉంచేయగానే అంతా బావున్నట్లు కాదు. ఇల్లు కొనడం ముఖ్యమే కాని పిల్లల పెద్ద చదువులు లాటి పెద్ద లక్ష్యాలను కూడా గుర్తు పెట్టుకోవాలి. కొన్నేళ్లలో మీ పిల్లలు పెద్ద చదువులకు వస్తారనుకుంటే వారి కోసం దాయడం కూడా ముఖ్యం అని గుర్తుపెట్టుకోవాలి.

బాధ్యతలు మోయాల్సిందే..!


ఎన్టీఆర్

గత చిత్రాలను మరిపించే సినిమాలు చేయాలని నిశ్చయించుకున్నా అంటున్నారు యంగ్ టైగర్ ఎన్టీఆర్. ఒకప్పుడు ఒకే తరహా చిత్రాలు చేయాల్సిరావడం వెనుక తనపై ఉన్న అంచనాలే కారణమన్నారీ అగ్ర కథానాయకుడు. తొలి చిత్రంతోనే తనపై బాధ్యత చేరిందని, దాన్ని మోయాల్సిందే అన్నారు. అరవింద సమేత లాంటి సోలో హిట్ తర్వాత ఎన్టీఆర్ చరణ్‌తో కలిసి మల్టీస్టారర్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ మాస్ క్యారెక్టర్, చరణ్ క్లాస్ పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. నటుడిగా మానసిక పరిపక్వత వచ్చాక...మూస సినిమాల ధోరణి విడిచిపెట్టానని చెబుతారు ఎన్టీఆర్. ఆయన మాటల్లో వింటే...నాకు పెట్టిన పేరుతోనే అంచనాలు, బాధ్యతలు ఏర్పడ్డాయి. తొలి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాక ఆ బాధ్యత వాస్తవంగా తెలుసుకున్నాను. ఒక్కసారి మనపై అంచనాలు చేరితే వాటిని అందుకునేందుకు శ్రమించాల్సిందే. కొన్నాళ్ల పాటు నేను చేసిన చిత్రాలన్నింటి వెనుక ఈ అంచనాల ప్రభావం ఉంది. అవన్నీ ఒకే తరహాలో ఉండేవన్న విమర్శ వచ్చింది. నటుడిగా నన్ను నేను తెలుసుకున్నాక...వీటికి దూరంగా ఉంటున్నాను. ఎప్పటికప్పుడు కొత్త తరహా కథలను ఎంచుకోవాలి, గతంలో చేయలని చిత్రాలు చేయాలని నిశ్చయించుకున్నాను. ఏమైనా ఇక్కడ ఒక నటుడికి కావాల్సింది విజయాలే. నేను కోరుకునేది నటుడిగా సంతృప్తితో కూడిన విజయాలు. అని చెప్పారు. ఎన్టీఆర్ నటిస్తున్న కొత్త చిత్రం ఆర్ఆర్ఆర్ రెండో షెడ్యూల్ చిత్రీకరణ జరుపుకుంటోంది.


కాజల్ అగర్వాల్


రవితేజ

పుట్టినరోజు కానుక

మాస్ మహారాజా రవితేజ కొంత విరామం తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు. 'అమర్ అక్బర్ ఆంటోని' సినిమా అపజయం తర్వాత రవితేజ తన కొత్త సినిమాల ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉంటున్నారు. రెగ్యులర్ ఫార్మెట్ సినిమాలకు దూరంగా ఉంటూ కొత్తతరహా సినిమాలను అంగీకరిస్తున్నారు. తాజాగా రవితేజ వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో నటించనున్నారు. రామ్ తళ్లూరి నిర్మించే ఈ చిత్రం టైటిల్ లోగో కార్యక్రమం ఈ నెల 26న జరుగుతుంది. ఆ రోజు రవితేజ పుట్టినరోజు కావడంతో అదే రోజు టైటిల్ ప్రకటిస్తారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ చిత్రానికి సంగీతం థమన్, ఛాయాగ్రహణం సాయిశ్రీరామ్.

సౌత్ ఇండియన్‌గా గర్వపడతా

- అల్లు అర్జున్

నాకు సౌత్ ఇండియా (దక్షిణ భారతదేశం) అంటే పిచ్చి. నా వృత్తిలో కూడా నేను సౌతిండియన్ యాక్టర్ అని రాసుకోవడమే కాదు గర్వపడతా అని ప్రముఖ హీరో అల్లు అర్జున్ అన్నారు. ఒమర్ లులు దర్శకత్వంలో ప్రియాప్రకాష్ వారియర్ నటించిన ఒరు ఆధార్ లవ్ అనే మలయాళ చిత్రాన్ని తెలుగులో లవర్స్ డే పేరుతో సుఖీభవ సినిమాస్ పతాకంపై ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి అందిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అల్లు అర్జున్ ఆడియో సీడీలను విడుదలచేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ, ఈ సినిమా ఫంక్షన్‌కు నేను రావడానికి రెండు కారణాలున్నాయి. కేరళ వాళ్లు నా సినిమాలను వాళ్ల సొంత సినిమాల్లాగా ఆదరిస్తున్నారు. ఓ ల్యాండ్ మార్క్ ఉన్న మలయాళ సినిమా తెలుగులోకి వస్తున్నప్పుడు నేను సపోర్ట్ చేయాలన్న ఉద్దేశ్యంతో వచ్చాను. నిర్మాత వినోద్‌రెడ్డి కోసం కూడా ఇక్కడకు వచ్చాను. అవకాశం ఉన్న ప్రతీసారి నా కోసం నిలబడ్డ ప్రతీఒక్కరి కోసం నిలబడతాను. నా బర్త్ డే కోసం ఎంత ఆతృతగా ఉంటానో ఈ చిత్రం విడుదల కోసం అదే ఆతృతతో ఎదురుచూస్తాను అని అన్నారు.

హీరోయిన్ ప్రియాప్రకాష్ వారియర్ మాట్లాడుతూ, అల్లు అర్జున్ అంటే నాకు చాలా అభిమానం. ఆయనతో పాటు స్టేజ్‌పై నిలబడే అవకాశం వస్తుందని అనుకోలేదు. ఈ చిత్రం తరపున వాలెంటైన్స్‌డేకి ముందుగానే శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అని అన్నారు. చిత్ర దర్శకుడు ఒమర్ లులు మాట్లాడుతూ, మలయాళంలో ఎంతమంది స్టార్స్ ఉన్నా...మా వీడియోను ఎవరూ షేర్ చేయలేదు. అల్లు అర్జున్ మాత్రమే షేర్ చేశారు. చాలామంది కొత్తవాళ్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం అని చెప్పారు. చిత్ర సమర్పకుడు వినోద్‌రెడ్డి మాట్లాడుతూ, అల్లు అర్జున్ సపోర్ట్‌ను జీవితంలో మరచిపోలేనని పేర్కొనగా...తాను బన్నికి పెద్ద అభిమానినని నిర్మాత గురురాజ్ తెలియజేస్తూ... ఎంతో ఫ్యాషన్‌తోనే ఈ రంగంలోకి వచ్చానని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నటుడు అలీ, అశోక్‌రెడ్డి గుమ్మ కొండ, చంటి అడ్డాల, చైతన్యప్రసాద్, నటుడు రోషన్ తదితరు లు పాల్గొన్నారు.



కుర్రాళ్లతో ఉండే సౌఖ్యమదే

నటిగా ఏదైనా చేయగల స్థాయికి చేరుకున్నాను అంటోంది అందాల భామ కాజల్ అగర్వాల్. దశాబ్దంన్నర నట ప్రస్థానంలో కాజల్‌కు ఈ ఆత్మవిశ్వాసం రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. అందుకే ఇప్పుడు తన సినిమాలతో ప్రయోగాలు చేయగలను అని చెప్పుకుంటోంది. కుర్రాళ్లతో సినిమాలు చేయడం ఇందులో భాగమే అన్నది ఈ సుందరి మాట. ఈ యువ హీరోలతో నటించడం వల్ల నవతరం ప్రేక్షకులకూ కొత్తగా పరిచయం కావొచ్చు అనే ఆలోచనలో ఉంది కాజల్. ప్రస్తుతం క్వీన్ తమిళ రీమేక్ పారిస్ పారిస్‌లో నటిస్తోందీ తార. ఇటీవల ఆమె మాట్లాడుతూ....కొంత అనుభవం వచ్చాక దేనికైనా ధైర్యం చేయగలం. అలాంటి ఆత్మవిశ్వాసం నాకూ వచ్చింది. గతంలో స్టార్‌లతో తప్ప నటించాలంటే భయమేసేది. మనల్ని పరిశ్రమలో తక్కువ చేసి చూస్తారనే సందేహం ఉండేది. ఇన్నేళ్లు సినిమాలు చేశాక...ఇప్పుడైనా ప్రయోగాలు చేయకుంటే ఎలా అనిపిస్తోంది. అందుకే మూసకు సెలవిచ్చి కొత్తగా ఏదైనా ప్రయత్నించాలని అనుకుంటున్నాను. గతంలో చేయని పాత్రలు, నటించని భాషల్లో నటించాలని ఉంది. యువ నటులు ఈతరానికి నచ్చే కొత్త కథలు ఎంచుకుంటారు. వాళ్లతో కలిసి నటిస్తే ఈతరం ప్రేక్షకులకూ చేరువకావొచ్చు. కుర్రాళ్లలో ఉండే సౌఖ్యమదే. అని చెప్పింది. తెలుగు తమిళం హిందీ భాషల్లో సినిమాలు చేసిన కాజల్..మలయాళంలో ఇప్పటిదాకా నటించలేదు. త్వరలో మాలీవుడ్‌లోనూ అడుగు పెడతానని చెప్పుకుంది.

మరో వైవిధ్య కథలో


వరుణ్ తేజ్

స్టార్ హీరోలతో పాటు వర్ధమాన హీరోలు కూడా వైవిధ్యభరితమైన చిత్రాలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. కెరీర్ ఆరంభం నుంచే ఆ తరహా కథాంశాలను ఎంపిక చేసుకుంటూ ఇప్పుడు మరింత ఆచితూచి అడుగులేస్తున్నారు వరుణ్‌తేజ్. కంచె, ఫిదా, తొలిప్రేమ, అంతరిక్షం చిత్రాలతో నటుడిగా పేరు తెచ్చుకున్న ఆయనకు తాజాగా విడుదలైన ఎఫ్ 2 చిత్రం భారీ విజయాన్ని అందించింది. అందులో వినోదాత్మకంగా ఆయన పోషించిన పాత్ర ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన మరో వైవిధ్యభరిత చిత్రాన్ని అంగీకరించారని సమాచారం. తమిళంలో సిద్ధార్థ్, బాబీసింహా ప్రధాన పాత్రలు పోషించిన జిగర్తాండ చిత్రాన్ని హరీశ్‌శంకర్ దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో నాగశౌర్య, వరుణ్‌తేజ్‌లు హీరోలుగా నటిస్తారని చెబుతున్నారు. తెలుగు నేటివిటికీ తగ్గట్టుగా కథలో కొన్ని మార్పులు, చేర్పులు కూడా చేశారట. స్క్రిప్టు పనులు కూడా పూర్తికావడంతో ఫిబ్రవరి నెలలో ఈ చిత్రాన్ని ప్రారంభించాలని చిత్రబృందం నిర్ణయించుకుందని అంటున్నారు.

నిర్మాతగా మారిన బొమన్ ఇరానీ

ప్రముఖ బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ ఇకపై నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఇరానీ మూవీ టోన్ పేరుతో ఆయన తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ముంబైలో ఈ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. అమి తాబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలీ వుడ్ ప్రము ఖులు సిద్దార్థ్ రాయ్ కపూర్, అంజుమ్ రాజాబాలి, రోనీ స్క్రీన్‌వాలా, శోభా సంత్, ఇమ్రాన్ హష్మి, రాధికా ఆప్టే తదితరులు ఈ కార్యక్రమానికి హాజర య్యారు. ఈ సందర్భంగా బొమన్ ఇరానీ మాట్లాడుతూ ...నిర్మాతగా మారాలన్న ఆలోచన నాకు చాలా కాలంగా ఉంది. నేను రాసిన కథలను తెరకెక్కిస్తాను. తొలి సినిమాకు దర్శకత్వం వహించేందుకు ఎదురుచూస్తున్నాను. అన్నారు.



తేడా ఏంటో తెలియదు..



సినిమాల్లో పేరు తెచ్చుకోవాలంటే నాయికగానే నటించాలా అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ భామ అంకితా లోఖండే. టీవీ నుంచి సినిమాల్లోకి వచ్చిన ఈసుందరి..కంగనా రనౌత్ నటించిన మణికర్ణికలో కీలక పాత్ర పోషించింది. పవిత్ర రిస్తా అనే సీరియల్ ఆమెకు బాగా పేరు తీసుకురాగా...ఇప్పుడు తొలి చిత్రమే గుర్తుండి పోయేలా అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తోంది. మణికర్ణికలో తన నటనలో ధైర్య సాహసాలు కనిపిస్తాంటోంది. ఒక పాత్రతో ఎందుకు తెరంగేట్రం చేస్తున్నారు అని అడిగితే...నటిగా పేరు తెచ్చుకోవాలంటే నాయికగానే నటించాలా...మంచి పాత్రలు చేస్తే పేరు రాదా అంటోంది. అంకిత మాట్లాడుతూ...నేను ఎక్కువగా పాత్రల గురించి, నటనకు ఆస్కారమున్న సినిమాల గురించి ఆలోచిస్తుంటాను. ఒక హీరో సినిమాలో కేవలం ఆడిపాడటం కంటే ఓ నాయిక ప్రధాన చిత్రంలో మంచి పాత్రలో నటించడం ముఖ్య మనుకుంటాను. నేనేదీ ప్రణాళిక వేసుకోలేదు. కానీ నటనకు ఆస్కార మున్న పాత్రలు చేయాలని అనుకుం టున్నాను. ఇవాళ రేపు సినిమాల్లో పూర్తి పాత్రలో నటించావా, కాసేపా అనేది ఎవరూ చూడటం లేదు. ఉన్నంత సేపు ఆకట్టుకునే క్యారెక్టర్‌లో కనిపించావా లేవా అన్నదే చూస్తున్నారు. అని చెప్పింది.

